ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 05.05.2026 | సంపుటి :12 సంచిక : 285 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## బెంగాల్‌లో బీజేపీ

# ఘనవిజయం



## కేరళలో యూడీఎఫ్ విజయఢంకా • తమిళనాట 'విజయ్'కేతనం



బంగాల్, అసోం, పుదుచ్చేరి ప్రజలకు ధన్యవాదాలు.మీరు కమలాన్ని వికసింపజేశారు. మాకు అద్భుత విజయం కట్టబెట్టారు. అంతేకాదు మహారాష్ట్ర, గుజరాత్, నాగాలాండ్, త్రిపుర ఉపఎన్నికల్లోనూ మాకే పట్టం కట్టారు. భారత్‌ను ప్రజాస్వామ్య మాతృకగా ఎందుకు పిలుస్తారో ప్రజలు ఈ విధంగా నిరూపించారు. నాలుగు రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంత ప్రజలు భారత రాజ్యాంగాన్ని గెలిపించారు. బంగాల్‌లో 93 శాతం పోలింగ్‌తో సరికొత్త రికార్డు సృష్టించారు. గతేడాది బిహార్ ఎన్నికల వేళ నేను ప్రజలకు పిలుపునిచ్చాను. గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు కమలం వికసిస్తుందని చెప్పాను. ఇప్పుడు గంగానది ప్రవహించే ఉత్తరాఖండ్ నుంచి బంగాల్ వరకు అన్నీ నెగ్గాం. గంగానది ఆశీర్వాదం వల్లే ఈ విజయాలు దక్కాయి - మోదీ

## అస్సాంలో ఎన్డీయే హ్యాట్రిక్ • ఎన్డీయే ఖాతాలో పుదుచ్చేరి

## సిట్టింగ్ స్థానాల్లో ఓటమిపాలైన సీఎంలు స్టాలిన్, మమత

### బెంగాల్‌లో విజయం అందించి

# రాజ్యాంగాన్ని గెలిపించారు

- ఐదు రాష్ట్రాల్లో చారిత్రక ఎన్నికలు జరిగాయి
- బెంగాల్ విజయంతో శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆత్మకు శాంతి
- గంగానది, బ్రహ్మపుత్రల ఆశీర్వాదమే ఈ విజయం
- అధిక సంఖ్యలో ఓటర్లు పాల్గొనడం ఈ ఎన్నికల విశేషం
- తమిళనాడు, కేరళ ప్రభుత్వాలకు అండగా ఉంటా
- బీజేపీ కార్యాలయంలో జరిగిన విజయోత్సవంలో మోడీ

వివరాలు లోపలి పేజీల్లో..

### తెలంగాణలోనూ రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

- ఇండియా కూటమికి ఈ ఫలితాలు చెంపపెట్టు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు

### ఉప ఎన్నికల్లోనూ బీజేపీ హవా

దేశవ్యాప్తంగా ఏడింటిలో నాలుగు స్థానాలు కైవసం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు బిజెపికి అనుకూలంగా వచ్చాయి. అసోం, పుదుచ్చేరిలో అధికారం నిలుపుకున్న బిజెపి, బెంగాల్లోనూ విజయభేరి మోగించింది. కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడిఎఫ్ విజయం సాధించింది. తమిళనాట విజయ్ నేతృత్వంలోని టివికె అనూహ్యంగా దూసుకుని వచ్చింది. యావత్ దేశం ఉత్కంఠగా ఎదురుచూస్తున్న పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ తమిళనాడులో నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ హవా కొనసాగింది. డీఎంకే, అన్నాడీఎంకేను దాటి ఆధిక్యంలోకి దూసుకొచ్చింది పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కు గట్టి షాకిస్తూ భాజపా దూసుకెళ్లింది. కేరళలో యూడీఎఫ్ కూటమి ఆధిక్యంలో కొనసాగుతోంది. తమిళనాడులో మొత్తం 234 స్థానాలు ఉండగా.. టీవీకే 104 చోట్ల ఆధిక్యంలో ఉంది. డీఎంకే 62, అన్నాడీఎంకే 68 స్థానాల్లో ముందంజలో ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లో 293 స్థానాలకు గానూ.. భాజపా దాదాపు 205 చోట్ల ఆధిక్యంలో ఉంది. టీఎంసీ 85 చోట్ల ముందంజలో కొనసాగుతోంది. కేరళలో 140 స్థానాలుండగా.. యూడీఎఫ్ 100 సీట్లను గెల్చుకుంది.. ఎల్‌డీఎఫ్ 32 స్థానాల్లో, ఎన్డీయే 3చోట్ల గెలుపొందింది. అస్సాంలో 126 స్థానాలుండగా.. భాజపా 100కు పైగా సీట్లతో హ్యాట్రిక విజయాన్ని నమోదు చేసింది. స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. కాంగ్రెస్ 26 చోట్ల ముందంజలో ఉంది. పుదుచ్చేరీలో 30 స్థానాలకు గానూ ఎన్నార్ కాంగ్రెస్9 చోట్ల గెలిచి 11 చోట్ల ఆధిక్యంలో ఉంది. కాంగ్రెస్ 2 చోట్ల గెలిచి.. 5 స్థానాల్లో ముందంజలో ఉంది. మొత్తంగా బిజెపి తనకున్న

మిగతా 2లో..



## 'సర్' పేరుతో ఓట్లను దొంగిలించిన మోడీ

### బెంగాల్లో బీజేపీ స్పష్టమైన ఆధిక్యంపై సీఎం మమతా బెనర్జీ ఆరోపణలు

**కోల్‌కతా(జనంసాక్షి):** పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల్లో భాజపా 190 స్థానాల్లో ముందంజలో ఉండడంతో అక్కడ బిజెపీ ప్రభుత్వ ఏర్పాటు దాదాపుగా ఖాయమయ్యింది. ఈ క్రమంలో సీఎం మమతా బెనర్జీ కీలక

మిగతా 2లో..

### కేరళలో కాంగ్రెస్ గెలుపు వెనక

## సీఎం రేవంత్ పదునైన వ్యూహం

- యూడీఎఫ్ విజయంపై స్పందించిన తెలంగాణ సీఎం
- కూటమి నాయకులు, కార్యకర్తలు విజయం సాధించినందుకు అభినందనలు తెలిపిన ముఖ్యమంత్రి
- కేరళలో విజయం.. తెలంగాణ కాంగ్రెస్‌కు మరింత బలం: మహేశ్ కుమార్ గౌడ్
- కేరళలో కాంగ్రెస్ విజయానికి సీఎం రేవంత్ కృషి : అద్దంకి దయాకర్



**హైదరాబాద్(జనంసాక్షి):** కేరళలో కాంగ్రెస్ విజయంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి నాయకులు, కార్యకర్తలు విజయం సాధించినందుకు అభినందనలు తెలిపారు. ఈ చారిత్రాత్మక విజయానికి నాయకత్వం వహించిన రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, దీపాదాస్ మున్షీకి అభినందనలు తెలియజేశారు. కేరళలో ప్రచారం సందర్భంగా

మిగతా 2లో..

# అకాల వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### ధాన్యం కొనుగోళ్లపై మంత్రి ఉత్తమ్ ఆదేశాలు

- వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న జిల్లాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలి
- కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- అధికారులు, సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలి
- సచివాయలంలో అధికారులతో మంత్రి ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్(జనంసాక్షి):** అకాల వర్షాల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో రైతు లు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కు మార్ రెడ్డి ఉన్నతాధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ధాన్యం కొనుగోళ్లపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 14.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రూ.2001.96 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశాం. రా నున్న 3 నుంచి 4 రోజుల పాటు అకాల వర్షాలు పడే అవకాశం ఉంది. అధికా రులు అప్రమత్తంగా ఉండాలి. ఈదురుగాలులు, వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున నల్గొండ, నిజా మాబాద్ జిల్లాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టా లి. వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కొను గోలు కేంద్రాల నుంచి వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసమైనన్ని తార్పాలిన్లు (పాలీథిన్ కవర్లు) సిద్ధంగా ఉం చాలి. అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోకుండా ఉండేలా అధికారు లు, సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా అన్ని జాగ్రత్తలు తీసు కోవాలి' అని అన్నారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం కురిసిన భారీ వర్షాలకు అన్నదాతలు అతలాకుతలమయ్యారు.



- హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్లలో పన్నువసూలుకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ వెసులుబాటు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రి మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు


# తెలంగాణలో భూముల ధరల పెంపు

### రిజిస్ట్రేషన్ శాఖకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

### రాష్ట్రంలోని 9 జిల్లాల్లో సబ్‌స్టేషన్ల వద్ద సోలార్ పవర్ జనరేషన్ ప్లాంట్ల ఏర్పాటు

**హైదరాబాద్(జనంసాక్షి):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రి మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. విద్యుత్ కొనుగోలు, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్రాజెక్టులలో జరిగిన అక్రమాలపై విచారణకు సంబంధించిన కమిషన్ నివేదికను కేంద్ర దర్యాప్తు సంస్థ కు అప్పగించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.విద్యుత్తు కొనుగోళ్లతో పాటు భద్రాద్రి, యాదాద్రి విద్యుత్తు ప్లాంట్లలో జరిగిన అవకతవకలు, అక్రమాలపై ప్రభుత్వం విచారణ కమిషన్ను ఏర్పాటు చేసింది. 2024 మార్చి 14వ తేదీన కమిషన్స్ ఆఫ్ ఇన్క్వైరీ చట్టం ప్రకారం రిటైర్డ్ జస్టిస్ ఎల్. నరసింహా రెడ్డి అధ్యక్షతన కమిషన్ ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు 2024 జులైలో ఆయన విచారణ నుంచి తప్పుకోవటంతో జస్టిస్ మదన్ బి. లోకూర్‌ను కమిషన్‌గా నియమించారు. 2024 అక్టోబర్లో కమిషన్ మొత్తం 114 పేజీల నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. అనంతరం 2025 జనవరి 4వ తేదీన జరిగిన కేబినేట్ సమావేశంలో ఈ నివేదికపై తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై అడ్వకేట్ జనరల్ అభిప్రాయం తీసుకోవాలని నిర్ణయించింది. నివేదికను పరిశీలించిన అడ్వకేట్ జనరల్ తన సూచనలు, అభిప్రాయాలను తెలియజేశారు. వాటన్నింటినీ ఈ రోజు కేబినేట్ చర్చించింది. ప్రధానంగా అంతర్రాష్ట్ర అంశాలు, కేంద్ర ప్రభుత్వ రంగ

మిగతా 2లో..




## ఏసీబీకి చిక్కిన జూనియర్ అసిస్టెంట్

### రూ.లక్ష లంచం తీసుకుంటుండగా అదుపులోకి తీసుకున్న అధికారులు

**హైదరాబాద్(జనంసాక్షి):** బోరబండ జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు చేపట్టింది. జూనియర్ అసిస్టెంట్ శ్రీలత రూ.లక్ష లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డీఎస్పీ మాజిద్ అలీఖాన్ ఆధ్వర్యంలో సోదాలు కొనసాగుతున్నాయి.

## హార్మ్యూజ్ జలసంధి గుండా నౌకల సురక్షిత ప్రయాణానికి

# ప్రాజెక్ట్ ఫ్రీడమ్








### పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతోన్న వేళ ట్రంప్ కీలక నిర్ణయం

**వాషింగ్టన్(జనంసాక్షి):** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతోన్న వేళ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. హర్మూజ్ జలసంధిలో చిక్కుకుపోయిన విదేశీ నౌకలను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చడానికి 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను ప్రకటించారు. ఈ మేరకు ఆయన ట్రూత్‌సోషల్‌లో పోస్టు పెట్టారు. ఈ యుద్ధంలో భాగం కాని చాలా దేశాలకు చెందిన నౌకలు ఈ జలసంధిలో చిక్కుకుపోయాయని ట్రంప్ తెలిపారు. వాటిని విడిపించుకోవడం కోసం ఆయా దేశాలు అమెరికా సాయాన్ని కోరాయన్నారు. వారి అభ్యర్థన మేరకు హర్మూజ్ నుంచి నౌకలు సురక్షితంగా బయటపడేందుకు తాము సాయం చేస్తామన్నారు. ఇందుకోసం ఆయా నౌకలకు అమెరికా బలగాలు మార్గనిర్దేశం చేస్తాయన్నారు. దీనికి 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'గా పేరు పెట్టారు. ఇది సోమవారం ఉదయం (పశ్చిమాసియా కాలమానం ప్రకారం) నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఈ ప్రక్రియను ఒక మానవతా చర్యగా ట్రంప్ అభివర్ణించారు. చాలా నౌకల్లోని సిబ్బంది ఆహారం, నిత్యావసరాల నిల్వలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. తాము తలపెట్టిన ఈ మానవతా ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలిగినా.. దాన్ని బలప్రయోగంతో ఎదుర్కొంటామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా తమ ప్రతినిధులు ఇరాన్‌తో సానుకూలమైన చర్చలు జరుపుతున్నారన్నారు. ఈ చర్చలు అందరికీ మంచి ఫలితాలిస్తాయని తాను భావిస్తున్నట్లు తెలిపారు.

### తెలంగాణకు పొంచి ఉన్న

# హీట్‌వేవ్ ముప్పు



- ప్రమాదంలో 1.60 కోట్ల మంది ప్రజలు
- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- 46 డిగ్రీలు తాకడంతో రాష్ట్రంలో 301 మండలాలకు ముప్పు
- తాజా నివేదకలో ప్రభుత్వం వెల్లడి
- వడదెబ్బతో పెరుగుతున్న మరణాలు
- 37 డిగ్రీలు దాటితే అప్రమత్తం ప్రజలు కావాల్సిందేనన్న అధికారులు

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ రాష్ట్రానికి వడగాలులు ప్రకృతి విపత్తులా పరిణమించాయి. ఏటా పెరుగుతున్న వాతావరణ కాలుష్యం, తరిగిపోతున్న పచ్చదనం, మితిమీరిన ప్లాస్టిక్ వాడకం తదితరాలు ఇందుకు ముఖ్య కారణం. గతం కంటే భిన్నంగా ఈ ఏడాది సమ్మర్‌లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలను తాకడంతో రాష్ట్రంలోని 301 మండలాల్లో 1.60 కోట్ల మంది వడగాలుల ముప్పు ముంగిట నిల్చున్నారు. 6 మండలాలు తీవ్ర ముప్పు, 106 మండలాలు అధిక 189 మండలాలు మధ్యస్త ముప్పు జాబితాలో ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో 2014-25 సంవత్సరాల మధ్య 612 మండలాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు, వడగాలుల సంఖ్య ఆధారంగా ఈ పరిణామాన్ని తెలంగాణ అభివృద్ధి ప్రణాళికా సంస్థ(తెలంగాణ డెవలప్?మెంట్ ప్లానింగ్ సొసైటీ), వాతావరణ శాఖలు సంయుక్తంగా అంచనా వేశాయి. సాధారణ స్థితితో పోలిస్తే వరుసగా 3 రోజులపాటు 4 డిగ్రీల కంటే

మిగతా 2లో..

## బెంగాల్‌లో విజయం అందించి భారత రాజ్యాంగాన్ని గెలిపించారు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఇవాళ భాజపా చరిత్ర సృష్టించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఐదు రాష్ట్రాల ప్రజలు భారత రాజ్యాంగాన్ని గెలిపించారని అన్నారు. ఇది ప్రజలకు నిజమైన భరోసా ఇచ్చిన రోజు. బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి ప్రజలకు ధన్యవాదాలు. అని ప్రధాని అన్నారు. నాలుగు రాష్ట్రాలతో పాటు ఒక కేంద్రపాలిత ప్రాంతంలో ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ప్రధాని మోదీ దిల్లీలోని భాజపా కార్యాలయానికి సంప్రదాయ పంచెకట్టుతో వచ్చారు. పశ్చిమబెంగాల్, అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించడంతో పార్టీ ప్రధాన కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన విజయోత్సవ సంబరాల్లో ప్రధానమంత్రి పాల్గొన్నారు. బెంగాలీ ధోతితో విచ్చేసిన ప్రధానికి పార్టీ అగ్రనేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. 'మోదీ మోదీ' నినాదాలతో కార్తకర్తలు హోరెత్తించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, బెంగాల్ బీజేపీ విజయంతో శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆత్మకు ఉపశమనం కలిగిందన్నారు. పార్టీ కార్యకర్తల సంబరాల్లో నేనూ పాల్గొంటున్నా. బెంగాల్‌లో 93 శాతం పోలింగ్‌తో సరికొత్త రికార్డు సృష్టించారు. తమిళనాడు, కేరళలోనూ పోలింగ్ శాతం బాగా పెరిగింది. దేశంలో 20కిపైగా రాష్ట్రాల్లో భాజపా, ఎన్డీఏ ప్రభుత్వాలు ఉన్నాయి. గంగానది ప్రవహించే ఉత్తరాఖండ్ నుంచి బెంగాల్ వరకూ నెగ్గాం. గంగానది ఆశీర్వాదం వల్లే ఈ విజయాలు దక్కాయి. బ్రహ్మపుత్ర ఆశీర్వాదం వల్ల అస్సాంలోనూ హ్యాట్రిక్ సాధించాం. పుదుచ్చేరిలో 2021లో ఇచ్చిన హామీలను మేం నెరవేర్చాం. బెంగాల్‌లో గెలుపుతో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆత్మకు శాంతి లభిస్తుంది. ఇక నుంచి బెంగాల్‌లో భయాందోళనలు ఉండవని ప్రకటించారు. సుపరిపాలన అందించినందుకే ప్రజలు మాకు పట్టం కట్టారు. తమ రాష్ట్రాలు అభివృద్ధి చెందాలంటే భాజపా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు. భాజపా అంటేనే అభివృద్ధి.. సంక్షేమం అని మోదీ పేర్కొన్నారు.బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు అసాధారణమైన, చారిత్రక తీర్పునిచ్చారని, ఆ ఆనందం కార్యకర్తల కళ్లలో స్పష్టంగా కనిపిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. బెంగాల్‌లో నూతన చరిత్రను ఆవిష్కరించిన బీజేపీ కార్యకర్తలను అభినందించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ బాధ్యతలు చేపట్టాక ఆయన మార్గదర్శకంలో జరిగిన తొలి ఎన్నికలు ఇవంటూ ఆయనకు అభినందనలు తెలిపారు. గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకూ ప్రతిచోట కమలం వికసించిందని, కామాక్ష అమ్మవారి ఆశీర్వచనం పుష్కలంగా లభించిందని చెప్పారు. అభ్యుదయ బెంగాల్ కోసం ఆయన కలలుగన్నారని, అది ఇన్నేళ్ల తర్వాత వాస్తవరూపం దాల్చిందని పేర్కొన్నారు. బెంగాల్ ప్రజలు బీజేపీకి ఒక అవకాశం ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జెపి నడ్డా, ఢిల్లీ ముఖ్యమంత్రి తదితరులు పాల్గొన్నారు.

## కేరళలో కాంగ్రెస్ గెలుపు వెనక తెలంగాణ సీఎం వ్యూహాలు

తనపై తమ ప్రేమను కురిపించిన యూడీఎఫ్ మద్దతుదారులకు, కేరళ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ ప్రజలందరి తరపున తాను వారికి ఎల్లప్పుడూ కృతజ్ఞుడనై ఉంటానని అన్నారు. మనం అభివృద్ధిని విశ్వసిస్తామని, ఒక దశాబ్దం పాటు నిరాశ, ద్రోహం తర్వాత కాంగ్రెస్? ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒక గొప్ప భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ మేరకు రేవంత్? రెడ్డి ట్వీట్ చేశారు.కేరళం కాంగ్రెస్ విజయంలో రేవంత్ రెడ్డి పాత్ర : కేరళలో కాంగ్రెస్ విజయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాలు ఉన్నాయని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ వెల్లడించారు. యూడీఎఫ్ విజయంలో సీఎం రేవంత్ రెడ్డి క్రియాశీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి కేరళ సీఎం విజయన్‌ను వారి సమయం అయిపోయిందని, వెళ్లిపో అని నేరుగా విమర్శించారని గుర్తు చేశారు. కేరళ అభివృద్ధిని ఎక్కువ చేసి చూపించిన విజయన్‌ను నిలదీయడంతో పాటు లేఖలు కూడా రాశారని తెలిపారు. తెలంగాణలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూడమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని, రుణమాఫీ, ఉచిత బస్సు, సన్న బియ్యం వంటి కార్యక్రమాలను ప్రచారంలో వివరించారని అద్దంకి దయాకర్ పేర్కొన్నారు.

**కేరళలో విజయం.. తెలంగాణ కాంగ్రెస్‌కు మరింత బలం: మహేశ్ కుమార్**

హైదరాబాద్: కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఘన విజయం సాధించడం పట్ల టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది చరిత్రాత్మక విజయమని పేర్కొన్నారు. కేరళలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, నాయకులు ప్రచారం నిర్వహించడం.. తెలంగాణ పాలన చూసి ఓట్లు వేయాలని కోరడం చాలా ప్రభావం చూపించిందన్నారు. కేరళలో విజయం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలాన్ని.. మరోసారి విజయం సాధిస్తామన్న నమ్మకాన్ని కలిగించిందని వెల్లడించారు. తమిళనాడులో మెజారిటీ స్థానాలు గెలుచుకున్న టీవీకే అధినేత విజయ్‌కు అభినందనలు తెలిపారు. ఈ ఐదు అసెంబ్లీల ఎన్నికల ఫలితాలపై ఇండియా కూటమి సమీక్ష చేసి.. మరింత బలోపేతం అయ్యేందుకు చర్యలు చేపడుతుందని తెలిపారు.కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ విజయం సాధించింది. ఈ విజయం వెనక తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాలు ఉన్నాయని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు.

## ఉప ఎన్నికల్లోనూ బీజేపీ హవా

న్యూఢిల్లీ(జనంసాక్షి):

దేశంలో ఐదు రాష్ట్రాలకు సంబంధించిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడు తున్న తరుణంలోనే దేశవ్యాప్తంగా జరిగిన ఉప ఎన్నికల్లోనూ బిజెపి సత్తా చాటింది. ఆయా రాష్ట్రాల్లో జరిగిన 7 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల ఫలితాలూ వెలువడ్డాయి. ఈ ఏడాది జనవరిలో విమాన ప్రమాదంలో మరణించిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌తో సహా ఆయా సిట్టింగ్ ఎమ్మెల్యేలు మృతిచెందడం వల్ల ఈ ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. మహారాష్ట్రలో రాహురి, బారామతి; కర్ణాటకలో బాగల్‌కోట్, దావణగెరె సౌత్; గుజరాత్‌లో ఉమ్రత్, నాగాలాండ్‌లో కోరిడాండ్, త్రిపురలో ధర్మనగర్‌లో ఈ ఉప ఎన్నికలు జరిగాయి. తాజాగా వీటి ఫలితాలు కూడా వచ్చేశాయి. ఈ ఏడింట్లో నాలుగు స్థానాల్లో భారతీయ జనతా పార్టీ జయకేతనం ఎగురవేయగా.. మరో మూడింట్లో కాంగ్రెస్ గెలుపొందింది.

తెలంగాణ ప్రభుత్వం
**వ్యవసాయమార్కెట్ కమిటీ, పటాన్ చెరు,**
టెండరు నోటీసు

నెం.వ్య.మా.క./పి/90/2024-25/ 656 తేది: 04.05.2026

క్ర.సం. 1,పనిపేరు: మార్కెట్ యార్డ్, పటాన్ చెరులో గార్బేజ్ నిర్వహణ (చెత్త ఉడ్చి ఎత్తి వేయుట మరియు అట్టి చెత్తను మార్కెట్ బయటకు తరలించుట) ధరావత్తు ధర: 1,00,000/-, టెండరు షెడ్యూల్ ధర: 3,000/-
రిమార్కులు: ఇట్టి ధరావత్తు మరియు టెండర్ షెడ్యూల్ సెక్రటరీ, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ, పటాన్‌చెరు పేరు మీద డిమాండ్ డ్రాఫ్ట్ తీయగలరు.
టెండర్ షెడ్యూల్ జారీ తేదీ : 06.05.2026 నుండి 09.05.2026 వరకు (ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు) టెండర్ షెడ్యూల్ సమర్పించుట తేదీ: 11.05.2026 మధ్యాహ్నం 12:00 గంటల నుండి 12:30 వరకు. టెండర్ షెడ్యూల్ తెరచు తేదీ: 11.05.2026 మధ్యాహ్నం 12.35 గంటలకు.
ఈ క్రింది తెలిపిన అర్హతలు కలిగిన సంస్థలు లేదా వ్యక్తులు టెండర్ షెడ్యూల్ ధర మరియు ధరావత్తు డిమాండ్ డ్రాఫ్ట్ సమర్పించిన తరువాతనే టెండర్ షెడ్యూల్ ఇవ్వబడును.
1. ఏదేని ప్రభుత్వరంగ సంస్థలయందు లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ యందు కనీసం (2) సంవత్సరాలు నిర్వహించిన అనుభం కలిగి యుండాలి. అట్టి అనుభవ ధ్రువీకరణ పత్రం జతపరచవలెను.
2. గార్బేజ్ క్లినింగ్ లేబర్, జీఎస్టీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి. అట్టి పత్రములను జతపరచవలెను.
3. చెత్త తరలింపునకు రెండు స్వంత / లీజకు తీస్కొనిన వాహనము (టిప్పర్లు) వాహనము ఉండవలెను.అట్టి స్వంత వాహనము వివరాలు / లీజు వాహన వివరములు అగ్రిమెంట్ జగతపరుచవలెను.
4. చెత్త చెదారం ఉడుచుట, ప్రోగు చేయుట మరియు అట్టి చెత్తను మార్కెట్ బయటకు తరిలించుటకు గాను స్వంత లీజుకు తీసుకొనబడిన డంపింగ్ యార్డు లేదా ప్రభుత్వ డంపింగ్ యార్డ్ నందు దింపుటకు వారిచే అనుమతి పొందిన పత్రమును జతపరచవలెను.
5. కనీసము (08-10) మంది లేబర్‌లను నియమించవలెను. అట్టి లేబర్ యొక్క వివరములు జతపరుచవలెను.
6. టెండర్ షెడ్యూల్ పొందుపరిచిన నియమ నిబంధలను తప్పకుండ పాటించవలెను.సంప్రదించు చిరునామా : సెక్రటరీ(ఎఫ్ఏసీ), 9440576101,Email:amcptc@gmial.com

సం/-
కార్యదర్శి (ఎఫ్ఏసీ)
వ్యవసాయ మార్కెట్ కమిటీ, పటాన్‌చెరు
DIPR No.1880-PP/CL/ADVT/2026-27

# బెంగాల్‌లో బీజేపీ ఘనవిజయం

రెండు రాష్ట్రాలకు తోడు బెంగాల్లో పాగా వేసింది. కేరళలో పదేళ్ల తరవాత మళ్లీ కాంగ్రెస్ అధికారం దక్కించుకుంది. తమిళనాట ద్రవిడ పార్టీలకు పరాభవం తప్పలేదు.

బెంగాల్‌లో పాగా వేసిన బిజెపి

బెంగాల్ దంగల్‌లో బిజెపి గెలిచింది. అనుకున్నట్లుగానే మమతను మట్టి కరిపించింది. టీఎంసీ కంచుకోటను భాజపా బద్దలు కొట్టింది. 15 ఏళ్లుగా ఎదురులేకుండా బెంగాల్‌ను పాలించిన మమతా బెనర్జీకి గట్టి షాకిచ్చింది. గత రెండు దఫాల్లో సాధ్యంకాని విజయం ఈసారి కమలనాథుల వశమైంది. పశ్చిమబెంగాల్ లో అనుసరించిన పదునైన వ్యూహం ఈసారి పార్టీకి కచ్చితమైన ఫలితాన్ని తీసుకొచ్చింది. భాజపా అగ్రనేత అమిత్‌షా అన్నీ తానై ఈ ఎన్నికల్లో పార్టీని నడిపించారు. మొత్తం 293 స్థానాల్లో 205 స్థానాల్లో బిజెపి ఘన విజయం సాధించింది. మమతా బెనర్జీ పార్టీ 85 స్థానాలకు పరిమితం అయ్యింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా అంచనాలను తలకిందులు చేస్తూ మమతా బెనర్జీ సత్తా చాటారు. నాడు భాజపా 10,000 కంటే తక్కువ ఓట్ల తేడాతో 40 స్థానాలు, 5,000 కంటే తక్కువ ఓట్లతో 20 స్థానాలు కోల్పోయి 77 స్థానాలకే పరిమితమైంది. దీంతో దీదీని ఓడించడం అంత సులువు కాదని గ్రహించిన భాజపా వ్యూహాన్ని మార్చుకొంది. సునీల్ భన్సల్ పార్టీ ఇన్‌ఛార్జిగా.. వ్యవస్థీకృత మార్పులు తీసుకొచ్చారు. అమిత్‌షాకు భన్సల్ నమ్మకస్తుడని పేరు. టికెట్ల పంపిణీ విషయంలో సెలబ్రిటీలు, ఫిరాయింపుదార్లకు ప్రాధాన్యం ఇవ్వకుండా క్షేత్రస్థాయిలో పట్టున్న పార్టీ నాయకులకు భాజపా పెద్దపీట వేసింది. ప్రతి బూత్‌స్థాయిలో 300 ఓట్లను సమీకరించగల వారికే టికెట్లు కేటాయించింది. స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన చోట్ల పుంజుకోవడానికి బూత్ స్థాయి మేనేజ్‌మెంట్‌కు తెరతీసింది. పోలింగ్ కేంద్రాల్లో బలమైనవి, దృష్టిపెట్టాల్సినవి, బలహీనమైనవి అంటూ మూడు వర్గీకరణలు చేసింది. ఇక్కడే 'పన్నా ప్రముఖ్' వ్యవస్థ పనిచేసింది. ప్రతి కార్యకర్త 10-15 కుటుంబాలతో సత్సంబంధాలు నెరిపి 30-60 మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనేలా చేశారు. దీంతోపాటు భాజపా 'శక్తికేంద్రాలు'గా వర్గీకరించుకొన్న క్లస్టర్ల నుంచి అధిక పోలింగ్ ఉండేలా నిర్దేశిరచారు. ఇక అమిత్‌షానే స్వయంగా 152కు పైగా నియోజకవర్గాల్లోని 44,000 పోలింగ్ కేంద్రాల పరిధిలో జరిగిన సమావేశాలను పర్యవేక్షించారంటే భాజపా ఏ స్థాయిలో దృష్టిపెట్టిందో అర్థం చేసుకోవచ్చు. పన్నా ప్రముఖ్



నెట్‌వర్క్‌ను సునీల్ భన్సల్ చూసుకోగా.. బూత్ స్థాయి సమన్వయ బాధ్యతలను భూపేంద్ర యాదవ్ స్వీకరించారు. ఫలితంగా బెంగాల్‌లో రికార్డ్ స్థాయిలో దాదాపు 92శాతం పోలింగ్ నమోదైంది. ఇది భాజపాకు కచ్చితంగా కలిసొచ్చింది. బూత్ స్థాయి సమావేశాల్లో కార్యకర్తలు

మమత సర్కారు వైఫల్యం, శాంతి భద్రతల పరిస్థితి, బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు, ఆర్జీకర్ ఆస్పత్రిలో వైద్యురాలిపై హత్యాచారం వంటివి ప్రస్తావించారు. ఇక ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలి తల్లికి కూడా పానిహటి నుంచి భాజపా టికెట్ కేటాయించి.. ఆ అంశాన్ని ప్రచారంలోకి తీసుకొచ్చింది. దీంతో మమతా విజయావకాశాలను దెబ్బకొట్టినట్లయ్యింది. పశ్చిమ బెంగాల్‌లో 70శాతం ఉన్న హిందూ ఓటర్ల ఏకీకరణెళి లక్ష్యంగా భాజపా పనిచేసింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను దృష్టిలోపెట్టుకొని వ్యూహాలను అమలు చేసింది.

2021 ఎన్నికల వేళ నేరుగా మమతా బెనర్జీని లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేసి భాజపా దెబ్బతింది. ఈసారి మాత్రం ఆ తప్పు చేయలేదు. స్థానిక ఎమ్మెల్యేల పనితీరు, అవినీతిని లక్ష్యంగా చేసుకొని భాజపా శ్రేణులు ప్రచారం చేశాయి. 220 నియోజకవర్గాల్లోని టీఎంసీ ఎమ్మెల్యేలపై 'ఛార్జిషీట్లు' విడుదల చేసి ప్రజల్లోకి తీసుకెళ్లారు. 10,000 కిలోమీటర్ల మేరకు భాజపా పరివర్తన్ యాత్రను చేపట్టింది. ఫలితంగా 77 మంది అభ్యర్థులను టీఎంసీ మార్చుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈసారి ఎన్నికల్లో మమతా బెనర్జీకి మొదటి నుంచి అనుకూలించలేదు. ఎన్నికల తేదీలు ప్రకటించిన వెంటనే టీఎంసీ అనుకూల అధికారుల బదిలీలు, ఐప్యాక్‌పై ఈడీ దాడులు దీదీని ఉక్కిరిబిక్కిరి చేశాయి. దీనికితోడు ప్రతి 140 మంది ఓటర్లకు ఒక సిబ్బంది చొప్పున మొత్తం 2.4 లక్షల మంది కేంద్ర సాయుధ బలగాలను మోహరించారు. ఈ నిర్ణయంతో పశ్చిమబెంగాల్‌లో అధికార పార్టీల కార్యకర్తలకు సహజంగా ఉండే దూకుడుకు క్లెళం వేసినట్లైంది. దీనికితోడు సర్ విషయంలో న్యాయస్థానాల వద్ద మమత సర్కారు చేసిన తీవ్ర వ్యాఖ్యలు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీశాయి. పశ్చిమబెంగాల్‌లో మహిళా ఓటర్లను ఆకట్టుకొన్న పార్టీకే విజయం లభిస్తుంది. ఇప్పటికే టీఎంసీ నుంచి వారికి లక్ష్మీభాండార వంటి పలు పథకాలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో మహిళా సాధికారతే తమ మ్యానిఫెస్టో లక్ష్యమంటూ భాజపా అగ్రనేత అమిత్‌షా ప్రకటించారు. అంతేకాదు, ప్రతి మహిళకు నెలకు రూ.3,000 ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం మమత సర్కారు ఇస్తున్న దానికిది రెట్టింపు. గర్భిణులకు రూ.21,000, మహిళలకు ఉచిత బస్సు, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్త్రీలకు 33శాతం రిజర్వేషన్, యువతకు నెలకు రూ.3,000 భృతి, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి ఏక మొత్తంగా రూ.15,000 మద్దతు ప్రకటించింది. వరిని క్వింటాల్ రూ.3,100కు కొనుగోలు వాగ్దానం, పీఎం కిసాన్ సమ్మాన్ నిధిలో రాష్ట్ర వాటా పెంచి రైతులకు ఏటా రూ.9,000 చెల్లించేట్లు ఇచ్చిన హామీలు ఆకర్షించాయి. త్తర బెంగాల్‌పై పట్టు బిగించి.. సహజంగానే ఉత్తరబెంగాల్‌లో భాజపాకు పట్టుంది. ఇక్కడ తేయాకు తోటల సంక్షోభంతో ఇబ్బందులు పడుతున్న రాజబోంగ్షీల సమస్యలపై పార్టీ ఈసారి దృష్టిపెట్టింది. వీరి సంఖ్య 10 లక్షలకు పైగానే ఉంటుంది. ఇక్కడ 2 శాతం ఓట్లు పెరిగినా.. ఈ ప్రాంతంలో తమ సీట్లను 40కు పైగా పెంచుకొనే అవకాశాన్ని గ్రహించి వాడుకొంది. స్వయంగా అమిత్‌షా ఈ ప్రాంతంలో ప్రచారానికి వచ్చారు. శాంతిభద్రత, సరిహద్దుల రక్షణ విషయంలో భాజపా తనదైన శైలిలో ప్రచారం చేసింది. పార్టీ అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లోనే 100? కంచె నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించింది. పశువుల అక్రమ రవాణా, అక్రమ చొరబాట్లను అణచివేస్తామన్న హామీలు ఓటర్లపై పనిచేశాయి. పశ్చిమబెంగాల్‌లో 'బయటవారు' అన్న ముద్ర పోగొట్టుకోవడానికి భాజపా ప్రచారంలో కూడా జాగ్రత్తలు తీసుకొంది. సువేందు అధికారి, సుకాంత్ మజుందార్, దిలీప్ ఘోష్ వంటివారిని ముందుంచి ప్రచారం చేయించింది. కీలక ప్రాంతాల్లో మాత్రం కేంద్ర నేతలే ప్రచారం చేశారు. కేంద్ర మంత్రి అమిత్ షా రాష్ట్రంలో ఏకంగా 66 ర్యాలీలు చేపట్టారు. ప్రధాని మోదీ 18 కార్యక్రమాల్లో, జేపీ నడ్డా 10 ర్యాలీల్లో ప్రచారాన్ని నడిపించారు. ఇలా వ్యూహాత్మకంగా మమతను దెబ్బకొట్టారు.

**కేరళలో మూడు సీట్లు గెల్చుకున్న బిజెపి**

కేరళలో పదేళ్ల తర్వాత భాజపా ఖాతా తెరచింది. నేమోం, చాతన్నూర్, కాళకూటం అసెంబ్లీ నియోజకవర్గాలను కైవసం చేసుకుంది. తమకు ఒక్క సీటు కూడా రాదని కాంగ్రెస్, సీపీఎంలు చేసిన వ్యాఖ్యలకు ఈ ఫలితాలే సమాధానమని కాషాయ పార్టీ కేరళ అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ తాను పోటీ చేసిన కంజిరప్పల్లిలో మూడో స్థానంలో నిలిచారు. నేమోం స్థానంలో రాజీవ్ చంద్రశేఖర్ తన సమీప అభ్యర్థిపై 4,978 ఓట్ల తేడాతో గెలుపొందారు. చాతన్నూర్‌లో బీబీ గోపకుమార్ 4,398 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కాళకూటంలో కేంద్ర మాజీ మంత్రి వి.మురళీధరన్ 428 ఓట్ల తేడాతో గ్టటెక్కారు.

## 'సర్' పేరుతో ఓట్లను దొంగిచించిన మోడీ

ప్రకటన విడుదల చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో భాజపా ఓట్లను దొంగిలించిందని ఆరోపించారు. ఈ మేరకు ఆమె ఓ వీడియోను విడుదల చేశారు. 'ఏజెంట్లు, అభ్యర్థులు ఎవరూ కౌంటింగ్ కేంద్రాలను విడిచి వెళ్లొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. ఇది భాజపా పథకం. మొదటి రెండు, మూడు రౌండ్లలో వారే ఆధిక్యంలో ఉన్నట్లుగా చూపిస్తారని నేను ముందు నుంచి చెబుతూనే ఉన్నాను. కొన్నిచోట్ల రెండు, మూడు రౌండ్ల తర్వాత కౌంటింగ్ ఆపేశారు. టీఎంసీని అణచివేసేందుకు కేంద్ర బలగాలను బలవంతంగా ఉపయోగిస్తున్నారు. సీట్ల ఆధిక్యంపై తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల సంఘం కేంద్ర బలగాలతో కలిసి ఇష్టానుసారం వ్యవహరిస్తోంది. రాష్ట్ర పోలీసులు కూడా కేంద్ర బలగాలకు పూర్తిగా లొంగిపోయారు' అని మమత ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ ఏజెంట్లు, కార్యకర్తలు ఆందోళన చెందొద్దని, ధైర్యంగా ఉండాలని కోరారు. ఇంకా చాలా రౌండ్లు ఉన్నాయని.. తుది ఫలితాల్లో తమదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. కాగా.. 293 సీట్లకు ఓట్ల లెక్కింపు జరుగుతుండగా.. 190 స్థానాల్లో భాజపా ఆధిక్యంలో ఉంది. టీఎంసీ 97 స్థానాల్లో, కాంగ్రెస్ 1 చోట ఆధిక్యంలో ఉన్నాయి.ఈ క్రమంలో ఎన్నికల కౌంటింగ్‌కు ముందు బీజేపీపై మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. చాలా ప్రాంతాల్లో విద్యుత్ కోతలు చోటు చేసుకున్నాయన్నారు. సీసీ టీవీలు కూడా ఆఫ్ అయ్యాయని పేర్కొన్నారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లు ఉంచిన ప్రదేశాలకు వాహనాల రాకపోకలు కొనసాగిస్తున్నాయని చెప్పారు. ఇవన్నీ బీజేపీ అదేశాల మేరకే జరుగుతున్నాయని ఆమె ఆరోపించారు.

## తెలంగాణకు పొంచి ఉన్న 'హీట్‌వేవ్' ముప్పు

అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం లేదంటే 45 డిగ్రీల ఉష్ణోగ్రత దాటిన చోట హీట్‌వేవ్ ఉన్నట్లు గుర్తిస్తారు. ఈ ప్రమాణాల ప్రకారం 2014 నుంచి గత సంవత్సరం వరకు నల్గొండ జిల్లాలో అత్యధికంగా వడగాలులు నమోదయ్యాయి. ఇక్కడి మండలాలు అత్యధిక ముప్పు ముంగిట ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, సూర్యాపేట, కరీంనగర్ జిల్లాల్లోని పలు మండలాలు కూడా ఇదే జాబితాలో ఉన్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ఆరుబయట పనిచేసే కార్మికులు, అన్నదాతలు, రైతు కూలీలు, ఇతర వృత్తుల వారు ఎక్కువ సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. వడగాలుల బారినపడి 2014 నుంచి ఇప్పటివరకు ఏటా కనీసం 100 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది ఆస్పత్రుల పాలవుతున్నారు. ఈ ఏడాది ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో మరణాలు సంభవిస్తున్నాయి.అధిక ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బతో శనివారం ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. జగిత్యాల జిల్లాలోని ఎండపల్లి మండలం మారేడుపల్లికి చెందిన జాగేటి రాధ(52), ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అమ్మపాలెనికి చెందిన తేజావత్ చాప్లి(75) అస్వస్థతకు గురై మృతిచెందారు. వాతావరణంలో ఉష్ణోగ్రత 37 డిగ్రీలు దాటినట్లయితే శరీరం బయటి వేడిని స్వీకరించడం ప్రారంభిస్తుంది. అప్పుడు శరీరాన్ని చల్లగా ఉంచేందుకు అంతర్గత అవయవాలు అధికశాతం చెమటను విడుదల చేస్తాయి. ఆ సమయంలో తగినంత నీరు, ద్రావణాలు తీసుకోనట్లయితే డీహైడ్రేషన్‌కు గురవుతారు. రాష్ట్రంలో ఏప్రిల్, మే నెలలతోపాటు జూన్ 15వ తేదీ వరకు ఉష్ణోగ్రతలు 42-45 డిగ్రీల మధ్య నమోదవుతుంటాయి. అంటే అన్ని జిల్లాల్లో ప్రజలు డీహైడ్రేషన్ బారిన పడేందుకు అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్-2026ను విడుదల చేసింది. అన్ని ఆస్పత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతోంది. చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ, కూలింగ్ షెడ్లను ఏర్పాటు చేస్తోంది.

## ఓఆర్ఆర్‌పై వాహనాలు నిలపడం నేరం

- **సెల్ఫీలు, విశ్రాంతి కోసం ఆపడం సరికాదు**
- **బ్రేక్‌డౌన్ అయినప్పుడు 14449కు ఫోన్ చేయండి**
- **వాహనదారులకు కమిషనర్ సజ్జనార్ హెచ్చరిక**

హైదరాబాద్(జనంసాక్షి):

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణించే వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ కీలక సూచన చేశారు. ఇటీవల కాలంలో ఆగి ఉన్న వాహనాలను వెనుక నుంచి వేగంగా వచ్చే వాహనాలు ఢీకొట్టడం వల్ల జరుగుతున్న ప్రమాదాలను నివారించడానికి పలు సూచనలు చేశారు. ఈ మేరకు సజ్జనార్ ఓ ప్రకటన విడుదల చేశారు. వాహనాల బ్రేక్ డౌన్, మెడికల్ ఎమర్జెన్సీ వంటి బలమైన కారణాలు ఉంటే తప్ప, సెల్ఫీలు దిగడానికి లేదా విశ్రాంతి తీసుకోవడానికి వాహనాలను రోడ్డు పక్కన నిలపడం చట్టరీత్యా నేరమని.. అత్యంత ప్రమాదకరమని అన్నారు

# తెలంగాణలో భూముల ధరల పెంపు

సంస్థలు ఈ కేసులో ఉన్నాయి. అందుకే నిష్పాక్షిక దర్యాప్తు జరిపేందుకు సీబీఐ విచారణ అప్పగించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

భూముల ధరలు సవరించాలని నిర్ణయం..

రాష్ట్రంలో భూముల ధరలను సవరించాలని, కొన్ని ప్రాంతాల్లో వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చుతగ్గులున్న భూముల ధరలను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. మార్కెట్ విలువల రేషనలైజేషన్ చేయడానికి రిజిస్ట్రేషన్ శాఖకు అనుమతి ఇవ్వడం జరిగింది. ఈనెల చివరి వారంలో సవరించిన విలువలు అమల్లోకి వస్తాయి. వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు, రోడ్ల విస్తరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులు ఇప్పుడు ప్రభుత్వం చెల్లించే పరిహారం రేట్లపై అసంతృప్తితో ఉన్నారు. ధర పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందిస్తున్నారు. దీంతో పాటు వాస్తవంగా మార్కెట్‌లో ఉన్న ధరలతో పోలిస్తే ప్రభుత్వం నిర్ణయించిన భూముల ధరలు భారీగా వ్యత్యాసమున్నాయి. అందుకు శాస్త్రీయ పద్ధతి అనుసరించి ఈ ధరలను సవరించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జిల్లాల్లో ఉండే మార్కెట్ విలువల రివిజన్ కమిటీలు అన్ని విషయాలను దృష్టిలో పెట్టుకుని విలువలను సవరిస్తుంది. హిల్ట్ పాలసీలో దరఖాస్తు చేసుకునే వారికి కూడా ఒక అవకాశం ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. భూముల ధరలు పెరిగేలోపు దరఖాస్తు చేసుకున్న వారికి ముందుగా పది శాతం చెల్లించే వెసులుబాటు ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. వారికి ఇప్పుడున్న భూముల ధరలే వర్తిస్తాయి. మిగతా 90 శాతం 90 రోజుల్లో చెల్లించాల్సి ఉంటుంది.

**సోలార్ జనరేషన్ ప్లాంట్లను ఏర్పాటు..**

నిన్న అకాల వర్షాలతో వివిధ జిల్లాల్లో పంటలు, పంట ఉత్పత్తులకు నష్టం వాటిల్లినట్లు సమాచారం అందింది. వెంటనే ఆయా జిల్లాల ఇంచార్జి మంత్రులు బాధ్యత తీసుకుని వివరాలు తెప్పించుకుని రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నల్గొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సంఘాన్ని నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డుకు అప్పగించే ఎంవోయూకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో నల్గొండ- రంగారెడ్డి మిల్క్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్‌కు సంబంధించిన పాలు, పాల ఉత్పత్తులకు సంబంధించి డైరీ ప్లాంట్ నిర్వహణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ ఎన్డీడీబీ నిర్వహిస్తుంది. తెలంగాణలో 9 జిల్లాల్లో 33/11 కేవీ సబ్‌స్టేషన్ల వద్ద సోలార్ పవర్ జనరేషన్ ప్లాంట్ల ఏర్పాటుకు కేబినేట్ ఆమోదం తెలిపింది. పైలెట్ పద్ధతిన 18 చోట్ల ఈ సోలార్ జనరేషన్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. దాదాపు రూ.66.50 కోట్లతో 19 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులను అమలు చేసేందుకు ఆమోదం తెలిపింది.

**వన్ టైమ్ సెటిల్మెంట్..**

క్యూర్ పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్లలో పెండింగ్ లో ఉన్న వివిధ ప్రభుత్వ కార్యాలయాలు పన్నులను క్లియర్ చేరుకునేందుకు వన్ టైమ్ సెటిల్ మెంట్ వెసులుబాటు కల్పించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దాదాపు రూ. 5864 కోట్ల బకాయిలున్నాయి. జరిమానాలు, వడ్డీలన్నీ మినహాయించి వన్ టైమ్ సెటిల్మెంట్ ద్వారా రూ.1686 కోట్లు వస్తాయని అంచనా వేసింది. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల పరిధిలోనే వన్ టైమ్ సెటిల్మెంట్ పై ఈ బకాయిలు వసూలు చేసుకోవాలని మున్సిపల్ శాఖను ఆదేశించింది. హైదరాబాద్ జల మండలికి ఇవ్వాల్సిన నీటి బకాయిలను కూడా సర్దుబాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఖమ్మం జిల్లా కామేపల్లి వద్ద బుగ్గవాగు నుంచి లెఫ్ట్ ఫ్లడ్ ఫ్లో కాలువ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఖమ్మం జిల్లాలో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు నీరు అందించనున్నారు. రాష్ట్రంలోని అన్ని ఐటీఐలు (అడ్వాన్సుడ్ ట్రైనింగ్ సెంటర్లు), పాలిటెక్నిక్లు, టీ శాట్ ను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకువచ్చి, ఒకే గొడుగు కింద ఉంచాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్ నగర్లో ఆధునిక కూరగాయల మార్కెట్ కోసం 42 ఎకరాల భూమి కేటాయించేందుకు రాష్ట్ర మంత్రివర్గం తెలిపింది.

## మా ఫోన్లు ట్యాప్ అవుతున్నాయి

**- అవినీతిని ప్రశ్నించినందుకే క్రిశాంక్ అరెస్ట్**
**- జైలులో బీఆర్ఎస్ నేతకు కేటీఆర్ పరామర్శ**

సంగారెడ్డి(జనంసాక్షి):

కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే మన్నే క్రిశాంక్‌ని అన్యాయంగా అరెస్ట్ చేసి జైలుకు పంపారని ధ్వజమెత్తారు. ఆయనపై 35 కేసులు పెట్టి సీఎం రేవంత్‌రెడ్డి పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆగ్రహించారు. బీఆర్ఎస్, సోషల్ మీడియాపై పెట్టిన శ్రద్ధలో ఒక్క పైసా అయిన.. సీఎం శాంతిభద్రతలపై దృష్టి పెడితే బాగుంటుందని హితవు పలికారు. సోమవారం కందిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలుకు కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేరుకున్నారు. జైల్లో ఉన్న మన్నే క్రిశాంక్‌తో వారు ములాఖత్ అయ్యారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, కేపీ వివేకానంద్, పాడి కౌశిక్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. మన్నె క్రిషాంక్ ఓ ఉన్నత విద్యావంతుడు, న్యాయవాది, పీహెచ్‌డీ పట్టా పొందిన వ్యక్తి. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమంలో ముందుండి పోరాడిన ఆయన, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత టీఎస్ఎండీసీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారని తెలిపారు. గత రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తూ ప్రజల ముందుకు తీసుకువస్తున్నందుకే క్రిషాంక్‌పై వరుసగా కేసులు నమోదు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. నాలుగేళ్ల కంటే తక్కువ శిక్ష ఉన్న కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇవ్వాల్సిన పరిస్థితిలో 12 రోజులుగా జైలులో పెట్టి 'హ్యాబిచువల్ అఫెండర్'గా చూపించడం దుర్మార్గమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయాలను ప్రశ్నించినందుకే కేసులు పెట్టారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న నేరాలపై ప్రభుత్వం దృష్టి పెట్టకుండా సోషల్ మీడియా పోస్టులపై కేసులు పెట్టడంలోనే బిజీగా ఉందని కేటీఆర్ విమర్శించారు. కరీంనగర్‌లో పగటిపూట కాల్పులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించలేదు. కానీ, ఎవరు ట్వీట్ చేశారు అన్నదానిపై మాత్రం అప్రమత్తంగా ఉందని ఎద్దేవా చేశారు. పోలీసు వ్యవస్థను ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తోందని ఆరోపిస్తూ పోలీసులు ముఖ్యమంత్రి ప్రైవేట్ ఆర్మీలా పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్, హ్యాకింగ్, జర్నలిస్టులపై వేధింపులు వంటి చర్యలు కొనసాగుతున్నాయన్నారు. హైకోర్టు ఆదేశాలను కూడా లెక్కచేయకుండా క్రిషాంక్‌ను అరెస్ట్ చేయడం చట్టవిరుద్ధమన్నారు. ఈ విషయంపై కోర్టులో కంటెంప్ట్ పిటిషన్ వేస్తామని తెలిపారు.మా నాయకులను వేధించినా మేము వెనక్కి తగ్గం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు మా పోరాటం కొనసాగుతుందన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలకు ఎవరూ భయపడవద్దు. పార్టీ లీగల్ సెల్ మీకు అండగా ఉంటుంది. న్యాయం, ధర్మం మన వైపు ఉన్నాయి అని తెలిపారు. చివరగా ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను బయటపెడుతున్న మీడియాకు కృతజ్ఞతలు తెలుపారు. కరీంనగర్‌లో పట్టపగలు జ్యువెలరీ షాపులో దాడి జరిగిందని తెలిపారు. సీఎం రేవంత్‌కు పరువు, సిగ్గు అనేవి లేవని విమర్శించారు. తమ నేతలపై పోలీసులు ఓవర్ యాక్షన్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. పోలీసులు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రైవేటు ఆర్మీలా పని చేస్తున్నారని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ నేతలు, జర్నలిస్టుల ఫోన్లను పోలీసులు హ్యాక్ చేస్తున్నారని ఆరోపించారు. తాము ఎవరెవరితో మాట్లాడుతున్నారో తెలుసుకుంటున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా పాలనపై దృష్టి పెట్టాలని కేటీఆర్ కోరారు.

**కొనుగోళ్లు లేక అన్నదాతల ఆగమాగం**

ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుని చచ్చే వరకు వేధిస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. శనగ పంట వచ్చి.. నెల రోజులైనా ఇప్పటి వరకు ఆ పంటను ప్రభుత్వం కొనుగోలు చేయలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా ఇప్పటి వరకు సరిగా ఇవ్వలేదన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో కేటీఆర్ మాట్లాడుతూ.. అన్ని పంటలు కొనుగోలు చేస్తామని చెప్పి రైతులను ఈ ప్రభుత్వంలోని నేతలు పచ్చి మోసం చేశారని విమర్శించారు.రాష్ట్రంలో ఏ పంట కూడా సరిగ్గా కొనుగోలు చేయడం లేదంటూ ప్రభుత్వ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. 95 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేయాల్సి ఉండగా.. కేవలం 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమే కొనుగోలు చేశారని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు ఇప్పటికి ప్రారంభించ లేదన్నారు. ధాన్యం దళారుల పాలు చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కేటీఆర్ కుండ బద్దలు కొట్టారు. సీఎం కేసీఆర్ హయాంలో 11 సార్లు రైతు బంధు వేశారని కేటీఆర్ గుర్తు చేశారు.

## నూతన వేబ్రిడ్జ్ ప్రారంభించిన ఎమ్మెల్యే



వెల్దండ, మే 4 (జనంసాక్షి) : వెల్దండ మండల కేంద్రంలో సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వే బ్రిడ్జ్ ను ప్రారంభించారు. నిర్వాహకులు కాడురామ్ నాయక్, చంద్రశేఖర్ నాయక్, రవీందర్ నాయకులు ఏర్పాటు చేసిన అత్యధిక సాంకేతిక నిర్మాణానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయం, మైనింగ్ మరియు తయారీ పరిశ్రమలలో సరుకులు కొనుగోలు లేదా అమ్మకం సమయంలో సమయాన్ని ఆదా చేసి, మోసాన్ని తగ్గించి, డేటాను సేవ్ చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సంజీవ్ కుమార్ యాదవ్,డిసిసి ఉపాధ్యక్షులు భూపతి రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీను, నాయకులు పర్వత్ రెడ్డి, హరికిషన్, పుల్లయ్య, ఎండి రషీద్, ఈదులపల్లి శ్రీనివాసులు, రఘుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులపై మున్సిపల్ పాలకవర్గం సమావేశం




**చేర్యాల, మే 4 (జనంసాక్షి) :** చేర్యాల పట్టణంలో నెలకు సమస్యల పరిష్కారం కోసం సోమవారం చేర్యాల మున్సిపల్ పాలకవర్గం, అధికారులు సమావేశం నిర్వహించి పలు అభివృద్ధి పనుల శ్రీకారానికి తీర్మానం చేశారు. పట్టణంలో మున్సిపల్ కార్యాలయం పునరుద్ధరణ, పారిశుద్ధ్య కార్మికులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది జీత భత్యాలు, వాహనాలు మెంటేనెన్సు, డ్రైనేజి, సీసీ రోడ్లు, తదితర పనులపై సమీక్షించి తీర్మానాలు చేశారు. ఈసందర్భంగా సిఐ బానోతు రమేష్ నాయక్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియంత్రణ, త్రిబుల్ రైడింగ్ వంటి అంశాలను నియంత్రించుటకు పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పసర్ ముస్త్యాల అరుణ, వైస్ చైర్పర్సన్ మేడిశెట్టి ఉమ, కౌన్సిలర్లు ఒగ్గు వెంకటమ్మ, పోతుగంటి ప్రసాద్, వెలుగల దుర్గయ్య, వీరబత్తిని సదానందం, కొమ్ము రాజేశ్వరి, కమలపురం గీతాంజలి, ఎండి. ఎజాజ్ అహ్మద్, మొహ్మద్ షరీఫా బేగం, నిమ్మ సుప్రజా, భూనాద్రి సురేష్, కమిషనర్ నాగేంద్ర కుమార్, సీఐ బానోతు రమేష్ నాయక్, ఎస్ఐ గూడ అపూర్వరెడ్డి, విద్యుత్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, కో ఆప్షన్ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 30 సంవత్సరాల నుంచి 10 లక్షలు పెన్నులు పంపిణీ



**బంట్వారం, మే (జనం సాక్షి) :** గత 30 సంవత్సరాలుగా పిఎల్ ఫౌండేషన్ ద్వారా తన సొంత సంపాదనలో కొంచెం సహాయం చేయడం ధర్మంగా విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేస్తున్నామని పిఎల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ పిల్లోడి లక్ష్మయ్య తెలిపారు. చేశారు. షాపూర్ లోని ఎన్సీపీ విద్యార్థులకు పీఎల్ పౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆయా ప్రాంతాలలో ఉ మ్మడి నల్లగొండ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, ఉమ్మడి మెదక్ ప్రాంతాలలో పిల్లలందరూ చదువుకోవాలనే నినాదంతో నేటి పిల్లలే రేపటి పౌరులని భావించి ముందుకుసాగుతున్నామని తెలిపారు. ఆయా ప్రాంతాలలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని కొన్ని స్వచ్ఛంద సంస్థల ద్వారా పిఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేయడం జరిగింది. బాల్య వివాహాలను అరికట్టాలని మారుమూల గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు బాల్యవివాహాల వల్ల జరిగే ఇబ్బందులు వచ్చే కష్టాలు వారికి క్లుప్తంగా వివరించాలన్నారు. ఎన్.సి.సి. విద్యార్థులు రాబోయే కాలంలో పోలీసులు, ఎస్ఐలు, సీఐలు, డిఎస్పీలు, ఎస్పీలు, ఐపీఎస్ ఆఫీసర్లు కావాలని వారికి హితబోధ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సొంత ఖర్చులతో సీసీ కెమెరాలు ఏర్పాటు

### వీరన్నపేట సర్పంచ్‌ను అభినందించిన గ్రామస్తులు



**చేర్యాల, మే 4 (జనంసాక్షి) :** చేర్యాల మండలంలోని వీరన్నపేట గ్రామపంచాయతీ సర్పంచ్ శైలజ శివశంకర్ గౌడ్ తమ స్వంత ఖర్చులతో సుమారు రూ.20 వేల విలువైన సోలార్ కెమెరాలను సోమవారం గ్రామ కార్యదర్శికి అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ భద్రత,అభివృద్ధి దిశగా సీసీ కెమెరాలో ఏర్పాటు ఒక కీలక ముందడుగుగా నిలుస్తుందని, గ్రామ అభివృద్ధి, భద్రత కోసం ఇతర దాతలు ముందుకు వచ్చి తమ వంతు సహాయం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బంగారిగళ్ల కిరణ్, పంచాయతీ కార్యదర్శి మధు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర వాహన దొంగల ముఠా అరెస్ట్

- **రూ:2 లక్షలు, పిస్టల్, ఎయిర్ గన్, కత్తులు, సెల్‌ఫోన్లు, టిప్పర్ స్వాధీనం**
- **నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు**
- **వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్పీ పరితోష్**



**సంగారెడ్డి ప్రతినిధి, మే 4 (జనం సాక్షి) :** వివిధ ప్రాంతాలలో వాహనాలను దొంగతనం చేస్తున్న దొంగల ముఠాను సంగారెడ్డి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎస్పీ పరితోష్ పంకజ్ వివరాలు వెల్లడించారు. నారాయణఖేడ్ పట్టణంలోని మనూర్ చౌరస్తా వద్ద ఏప్రిల్ 04 న మధ్య రాత్రి డీసీఎం వాహనం దొంగతనం జరిగినట్లు తెలిపారు. ఈ విషయమై నాగల్‌గిద్ద గ్రామానికి చెందిన ఫిర్యాదుదారు మాలిపాటిల్ దత్తు ఏప్రిల్ 11 న ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. తన డీసీఎం వాహనం (నంబర్: ఎపి 28 టిఇ 3708)ను 09-04-2026న మధ్యాహ్నం 12 గంటలకు డ్రైవర్ గైనీ సునీల్ మనూర్ చౌరస్తా వద్ద పార్క్ చేసి గ్రామానికి వెళ్లగా, మరుసటి రోజు రాత్రి 9 గంటలకు వాహనం కనిపించకుండా పోయినట్లు గుర్తించారు. ఈ మేరకు నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 84/2026, సెక్షన్ 305(బి) బిఎన్ఎస్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగిందన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, నారాయణఖేడ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి సీసీటీవీ పుటేజీలు, సాంకేతిక ఆధారాలు సేకరించి, మే 03 న రాత్రి 9:30 గంటలకు నారాయణఖేడ్ పట్టణంలోని పంచగామ కమాన్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించడం జరిగిందన్నారు. హైదరాబాద్ కూకట్ పల్లి కి చెందిన మహమ్మద్ ఖుర్షీద్ అహ్మద్ , హైదరాబాద్ చాంద్రాయణగుట్ట కు చెందిన మహమ్మద్ జాఫర్ అలీ వద్ద నుండి 1 పిస్టల్ (2 రౌండ్స్), ఒక ఎయిర్ గన్, 2 కత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఇద్దరు వ్యక్తులు నదీమ్ ఖాన్, షేక్ ఐజాజ్, సయ్యద్ సయీద్, షేక్ నిజాం, మహమ్మద్ సలీం, మహమ్మద్ ఇర్షాద్ అహ్మద్, గులాం రబ్బానీ, సలావుద్దీన్, బాబా, మొహ్సిన్ షా, రేహాన్ తదితరులతో కలిసి గ్యాంగ్‌గా ఏర్పడి సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో వాహన దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు. ఒక రాష్ట్రంలో వాహనాలను దొంగిలించి, మరో రాష్ట్రంలో విక్రయించడం ద్వారా పోలీసులను తప్పుదోవ పట్టించే విధంగా నేరాలు నిర్వహిస్తున్నట్లు నిందితులు తెలిపినట్లు చెప్పారు. నిందితుల్లో మహమ్మద్ ఖుర్షీద్ అహ్మద్, మహమ్మద్ జాఫర్ అలీ, సయ్యద్ సయీద్, షేక్ నిజాం, మహమ్మద్ సలీం, మహమ్మద్ ఇర్షాద్ అహ్మద్ ఉన్నట్లు తెలిపారు. నదీమ్ ఖాన్, షేక్ ఐజాజ్, గులాం రబ్బానీ, సలావుద్దీన్, బాబా, మొహ్సిన్ షా, రేహాన్ పరారీలో ఉన్నారని తెలిపారు. నిందితుల నుండి 1-పిస్టల్ (2 రౌండ్స్), ఎయిర్ గన్ ,కత్తులు - 2, నగదు రూ. 2,00,000/- సెల్‌ఫోన్లు - 6 టిప్పర్ వాహనం (ఎం.హెచ్ 22 ఎఎ 1413) స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు (తెలంగాణలో 5, కర్ణాటక 1, మహారాష్ట్ర 5)లో వాహన దొంగతనాలు చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. గతంలో కూడా ఎ1- ఖుర్షీద్ అహ్మద్‌పై కర్ణాటక, హైదరాబాద్ పరిధిలో పలు వాహన దొంగతన కేసులు ఉన్నాయన్నారు. ఎ2 జాఫర్ అలీపై ఎన్.డి.పి.ఎస్ కేసులో జైలుకు వెళ్లిన చరిత్ర ఉంది. అంతర్రాష్ట్ర వాహన దొంగల ముఠాను అరెస్టు చేసి, ఈ కేసును ఛేదించిన సిసిఎస్ సంగారెడ్డి బృందం, నారాయణఖేడ్ పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.ఈ ప్రెస్ మీట్ నందు అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివ కుమార్, ప్రసాద్ రావ్, నారాయణఖేడ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వం విఫలం

- **మాజీ మంత్రి కేటీఆర్**



సదాశివపేట, మే 4 (జనం సాక్షి) : సదాశివపేట పట్టణంలోని శనగల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మాజీ మంత్రి కేటీఆర్, స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తో కలిసి సందర్శించారు. రైతులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో రైతులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. శనగ పంట కొనుగోలు నెల రోజులు గడిచిన ప్రారంభం కాలేదని ఆరోపించారు. రైతు భరోసా సరైన విధంగా అందలేదని, అన్ని పంటలు కొనుగోలు చేస్తామని చెప్పి మోసం చేశారని అన్నారు. కెసిఆర్ హయాంలో 11 సార్లు రైతుబంధు ఇచ్చారని గుర్తు చేసిన ఆయన, ప్రస్తుతం రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు మందగించాయని, 95 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యానికి గాను కేవలం 9 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదని, దళారుల కే లాభం చేకూర్చే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. సివిల్ సప్లై కార్పొరేషన్ లో భారీ అవినీతి జరిగిందని, అందుకే కొనుగోలు ఆలస్యం అవుతున్నాయని అన్నారు. రైతుల సమస్యలపై సీఎం, మంత్రులు స్పందించడం లేదని, భూముల కొనుగోలుపై మాత్రమే దృష్టి పెట్టారని అన్నారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే, రాబోయే వారం రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాల్లో బిఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా నిలిచి శనిగలు కొనుగోలు అయ్యేవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే తహసిల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు జరిగే వరకు ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, వివేకానంద, డీసీఎంఎస్ చైర్మన్ శివ కుమార్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిమ్స్‌లో ఆపరేషన్లు యథాతథం

**హైదరాబాద్, మే 4 (జనం సాక్షి) :** నిమ్స్‌లో నీటి సమస్య వల్ల ఆపరేషన్లు ఆపేశారంటూ సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలు అవాస్తవం అని నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తెలిపారు. ఆపరేషన్లు, ఇతర వైద్య సేవలు అన్నీ యథావిధిగా కొనసాగుతున్నాయని ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వేసవి కాలంలో నీటి వృథాను అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలను వక్రీకరించి కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని.. నిత్యం వేల మంది పేషెంట్లకు వైద్య సేవలు అందిస్తున్న హాస్పిటల్‌పై అవాస్తవాలు ప్రచారం చేయొద్దని డైరెక్టర్ విజ్ఞప్తి చేశారు. వార్డులు, బాత్రూంలు, ఆపరేషన్ థియేటర్లు సహా హాస్పిటల్‌లో అవసరమైన ప్రతి చోటా సరిపడా నీళ్లు అందుబాటులో ఉన్నాయని బీరప్ప వెల్లడించారు. నీటి కొరత కారణంగా వార్డులు, టాయిలెట్స్, థియేటర్లు శుభ్రం చేయట్లేదని జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని ప్రజలకు, పేషెంట్లకు బీరప్ప విజ్ఞప్తి చేశారు.

## ఎరువుల వినియోగంలో సమతుల్యత అవసరం



శివ్వంపేట, మే 4 (జనంసాక్షి) : వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని, దానికి అనుగుణంగా రైతులు ముందుకు వెళ్లి ఆర్థికంగా వృద్ధి చెందాలని మండల వ్యవసాయ శాఖ అధికారి లావణ్య పిలుపునిచ్చారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక, 99 రోజుల ప్రణాళిక లో భాగంగా సోమవారం మండల కేంద్రమైన శివ్వంపేట తో పాటుగా మండల పరిధిలోని అల్లీపూర్, దొంతి, గోమారం రైతు వేదికల్లో రైతు వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శివ్వంపేట రైతువేదిక లో ఆమె స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారితో కలిసి రైతులకు వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో లావణ్య మాట్లాడుతూ నేల ఆరోగ్య పరిరక్షణపై సాయిల్ హెల్త్ కార్డ్ పంపిణీ చేస్తామన్నారు. ఎరువుల వినియోగం, పంట విక్రయం కొరకు, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి కొరకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి అన్నారు. వ్యవసాయంలో కేవలం వరి పంట మాత్రమే కాదని ప్రత్యామ్నాయ పంటల సాగువైపు రైతులు వెళ్లి వాణిజ్య పంటలు సైతం సాగు చేసుకోవచ్చని ఆమె సూచించారు. పంట సాగు విషయంలో రైతులు జాగరుకతతో వ్యవహరించి నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోని తదనుగుణంగా నారుమడులను సిద్ధం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు మౌనిక, వందన, వినీత, భవాని, రవి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పశ్చిమ బెంగాల్‌లో ప్రజలు మార్పు కోరుకున్నారు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, మే 4 (జనం సాక్షి) : పశ్చిమ బెంగాల్ ప్రజలు మార్పు కోరుకున్నారని, మమతా బెనర్జీ అరాచక పాలన నుంచి విముక్తి పొందేందుకు బీజేపీ ని గెలిపించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. దేశంలోని మూడు రాష్ట్రాల్లో బీజేపీ గెలిచిన నేపథ్యంలో సోమవారం నగరంలోని నిఖిల్ సాయి చౌరస్తా వద్ద సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బెంగాల్ లో బీజేపీ చరిత్ర సృష్టించిందన్నారు. ఊహించిన దానికంటే భారీ సీట్లు కైవసం చేసుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందని పేర్కొన్నారు. ఈ ఎన్నికల ద్వారా ప్రజలు అభివృద్ధిని, పారదర్శకతను, భద్రతను కోరుకుంటున్నారని మరోసారి నిరూపించారన్నారు. ప్రధానంగా బెంగాల్ ప్రజలు భయం, అవినీతి, అశాంతి పై తిరుగుబాటు చేశారని స్పష్టం చేశారు. మోడీ సారధ్యంలో ప్రజల విశ్వాసాన్ని బెంగాల్ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని తెలిపారు. ఈ తీర్పుతో దేశ రాజకీయాలకు కొత్త దిశను చూపుతోందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలోనూ మార్పు ఖాయమని స్పష్టం చేశారు. ప్రస్తుత ఫలితాలు చూస్తే ఇది కేవలం ఓటింగ్ కాదని..ప్రజల ఆలోచన విధానం మారుతుందనే సంకేతమన్నారు. ఇక కాంగ్రెస్ మూడు రాష్ట్రాల్లోనూ ఉనికి కోల్పోయిందని తెలిపారు.అనంతరం టపాసులు పేలుస్తూ.. మిఠాయిలు పంచుతూ సంబరాలు జరిపారు కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, ఫ్లోర్ లీడర్ ప్రమోద్, బిజెపి కార్పొరేటర్లు గోపిడి స్రవంతి రెడ్డి, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దండెం రాజశేఖర్‌కి డాక్టరేట్ ప్రధానం చేసిన కేయూసీ



**హైదరాబాద్, మే 4 (జనంసాక్షి) :** జూలూరు గౌరీ శంకర్ కవిత్వం- అధ్యయనం" అన్న అంశంపై పరిశోధన చేసిన దండెం రాజశేఖర్ కు కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేస్తున్నట్లు కే యూ సి ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ బానోతు సురేష్ లాల్ శుక్రవారం నాడు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ పరిశోధనకు శ్రీ విశ్వేశ్వర సంస్కృత ఆంధ్ర కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్లంభట్ల నాగయ్య మార్గదర్శిగా వ్యవహరించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ గోన నాయక్ పరిశోధన పత్రం మూల్యాంకనం సబ్జెక్ట్ ఎక్సర్నల్ ఎక్స్పర్ట్‌గా వ్యవహరించారని తెలియజేశారు.

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపండి

- **అధికారులకు సిఎంసి కమిషనర్ శ్రీజన ఆదేశం**



**శేరిలింగంపల్లి, మే 4 (జనంసాక్షి) :** ప్రజా సమస్యల పరిష్కారంకోసం అర్జీదారులు అందజేసే ఫిర్యాదుల విషయంలో ఎలాంటి అలసత్వం ఉండకూడదు అని, ప్రథమ ప్రాధాన్యతగా వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆయా విభాగాల అధికారులను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, సీనియర్ ఐఏఎస్ అధికారిణి సృజన ఆదేశించారు. ఈ మేరకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి శ్రీజన వివిధ విభాగాల అధికారులతో కలిసి హాజరై అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజావాణి కార్యక్రమం ఒక యజ్ఞంలా కొనసాగుతుందని, జిహెచ్ఎంసి పరిధిలోపల ప్రతి సర్కిల్ కార్యాలయం, జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత లభిస్తుందన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆయా సర్కిళ్లలో ఉదయం పది గంటలనుండి సాయంత్రంవరకు కీలక అధికారులు అంతా సమయాన్ని కేటాయిస్తూ అర్జీదారుల నుండి ఫిర్యాదులు అందుకోవడం జరుగుతుందని సిఎంసి కమిషనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 72 వినతులు అందాయని, ప్రతి అర్జీని ప్రత్యక్షంగా పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో వాటిపై తక్షణ చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చొరవ చూపిస్తానని భరోసాను వ్యక్తం చేశారు. సోమవారం అందిన ఫిర్యాదులలో భాగంగా పట్టణ ప్రణాళిక అవిభాగం నుండి అత్యధికంగా 41, ఇంజనీరింగ్ విభాగం నుండి 14, అర్బన్ బయోడైవర్సిటీ నుండి 05, క్రీడల విభాగం నుండి 03, రెవెన్యూ విభాగం నుండి 02, విద్యుత్ విభాగం నుండి 01, అడ్వర్టైజ్మెంట్ నుండి 01, సానిటేషన్ నుండి 02, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగం నుండి 01, ఎస్టేట్స్ నుండి 01 చొప్పున అర్జీలు అందాయని కమిషనర్ సృజన తెలియజేశారు. ఈ క్రమంలో మాట్లాడుతూ ఫిర్యాదులు తీసుకోవడానికి మాత్రమే అధికారులు పరిమితం కాకూడదని, క్షేత్రస్థాయిలో సమగ్రత నిర్వహించి వాటి పరిష్కారం లభించే అంతవరకు అధికారులు వారి గురుతర బాధ్యతను విస్మరించకూడదని ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణిలో ఫిర్యాదులు అందజేసిన అర్జీదారులు వాటి పరిష్కారం కోసం మళ్లీ కార్యాలయం మెట్లు ఎక్కకుండా పారదర్శకమైన యంత్రాంగాన్ని దీని కోసం కేటాయించి ప్రజల మన్ననలు పొందే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని సిఎంసి కమిషనర్ పేర్కొన్నారు.

## మా టెంతు బ్యాచు

**మహిలో కెల్లా మస్తు..**

సెలబ్రేషన్స్ గోలలే
ఎరుగని బ్యాచది..
అంత తీరిక ఏదీ..?
అసలాకోరికే ఏదీ..!?

బలెబాగా గుర్తుంది
బడికి శోభియ్యగా
కోర్టు పక్కగుంతలు
పూడ్చింది మనమే

యాభై ఏళ్ళ కింద
1977 ఎస్ ఎస్ సీ
పదో తరగతి పాసు
ఫలితాలొచ్చాయట..

ఏదో వొక ప్రముఖ
దిన పత్రిక లోన
పాసైన నంబర్లు
వచ్చేవా రోజుల్లో..

ఆరోజు ఉదయం
పది గంటలప్పుడు
మా కొల్లాపురము
రాజా గారి బంగళా..

ముందు నుండెళ్ళి
దక్షిణానికి తిరిగేటి
ఎడమ వైపు దారి
మల్లు తున్నాను..

నా భుజమ్మీద ఉన్న
రెండు మళ్ల బరువు
సెనగ బ్యాళ్ళ సంచితో
బండాయగుట్ట బాటలో..

ఇంటికి వస్తున్నాను
జామా మసీదు కాడి
బాలనాగయ్య సేటు
కిరాణమంగడి నుంచి..

ఒరే ఒరే ఆగురా
ఎవరిదో పిలుపని
వెను తిరిగి చుస్తే
క్లాస్ మేటు శ్యాం..

అబే నువ్వేందిరా
ఎట్లెట్లనో ఉన్నవ్..
నువ్ పాసైనవ్ బే
ఎంజాయి జెయ్యి

నేను పాయినలే
నీవేందిరా ఇట్లా
అన్నా డొకింత
విచార పడుతూ..

ఇంటి పనిలున్న
ఇంగెట్లుండాలే
అర్థంగాలే కానీ
శాందే బాధైంది..

పురుషోత్తం సార్
లెక్కల ట్యూషన్
పోతుండే శాంకు
వొగనాడు నోట్స్

అడిగితె అన్నడు
మీకిట్లియ్యనీకెనా
మేం డబ్బులిచ్చి
ట్యూషన్లు సద్వేది..

అది గుర్తొచ్చెనేమో
దీనంగా పెట్టిండు

దయగల్ల ముఖం
మా దోస్తు శ్యాము

అయిన నన్నిష్టపడే
శామంటే నా కిష్టం
అతనిప్పుడు లేడు
కాల మయ్యిండు..

నే టీచర్ నయ్యాక
జీ పీ ఎస్ స్కూల్లో
శ్యాం వదిన మాకు
వో మంచి కొలీగు ..

ఆమె ద్వారా ఎన్నో
శాం గూర్చి సత్యాల
గొప్పదనాలు వింటే
కళ్ళు చెమర్చెడివి ..

చాకలి అంజీ సీనూ
గొల్ల బాలయ్యా
ఎల్లయ్యా సూరీ
మాదిగ హన్మంతూ..

బొల్లారం శ్రీనివాసు
మాల చెన్నయ్యా
బొడ్డు బాల్సామి
నరహరీ రాందాసు

తురుకోల్ల ఖదీరూ
శానవాజు షఫీ
షఫీఖుల్లు ఉర్రూ
ఎల్లూరు షబ్బీరూ

సత్యనారాయణా
లంబడి బిచ్చయ్య
సేవక విజయలక్ష్మి
వినోద సూర్యకళా

నాగులు ప్రమీలా
రమేశు విజయా
హరి రాము సీను
ఈడిగ వెంకట్గౌడూ

కోమటోల్ల అశోకూ
విజయ కుమారూ
బాపని సుధారాణి
శ్యామూ రామకృష్ణ

నర్సింహారావుల
ఇన్నేళ్ల జ్ఞాపకాల
అట్టడుగు పొరల్ల
దాగిన మరెందరో..

కులమతాల నెర్గక
అంతస్తుల్ సూడక
అందరొకటిగా తల్లి
పెనవేసు కుంటిమే..

అనురాగ పూదోట
అలనాటి ఆ బడి
గాంధీ హైస్కూలు
విద్యార్థులం మనం..

ఎవ రెవరం ఏడేడో
ఎక్కడెక్కడ ఎట్లెట్ల
మిగిలున్నమో గానీ
మధుర దినములవి..

పరిమళ భరితమైన
మర్వలేని జ్ఞాపకాలు..!
ఎల్లెడలా సజీవముల్లై
సదా నిలిచి ఉండాలె..!!

డా.ఎం డీ ఇక్బాల్ పాష
9440775732

# దబ్బున్న వాడికి దండం.. పేదవాడికి దండన

**భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే పునాదుల మీద నిర్మితమైన అద్భుత సౌధం మన రాజ్యాంగం. బాబాసాహెబ్ అంబేద్కర్ నాయకత్వంలో రూపుదిద్దుకున్న ఈ పవిత్ర గ్రంథం, చట్టం ముందు అందరూ సమానమేనని, ఆఖరి మనిషికి కూడా న్యాయం అందాలని అత్యున్నత హామీ ఇచ్చింది. కానీ, దురదృష్టవశాత్తూ నేటి వాస్తవ పరిస్థితులు చూస్తుంటే ఆ హామీ కేవలం పుస్తకాలకే పరిమితమైందా? అన్న అనుమానం కలగక మానదు. నేడు న్యాయం అనేది ఒక విలాసవంతమైన వస్తువుగా మారిపోయింది.**

ధనవంతుల ఇళ్లల్లో దాసోహం అనే కీలుబొమ్మలా చట్టం మారుతుంటే, సామాన్యుడికి మాత్రం న్యాయం అనేది నిఘంటువులో అర్థం వెతుక్కోవాల్సిన ఒక కఠిన పదంగా మిగిలిపోతోంది. ఈ సామాజిక అంతరాలు ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో మన దేశం ఏ దిశగా పయనిస్తుంది? ఇది ఇవాళ ప్రతి పౌరుడూ తనను తాను ప్రశ్నించుకోవాల్సిన తక్షణావసరం. హైదరాబాద్ మహానగర శివార్లలో ఒక దీనగాథ వింటే మన గుండె తరుక్కుపోతుంది. అతను రామయ్య. రెక్కాడితే గానీ డొక్కాడని ఒక రోజువారీ కూలీ. తను రక్తాన్ని చెమటగా మార్చి, పస్తులు ఉండి మరీ కూడబెట్టిన కొద్దిపాటి సొమ్ముతో ఒక చిన్న పొల ముక్కను కొనుక్కున్నాడు. అది అతడికి కేవలం ఆస్తి కాదు, అతడి కల అతడి పిల్లల భవిష్యత్తు. కానీ, ఆ చిన్న నేల మీద ఒక బడా ధనవంతుడి కన్ను పడింది. అధికారం, అంగబలం, అర్థబలంతో ఆ పొలాన్ని బలవంతంగా లాక్కున్నారు. న్యాయం కోసం రామయ్య తలుపు తట్టని చోటు లేదు. మొదట పోలీసు స్టేషన్‌కు వెళ్తే, అక్కడ ధనవంతుడి పలుకుబడి ముందు ఇతని గొంతు వినిపించలేదు. ఇది సివిల్ కేసు, కోర్టుకు వెళ్ళు అని సలహా ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఆశతో ఒక న్యాయవాదిని కలిస్తే, కేసు వేయాలంటే ముందు ఒక యాభై వేలు కట్టండి అనే సమాధానం ఎదురైంది. ఆ యాభై వేలు రామయ్య ఐదేళ్ల కష్టం. అంటే, తన హక్కు కోసం పోరాడాలంటే మళ్లీ ఐదేళ్లు ఆకలితో అలమటించాలా? నేడు రామయ్య కోర్టు మెట్లపై నిస్సహాయంగా కూర్చుని, తన చేజారిపోయిన పొలం వైపు చూస్తూ కన్నీరు మున్నీరవుతున్నాడు. ఇది ఒక్క రామయ్య కథ కాదు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు లక్షలాది మంది పేదల మౌన రోదన. మన దేశంలో న్యాయం పొందాలంటే డబ్బు ఉండాలి, డబ్బు సంపాదించాలంటే న్యాయం జరగాలి. ఈ వింతైన విషవలయంలో సామాన్యుడు నలిగిపోతున్నాడు.



ధనవంతులకు చట్టం చుట్టంలా మారుతుంటే, పేదవాడికి అది ఒక పీడకలలా పరిణమిస్తోంది. మన న్యాయ ప్రక్రియ ఎంత నెమ్మదిగా సాగుతుందో అందరికీ ఎరుకే. సుప్రీంకోర్టు నుంచి కింది స్థాయి కోర్టుల వరకు కోట్ల కొద్దీ కేసులు అటకెక్కాయి. ఒక చిన్న భూవివాదం తేలడానికి మూడు తరాలు పడుతుందనే అపవాదు మన వ్యవస్థపై ఉంది. ఈ దీర్ఘకాలిక పోరాటాన్ని తట్టుకునే ఓపిక, శక్తి ధనవంతులకు మాత్రమే ఉంటుంది. వారి దగ్గర సీనియర్ అడ్వకేట్లు ఉంటారు, వారు ఒక్కో వాయిదాకు లక్షల రూపాయల ఫీజు తీసుకుంటారు. కేసును ఏళ్ల తరబడి సాగదీయడం వారికి వెన్నతో పెట్టిన విద్య. కానీ పేదవాడు? ఒక వాయిదా పడితే ఆ రోజు కూలీ నష్టపోతాడు. కోర్టుల చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోయి మధ్యలోనే పోరాటాన్ని వదిలేస్తాడు. ఈ పరిస్థితిలో న్యాయం అందరికీ సమానం అనే నినాదం కేవలం ఎన్నికల మేనిఫెస్టోలకే పరిమితం అవుతోంది. మనం గణాంకాలను పరిశీలిస్తే వ్యవస్థ ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థమవుతుంది. కింది పట్టికను గమనించండి. భారతీయ న్యాయ వ్యవస్థలోని దయనీయ స్థితిని ఈ గణాంకాలు కళ్లకు కట్టినట్లు చూపుతున్నాయి. దేశంలో పెండింగ్ కేసుల సంఖ్య 5 కోట్లు దాటిపోవడమే కాకుండా, న్యాయమూర్తుల నిష్పత్తి ప్రతి లక్ష మందికి కేవలం 21 మందిగా ఉండటం వల్ల కేసుల పరిష్కారానికి సగటున 10 నుండి 15 సంవత్సరాల సుదీర్ఘ కాలం పడుతోంది. ఆర్థిక అసమానతలు ఈ సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి; ఒకవైపు సీనియర్ న్యాయవాదులు రోజుకు 5 నుండి 20 లక్షల రూపాయల ఫీజు వసూలు చేస్తుంటే, మరోవైపు కేవలం 10,000 రూపాయల నెలసరి ఆదాయం కలిగిన పేద కుటుంబాలకు న్యాయం అనేది అందని ద్రాక్షలా మారుతోంది. దీని పర్యవసానంగా, జైళ్లలో మగ్గుతున్న వారిలో 70 శాతం కంటే ఎక్కువ మంది కేవలం విచారణ ఖైదీలుగానే మిగిలిపోతున్నారు, వీరిలో అధిక శాతం పేద నిందితులే కావడం గమనార్హం.


ఈ అంకెలు చూస్తుంటే సామాన్యుడికి న్యాయం అందడం అనేది గగనపుష్పమే అనిపిస్తుంది. ఒక పేదవాడు చిన్న తప్పు చేసినా విచారణ ముగిసేలోపే ఏళ్ల తరబడి జైల్లో మగ్గిపోవాలి. అదే ఒక ధనవంతుడు పెద్ద నేరానికి పాల్పడినా, అతనికి ఖరీదైన లాయర్లు ఉంటారు. రాత్రికి రాత్రే బెయిల్ వస్తుంది. సాక్ష్యాలు తారుమారవుతాయి. చివరకు కేసు నీరుగారిపోతుంది. ఇది ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు. ఈ జబ్బుకు మందు లేకపోలేదు, కానీ దాన్ని ఇచ్చే నాథుడు కరువయ్యాడు. న్యాయవ్యవస్థలో మార్పులు రావాలంటే కేవలం ప్రసంగాలు సరిపోవు. దేశవ్యాప్తంగా న్యాయస్థానాల్లో వేల సంఖ్యలో ఉన్న న్యాయమూర్తుల ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలి. ప్రభుత్వాలు అందించే ఉచిత న్యాయ సహాయం కేవలం నామమాత్రంగా ఉండకూడదు. సమర్థులైన న్యాయవాదులు పేదల తరపున వాదించేలా వారికి తగిన ప్రోత్సాహకాలు ఇవ్వాలి. కేసుల విచారణ వేగవంతం కావాలి. నిర్ణీత కాలపరిమితిలో తీర్పులు వచ్చేలా చట్టాలు చేయాలి. ఈ-కోర్టుల ద్వారా కేసుల స్థితిగతులను సామాన్యులకు అర్థమయ్యేలా డిజిటలైజ్ చేయాలి.

న్యాయం అనేది దయతో ఇచ్చేది కాదు, అది ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు. రాజ్యాంగం ఇచ్చిన హామీని నిలబెట్టడం పాలకుల బాధ్యత. న్యాయమూర్తుల నియామకంలో పారదర్శకత ఉండాలి, రాజకీయ జోక్యం ఉండకూడదు. అప్పుడే వ్యవస్థ మీద సామాన్యుడికి నమ్మకం కలుగుతుంది. సామాన్యుల రోదనలు, అభాగ్యుల కన్నీళ్లు ఈ దేశపు అంతరాత్మను మేల్కొల్పాలి. మనం ఓటు వేసేటప్పుడు గానీ, పాలకులను ప్రశ్నించేటప్పుడు గానీ రోడ్లు, భవనాలతో పాటు మాకు న్యాయం సులభంగా దొరుకుతుందా? అని కూడా అడగాలి. న్యాయం కేవలం కోర్టు గదుల్లో బ్లాక్ కోటుల మధ్య జరిగే వ్యవహారం కాదు. అది సమాజపు మనసాక్షిలో ప్రతిబింబించాలి. చివరగా ఒక్క మాట అన్యాయానికి గురైన పేదవాడు ఆకలితోనో, ఆవేదనతోనో చావాల్సిందేనా? ఈ ప్రశ్న ప్రతి పాలకుడి గుండెను దహించాలి. న్యాయం అనేది ధనవంతుల హక్కు కాదు, అది అభాగ్యులకు అందే అస్త్రం కావాలి. ఆ మార్పు కోసమే మనం గళమెత్తాలి. వ్యవస్థాగత లోపాలను సరిదిద్దకపోతే, ప్రజాస్వామ్యం అనే పదానికి అర్థమే ఉండదు. న్యాయం అందరికీ అందినప్పుడే మన దేశం నిజమైన స్వాతంత్ర్య సంబరాలు జరుపుకుంటుంది. అప్పటి వరకు సామాన్యుడి పోరాటం ఆగకూడదు. న్యాయం ఆలస్యమైతే అది న్యాయాన్ని నిరాకరించడమే. పేదవాడి కన్నీటి చుక్కలో దేశ భవిష్యత్తు దాగి ఉంది. మేల్కొందాం న్యాయం కోసం గళమెత్తుదాం!

**డా .సూర్యదేవర రామకృష్ణ,**
**9490754169**

# 'ఉపా' ఉచ్చు వీడేనా..?

నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న మైనింగ్ అక్రమాలపై కలం ఎత్తిన జర్నలిస్టు ఒకరు.. మలిదశ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి గళం వినిపించిన స్కాలర్ మరొకరు. వీరిద్దరిపై మోపిన 'ఉపా' (ఖూఉాూ) కేసులో ఐదేళ్ల ( 4 సంవత్సరాల, 9 నెలల, 2 రోజులు) సుదీర్ఘ నిరీక్షణకు తెరపడనుంది. హనుమకొండ జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ ఎదుర్కొంటున్న జర్నలిస్ట్ దామెర రాజేందర్, ఓయూ స్కాలర్ కంచర్ల బద్రిల భవితవ్యంపై నేడు (ఈ నెల 5, మంగళవారం) వెలువడనున్న తీర్పుపై ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా పౌర సమాజం, మేధావుల దృష్టి నిలిచింది.




2021 ఆగస్టులో నమోదైన ఈ కేసు అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జర్నలిస్టుగా రాజేందర్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో సాగుతున్న అక్రమ మైనింగ్, పర్యావరణ విధ్వంసంపై అనేక పరిశోధనాత్మక కథనాలు రాశారు. ముఖ్యంగా 'స్టాఫ్ బోర్ బ్లాస్టింగ్ - సేవ్ ఎన్విరాన్మెంట్' అనే పుస్తకం ద్వారా ఆయన మైనింగ్ మాఫియా తీరును ఎండగట్టారు. ఈ నేపథ్యంలోనే ఆయనను, ఓయూ విద్యార్థి నాయకుడు కంచర్ల బద్రిని మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలతో పోలీసులు అరెస్ట్ చేసి 'ఉపా' చట్టం కింద కేసు నమోదు చేశారు. 4 రోజుల పోలీస్ కస్టడీ, 96 రోజుల జైలులో రాజేందర్ ఉండగా, బద్రీ మరి కొన్ని నెలల పాటు జైలు జీవితం గడుపాల్సి వచ్చింది.

ఈ కేసు గత కొన్ని నెలలుగా కోర్టులో ట్రాయల్ నడిచి విచారణ ముగిసింది. నేడు (ఈనెల 5వ తేదీ) తీర్పు వెలువడనుండి. ఈ కేసు విచారణలో బాధితుల పక్షం తరఫున సీనియర్ న్యాయవాది పులి సత్యనారాయణ, డాక్టర్ జిలుకర శ్రీనివాస్ వినిపించిన తుది వాదనలు వినిపించారు. కేసులోని కుట్రలను, చార్జీషీట్ లోని కుట్రపూరితమైన సాక్షాలను కోర్టు ముందు తేటతెల్లం చేశారు.

ఈ కేసులో ప్రధానంగా లేవనెత్తిన అంశాలు ఉపా చట్టం వర్తించాలంటే ఆరోపణలు ఎదుర్కొంటున్న సంస్థ తప్పనిసరిగా కేంద్రం ప్రకటించిన 'నిషేధిత జాబితా' (షెడ్యూల్ - 1) లో ఉండాలి. కానీ, పోలీసులు పేర్కొన్న UCCRI(ML) గానీ, నిర్దిష్టమైన మావోయిస్టు పార్టీ పేరు గానీ ఆ జాబితాలో లేవని న్యాయవాదులు వాదించారు. ఇక మార్కెట్లో బహిరంగంగా లభించే పుస్తకాలను 'నిషేధిత సాహిత్యం'గా చిత్రించి, బాధితులను సమాజం ముందు తప్పుగా చూపించే ప్రయత్నం జరిగిందని వారు వాదించారు. సామాజిక గొంతుకలను అణచివేయడానికే 'ఉపా' వంటి కఠిన చట్టాలను అక్రమంగా ప్రయోగించారని న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. తప్పుడు సాక్ష్యాలతో కోర్టును తప్పుదోవ పట్టించేలా సాక్ష్యాలు ఉన్నాయని వాదించారు.

అక్రమ మైనింగ్‌పై పోరాడిన జర్నలిస్టుకు, ప్రజాస్వామిక వాదికి న్యాయస్థానం క్లీన్ చిట్ ఇస్తుందా..? లేదా ప్రాసిక్యూషన్ వాదనలు నిలుస్తాయా..? అన్నది ఇప్పుడు తేలాల్సి ఉంది. "న్యాయవ్యవస్థ మీద సంపూర్ణ విశ్వాసం ఉందని, సత్యం గెలుస్తుందని నమ్ముతున్నాం" అని బాధితులు రాజేందర్, బద్రి ధీమా ఆశాభావం వ్యక్తం చేస్తున్నప్పటికీ తీర్పుపై మాత్రం ఉత్కంఠ నెలకొంది. ఈ తీర్పు కేవలం వ్యక్తుల భవితవ్యాన్ని మాత్రమే కాదు, తెలంగాణలో భావప్రకటనా స్వేచ్ఛ, పౌర హక్కుల స్థితిగతులను కూడా ప్రతిబింబించనుంది. అక్రమ కేసులతో గొంతు నొక్కాలని చూసే శక్తులకు ఈ తీర్పు ఒక స్పష్టమైన సమాధానం చెబుతుందని హక్కుల సంఘాలు ఆశిస్తున్నాయి.

## వెస్ట్ బెంగాల్‌లో బీజేపీ గెలుపు

# ప్రజాస్వామ్యానికి ప్రతిరూపమా !?

పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికలు ముగిశాయి. ఫలితాలు వెలువడకముందే ఒక అభిప్రాయం బలంగా వినిపించింది "మమతా బెనర్జీ ఓటమి ఖాయం" అనే ప్రచారం. ఇది కేవలం రాజకీయ విశ్లేషణకు మించింది. ఎన్నికల ప్రక్రియలోనే ఒక "శస్త్రచికిత్స" జరిగిందనే భావనను బలపరిచింది. నిజంగా అలా జరిగిందా? ప్రయాణం మొదలయ్యే ముందే గమ్యం నిర్ణయించబడితే, అది ఇక ఎన్నికలు కాదు. అది నియంత్రిత ప్రజాస్వామ్యానికి పునాది.



ఈ ఎన్నికల్లో హోరాహోరీ ప్రత్యర్థులు తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ. కానీ ఈ పోటీలో మధ్యవర్తిగా ఉండాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం, కుయుక్తులతో నిష్పాక్షికంగా వ్యవహరించలేదనే విమర్శలు తీవ్రంగా అన్ని వర్గాల నుంచి వినిపించాయి. ఎన్నికల యంత్రాంగం మొత్తం కేంద్రంలోని పాలక పార్టీకి అనుబంధ సంస్థగా మారడం, సుప్రీంకోర్టు కూడా ఆ అసమతౌల్యాన్ని మౌనంగా సమర్థించడగా విమర్శకుల ఆరోపణ. అలాంటి వాతావరణంలో ప్రజలు ఈ నియంత్రిత వ్యవస్థను స్వాగతిస్తే, భారత ప్రజాస్వామ్యం కేవలం నామమాత్రపు నినాదంగా మిగులు తుంది.

**ఎన్నికలు ప్రశాంతంగా జరిపించడం కోసం**

సహజంగా భద్రతా బలగాలను మోహరింపు చేస్తాయో. కానీ ఈ ఎన్నికల్లో దాదాపు ప్రతి దశలోనూ అనూహ్యమైన సంఖ్యలో కేంద్ర బలగాలను మోహరించారు . ఒక్క వైమానిక, నావికా దళాలు మినహా అన్ని రకాల బలగాలు వచ్చాయి. ఎన్నికల కమిషన్ ప్రకారం, కేవలం మొదటి దశకే సుమారు 684 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల హింసను అరికట్టడం కంటే, నిర్దిష్ట రాజకీయ పార్టీ (తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలపై ఒత్తిడి తీసుకురావడమే దీని లక్ష్యమనే విమర్శ సర్వత్రా వినిపించింది.

ఓటర్ల జాబితా ప్రక్షాళన మరింత వివాదాస్పదమైంది. దాదాపు 27 లక్షల మంది ఉనికిలో ఉన్న ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. ఇది చాలా ఎక్కువ సంఖ్య. ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో ఈ తొలగింపు ఎక్కువగా జరిగిందన్న ఆరోపణ కూడా ఉంది. ఇది ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే ఒక వ్యూహంగా కనిపించింది. సుప్రీంకోర్టు కూడా ఈ స్థాయి ఓట్ల రద్దును "హేతుబద్ధత లేని వివరణ"గా వ్యాఖ్యానించింది. అయినా కోర్టు "వీళ్ళంతా ఈ ఎన్నికల్లో ఓటు వేయకపోతే ఏమి కొంపలంటుకుంటాయి" అని ప్రశ్నించింది. ఈ ఒక్క వాక్యం ఆ సందర్భంలో ఎంత నిర్లక్ష్యభావాన్ని చూపిస్తుందో, ఓటుహక్కు ఎంత ప్రాథమికమైన హక్కో దాని గౌరవాన్ని ఎంత తగ్గించే విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ప్రచారం యొక్క స్వరం ఇవన్నిటికంటే అతి ప్రమాదకరమైన మలుపు తిరిగింది. "సబ్ కా సాత్, సబ్ కా వికాస్" నినాదం ముసుగులో జాతీయ రాజకీయాలు నడుస్తుంటే, బెంగాల్లో "పరివర్తన" నినాదం కింద ఒక కొత్త విధ్వంసకారి ఎజెండా బయటపడింది. "చొరబాటుదారులు", "దురాక్రమణదారులు" అనే పదాలు బీజేపీ ప్రచారంలో ఎక్కువగా వినిపించాయి. కేంద్ర హోంమంత్రి స్వయంగా సందేష్ఖాలి షాజహాన్ షేక్ లాంటి వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని, ఒక వ్యక్తి నేరస్థుడైతే అది ప్రచారమైపోవచ్చు. కానీ, ఆ ప్రచారం స్వరూపం మొత్తం ఒక మతాన్ని, ఒక వర్గాన్ని "దేశానికి చెందని వారు"గా చిత్రీకరించే విధంగా ఉండడం ఆందోళన కలిగించింది.

ప్రధాని మోదీ "దీదీ, ఓ దీదీ" అంటూ మమతా బెనర్జీని సంబోధించిన తీరు నుంచి, కేవలం ఒక వ్యక్తిని కాక స్త్రీలు మొత్తం పట్ల ఎలాంటి భాష ఉపయోగించబడుతుందో చూపించింది. ఒక ముఖ్యమంత్రి "నేను పూజ చేస్తే ,మమతా నమాజ్ చేస్తుంది" వంటి విభేదాలను పెంచే వ్యాఖ్యలు చేయడం, మరోవైపు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ "బెంగాల్ లో హిందువులకు స్థానం లేకుండా చేస్తున్నారు" అనడం వంటివి జరిగాయి. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి బెంగాల్ లో ఉర్దూ భాషకు స్థానం లేదని ప్రకటించడం కూడా ఇదే విభజన వ్యూహంలో భాగం. ఈ ప్రచారంలో ఎక్కడా బీజేపీ తమకు ముస్లింలు ఓటు వేయాలని ఆశించే లేదు. అంటే, వారు ఒక "మెజారిటీ హిందువుల" ఓటు బ్యాంకు మీదే నమ్మకం పెట్టుకున్నారని స్పష్టమవుతుంది . సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘం వంటి సంస్థలు ఈ విద్వేష ప్రచారానికి సహాయకులుగా మారిన దృశ్యం భారత ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయంగా నిలిచిపోతుంది.

చివరగా, ఇదంతా " కేంద్ర ప్రభుత్వం దాని అనుబంధ సంస్థలు, దర్యాప్తు సంస్థలు బీజేపీ కి దాడులతో సహకరించాయి. ఎన్నికలు అంటే నమ్మకమైన పోటీ; కానీ ఇక్కడ అసమానతల పోటీ జరిగింది. బీజేపీ గెలుపే లక్ష్యంగా కేంద్ర యంత్రాంగం కృషి చేసింది. బీజేపి గెలవడం ఖాయం అని ఎన్నికల ఫలితాలు రాకముందే ప్రజలు ఒక నిర్ణయానికి వచ్చేశారు. ప్రజాస్వామ్యానికి ప్రాణం అయిన ఎన్నికల ప్రక్రియ పవిత్రతకు తీవ్ర భంగం వాటిల్లింది. ప్రజలు ఈ విధానాన్ని సహజంగా స్వీకరిస్తే, రాబోయే రోజుల్లో భారతీయ ప్రజాస్వామ్యం ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉంది. విజేత ఎవరనేది కాకుండా, ఈ ప్రక్రియలో ప్రజలు ఎలా నమ్మకాన్ని కోల్పోతున్నారన్నది అందరినీ ఆలోచింప జేయవలసిన విషయం.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**

# ఫ్యూచర్ సిటీ భూసేకరణ

## రైతును కోటీశ్వరుడిని చేయాలి.. అభివృద్ధిలో భాగస్వామిని చేయాలి

తెలంగాణను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో రంగారెడ్డి జిల్లా శ్రీశైలం హైవే సమీపంలో ప్రభుత్వం 'ఫ్యూచర్ సిటీ' నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. సుమారు 25,000 నుండి 30,000 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకోనున్న ఈ నగరం కేవలం భవనాల సముదాయం కాదు, వేలాది మంది రైతుల జీవనాధారం. గతంలో జరిగిన బలవంతపు భూసేకరణలు రైతును 'నిర్వాసితుడిని' చేసి రోడ్డున పడేస్తే, అమరావతి, పూణే (మగర్పట్టా) నమూనాలు రైతును 'భాగస్వామిని' చేసి కోటీశ్వరుడిని చేశాయి. ఫ్యూచర్ సిటీలోనూ అదే స్ఫూర్తితో రైతులను అభివృద్ధిలో భాగస్వాములను చేయాల్సిన చారిత్రక అవసరం నేడు ఉంది.



1. ఫ్యూచర్ సిటీ: ప్రభావిత గ్రామాలు మరియు భూమి గణాంకాలు

ప్రస్తుత అంచనాల ప్రకారం, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు కింద మహేశ్వరం, కందుకూరు మరియు యాచారం మండలాల్లోని కీలక భూములను ప్రభుత్వం గుర్తించింది.

ప్రధాన గ్రామాలు: ముచ్చెర్ల, మీర్‌ఖాన్‌పేట, తక్కెళ్లపల్లి, కడ్తాల్ ప్రాంతంలోని కీలక గ్రామాలు, యాచారం పరిసర ప్రాంతాలు ఈ ప్రాజెక్టు పరిధిలోకి వస్తాయి.

భూమి విస్తీర్ణం: ప్రాథమికంగా 16,000 ఎకరాల నుండి ప్రారంభించి, దశలవారీగా దీనిని 30,000 ఎకరాలకువిస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

రైతుల ఆందోళన: ఇప్పటికే ఫార్మా సిటీ కోసం సేకరించిన భూములను ఫ్యూచర్ సిటీకి బదిలీ చేయడం, కొత్తగా సేకరించాల్సిన భూములకు తక్కువ పరిహారం ఇవ్వడంపై స్థానిక రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

2. తులనాత్మక పరిశీలన: అమరావతి, పూణే వర్సెస్ ఫ్యూచర్ సిటీ

ప్రభుత్వం ఇచ్చే నగదు పరిహారం కంటే, అభివృద్ధిలో వాటా ఇవ్వడం రైతులకు ఎలా మేలు చేస్తుందో ఈ క్రింది పట్టిక ద్వారా గమనించవచ్చు:

ప్యాకేజీ అంశం అమరావతి నమూనా (Land Pooling) పూణే మగర్పట్టా నమూనా ఫ్యూచర్ సిటీ (ప్రస్తుత స్థితి)

భాగస్వామ్యం రైతుకు 1000-1250 గజాల ప్లాట్లు వెనక్కి ఇస్తారు. రైతులు కంపెనీగా ఏర్పడి లాభాల్లో వాటా పొందుతారు. కేవలం నగదు పరిహారం (వన్ టైం సెటిల్మెంట్).

నిరంతర ఆదాయం 10 ఏళ్ల పాటు ఏటా 30,000 - ?50,000 కౌలు. డివిడెండ్లు మరియు కంపెనీ లాభాల ద్వారా ఆదాయం. ఒక్కసారి డబ్బు ఇస్తే మళ్ళీ ఆదాయం ఉండదు.

ఆస్తి విలువ నగరం పెరిగే కొద్దీ ప్లాట్ల విలువ కోట్లకు చేరుతుంది. భూమి యజమానిగా హోదా కొనసాగుతుంది. రైతుకు భూమితో సంబంధం తెగిపోతుంది.

3. ఫ్యూచర్ సిటీలో రైతులకు అందించాల్సిన 'భాగస్వామ్య ప్యాకేజీ'

ఫ్యూచర్ సిటీ కేవలం పరిశ్రమల కోసం కాదు, అదొక నివాస మరియు ఐటీ హబ్. కాబట్టి, ఇక్కడ అమరావతి తరహా భూ సమీకరణ (Land Pooling) విధానాన్ని అమలు చేయాలని రైతులు బలంగా డిమాండ్ చేస్తున్నారు.

ప్లాట్ల కేటాయింపు: ఎకరా భూమి ఇచ్చిన రైతుకు ఫ్యూచర్ సిటీలోనే కనీసం 1000 గజాల నివాస స్థలం, 400 గజాల వాణిజ్య స్థలం కేటాయించాలి. దీనివల్ల రేపు అక్కడ నిర్మించే మాల్స్, ఆఫీసుల ద్వారా రైతుకు అద్దె ఆదాయం లభిస్తుంది.

అభివృద్ధిలో వాటా: ప్రైవేట్ బిల్డర్లు 40:60 నిష్పత్తిలో రైతులకు భాగస్వామ్యం ఇస్తున్నప్పుడు, కోట్లాది రూపాయల విలువైన 'ఫ్యూచర్ సిటీ'లో ప్రభుత్వం రైతుకు కేవలం నగదు పరిహారం ఇచ్చి పంపివేయడం అన్యాయం.

నైపుణ్యాభివృద్ధి: ప్రభావిత గ్రామాల్లోని యువతకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), డేటా సైన్స్ వంటి రంగాల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఫ్యూచర్ సిటీలో వచ్చే కంపెనీల్లో ఉద్యోగ హామీ కల్పించాలి.

4. రాజకీయ మరియు ఆర్థిక ప్రభావం

అమరావతిలో రాజకీయ అనిశ్చితి వల్ల ప్లాట్ల ధరలు హెచ్చుతగ్గులకు లోనయ్యాయి. ఫ్యూచర్ సిటీలో అటువంటి పరిస్థితి రాకుండా, ప్రభుత్వం చట్టబద్ధమైన గ్యారెంటీ ఇవ్వాలి. భూమిని అమ్మిన రైతు మళ్ళీ పేదవాడు కాకుండా, భూమిని 'పెట్టుబడిగా' పెట్టిన రైతు 'నగర భాగస్వామి'గా ఎదగాలి. ముచ్చెర్ల, మీర్‌ఖాన్‌పేట వంటి గ్రామాల్లోని సామాన్య రైతులు రేపు ప్రపంచ స్థాయి ఐటీ హబ్‌లో వాటాదారులుగా మారినప్పుడే తెలంగాణా అభివృద్ధికి నిజమైన అర్థం లభిస్తుంది.

ఫ్యూచర్ సిటీ నిర్మాణం తెలంగాణా గర్వకారణం కావాలి, కానీ అది రైతుల కన్నీళ్లపై నిర్మించబడకూడదు. అమరావతిలో అమలు చేసిన భూ సమీకరణ విధానాన్ని లేదా పూణేలో రైతులు సాధించిన ఆర్థిక స్వతంత్రాన్ని ఫ్యూచర్ సిటీలో అమలు చేయాలి. ప్రభుత్వం పాత పద్ధతిలో భూసేకరణ చట్టం-2013 ముసుగులో నగదు ఇచ్చి పంపివేయకుండా, రైతును 'ఫ్యూచర్ సిటీ మేకర్'గా గుర్తించినప్పుడే ఈ మహత్తర ప్రాజెక్టు విజయవంత మవుతుంది.



**బిఎస్ రాములు**
**8331966987**

# ఆర్గానిక్ పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలి

- జిల్లాలో ఫాం ఆయిల్ తోటలు ఎక్కువగా పెట్టండి
- ఫాం ఆయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తాం
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, మే 4 (జనంసాక్షి) :** రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం కోనసాగుతుందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా తాండూర్ ఎస్ వి ఆర్ ఫంక్షన్ హాలు నందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు వారోత్స వాల కార్యక్రమం లో ముఖ్య అతిధిగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుపాల్గొని మాట్లాడారు. జిల్లా లో 99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా సోమవారం నుండి మే 9 వరకు రైతు వారోత్సవాలు జరుగుతాయని తెలిపారు. తెలంగాణ గీతం తో పాటు జ్యోతి ప్రజల్వనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ రైతులు ప్రయత్నం చేయక పోతే భవిష్యత్తు లో భూమి మొత్తం నిస్థార మవుతుందని,తక్కువ పెట్టుబడి తో ఎక్కువ పంటలు పండించేలా రైతులు ముందుకెళ్లాలని, ఆర్గానిక్ పంటల సాగు పై రైతులు ద్రుష్టి పెట్టాలన్నారు.భూములను రక్షించి ప్రకృతి వ్యవసాయం చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. సైంటిస్ట్ లు భూమిని ఎ రకంగా సంరక్షించు కోవాలో అవగాహనా కలిపిస్తారని తెలిపారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయుటకు ఒక లక్షా 40 వేల కోట్లు రైతుల ఖాతాలలో రాష్ట్ర ప్రభుత్వం జమ చేయడం జరిగిందన్నారు.రాష్ట్ర ముఖ్య మంత్రి ప్రయత్నంతో 90 కోట్ల మంజూరు తో కోట్ పల్లి ప్రాజెక్టు తెచ్చారని,40నుండి 50 వేల క్వింటాల దాక మొక్క జొన్న పండడిస్తున్నామని, భారత దేశంలో అత్యధిక పంటలు పండించే రైతులు తెలంగాణ రైతు లేనని, ప్రభుత్వం ఎక్కువ మొత్తం లో వరి కొనుగోలు చేస్తుందని అన్నారు.నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం, పై అవగాహనా కలిపించు కోవాలన్నారు. ప్రకృతి పంటలు పండించిన లావణ్య రెడ్డి తో కలిసి టి జి ఆన్లైన్ యాప్ ను ప్రారంభించారు. వ్యవసాయ శాఖ, ఉద్యాన వన శాఖ, మత్స్య శాఖ వివిధ శాఖ లు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించారు.స్థానిక శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ రైతే రాజు,రైతు దేశానికి వెన్నెముక వంటి వాడు, వ్యవసాయం దండగ కాదు,, వ్యవసాయం ఒక పండుగ, మంత్రి చొరవ తో వ్యవసాయ రంగాన్నే ముందుకు తీసుకెళ్తున్నమ్మన్నారు. ఎక్కడ పోగొట్టు కున్నామో అక్కడే అభివృద్ధి జరగా లనే ఉద్దేశం తో రైతులు ప్రకృతి పంటల సాగు పై దృష్టి పెట్టాలన్నారు.ఎ ఓ లు, సైంటిస్ట్ ల సూచనలు పాటించి పొలాల్లో ఏయే పంటలు వేస్తె బాగుంటుందని వాటి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు.14 వేల కోట్లు మార్కెట్ కోసం మంజూరై య్యాని, అయిల్ ఫామ్ కంపెనీ జిల్లా కు మంజూరు ఐనదని, తాండూర్ కంది పప్పుకు చాలా ప్రాముఖ్యత ఉందని, కంది బోర్డు ఏర్పాటు చేయాలనీ ఈ సందర్బంగా మంత్రిని కోరారు.జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం నుండి మే 9 వరకు రైతు వారోస్తావాలు ప్రారంభం, రైతులకు సంబందించి రైతు భరోసా, రైతు భీమా, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై వివరించడం, వారి సలహాలు సూచనలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.రైతులు, పలువురు సైంటిస్ట్ లు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేందర్ మోహన్ , చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, కార్పొరేషన్ చైర్ పర్సన్ సుజాత , జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, డీసీసీ అధ్యక్షుడు ధారసింగ్ , మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి, ఏఎంసి చైర్మన్ లు పట్లోళ్ళ నర్సింలు , అంజయ్య, మాధవ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి , లక్ష్మారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## ధన్వాడ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 4 (జనం సాక్షి) :** జిల్లాలోని ధన్వాడ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ సీ. హెచ్. ప్రియాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని పలు వార్డులను పరిశీలించారు. మందులను చూసి,గడువు తీరిన మందులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. టీకాల గదిని చూశారు.వ్యాక్సినేషన్, ఈఎన్ సీ, ఎన్.సీ. డీ నమోదు గురించి ఆరా తీశారు. ఎంత మంది స్టాఫ్, ఏ ఎన్ ఎం లు ఉన్నారని మెడికల్ ఆఫీసర్ ను ప్రశ్నించారు. కేంద్రంలో నెలకు ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయని, గత నెలలో నమోదైన గర్భిణుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత నెలలో జరగాల్సిన ప్రసవాలలో ఎన్ని ఆస్పత్రిలో జరిగాయి?.. ఎన్ని జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు?. ఎన్ని సాధారణ ప్రసవాలు జరిగాయి?. ఎన్ని సెక్షన్ జరిగాయని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లిన వాళ్లు ఎంత మంది ఉన్నారనే వివరాల గురించి ఆమె వాకబు చేశారు. స్టోర్ రూమ్, ఆపరేషన్ థియేటర్ ను పరిశీలించారు. ఈ డీ డీ క్యాలెండర్, ఔట్ పేషంట్స్ ఆన్ లైన్ నమోదు, రోజువారీ చికిత్సలు పొందిన రోగుల సంఖ్య కంప్యూటర్ లో నమోదు చేశారా లేదా అని క్షుణ్ణంగా పరిశీలించారు.

## అవినీతి నిరోధక శాఖకు చిక్కిన జీహెచ్ఎంసీ తిమింగలం



**ఖైరతాబాద్, మే 4 (జనం సాక్షి) :** నగరం నడిబొడ్డున పట్టపగలే అవినీతి నిరోధక శాఖ వలలో జీహెచ్ఎంసీ సిబ్బంది చిక్కారు. అవినీతి నిరోధక శాఖ తెలంగాణ అధికారులు సోమవారం గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఖైరతా బాద్ జోన్ సర్కిల్-37కు చెందిన జూనియర్ అసి స్టెంట్ బి. శ్రీలతను లంచం తీసుకుంటుండంగా పట్టుకున్నారు.బోరబండ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆమె, ఇంటి నిర్మాణ అనుమతి కోసం ఫిర్యాదుదారునికి అనుకూలంగా పని చేస్తానని చెప్పి మొత్తం రూ.5 లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు వెల్లడైంది.అందులో భాగంగా తొలి విడతగా రూ.1 లక్షను యూసుఫ్‌గూడ చెక్ పోస్ట్ సమీపంలో స్వీకరిస్తుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు.ఆమె వద్ద నుంచి స్వీకరించిన రూ.1 లక్ష లంచం మొత్తాన్ని అధికా రులు స్వాధీనం చేసుకున్నారు. రసాయన పరీక్షల్లో ఆమె చేతులకు లంచపు ద్రావణం పాజిటివ్‌గా తేలినట్లు తెలిపారు. దీంతో ఆమె విధులను దుర్వి నియోగం చేసి అక్రమ లాభం పొందేందుకు ప్రయ త్నించినట్లు నిర్ధారణ అయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ఆమెను అరెస్ట్ చేసి నాంపల్లి ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నారు.

# పునరావసానికి పూర్తి సహకారం

- జిల్లా ఎస్పీ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 4 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సమాజంలో శాంతి, భద్రతలను బలోపేతం చేయడంలో భాగంగా జనజీవన ప్రవంతిలోకి వచ్చిన మాజీ మావోయిస్టులతో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ సోమవారం ఎస్పీ కార్యాలయంలో మాట్లాడారు. 2018 సంవత్సరం సెప్టెంబర్ నెలలో మక్తల్ మండలం, జక్లేర్ గ్రామానికి చెందిన అనిల్ కుమార్ అలియాస్ భగత్ సింగ్ వయస్సు 29 సం.భార్య గద్వాల కు చెందిన భవాని అలియాస్ సుగుణ వయస్సు 27 సం.లు మావోయిస్టు దళంలో చేరి చత్తీస్ గడ్ అడవుల్లో ఉండి, అక్కడే వివాహం చేసుకుని జీవనం సాగించా రు.అనంతరం ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో, మార్చి 03, 2026 న హైద రాబాద్‌లోని డిజిపి కార్యాల యంలో మాజీ డి జీ పి శివధర్ రెడ్డి ఆధ్వర్యంలో లొంగిపోయి, జనజీవన ప్రవంతిలోకి చేరారు.ఈ నేపథ్యంలో నేడు వారు నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారికి ఒక నెలకు సరిపడా అవసరమైన నిత్యావసర సరుకులను క్వింటాల్ (బియ్యం, వంట పాత్రలు,కుక్కర్) అందజే శారు. అలాగే వారు భవిష్య త్తులో చేయాలనుకుంటున్న ఉపాధి, జీవన మార్గం గురించి ఆలోచించుకుని, ఒక నెల తర్వాత మళ్లీ కలవాలని సూచించారు. వారి పునరా వాసానికి పోలీస్ శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూమావోయిస్టు దళాన్ని విడిచి జనజీవన ప్రవంతిలోకి రావడం మంచి నిర్ణయమని, ఇకపై సమా జంతో కలిసిమెలిసి జీవిస్తూ ప్రజలకు సేవ చేయాలని సూచించారు. సమాజంలో ఉన్న సమస్యలైన బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ వంటి అనర్థాలను అరికట్టడంలో తమ వంతు పాత్ర పోషించాలని కోరారు.అలాగే బీద ప్రజలకు సహా యం చేయడం, కుటుంబ సభ్యులతో సఖ్యతగా జీవిం చడం ద్వారా సమాజంలో ఆదర్శంగా నిలవాలని సూచించారు.ఈ కార్యక్ర మంలో అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ హుల్ హక్, ఎస్బి ఎస్ఐ నరేష్ తది తరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో కార్మికులకు స్వచ్ఛ ఆర్మీ టీషర్టులు అందజేత




**ఉప్పల్, మే 4 (జనం సాక్షి) :** ఉప్పల్ ప్రాంతంలో శానిటేషన్, డ్రైనేజ్ వ్యవస్థలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తిస్తూ వారికి స్వచ్ఛ ఆర్మీ టీషర్టులను అందజేసినట్లు కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ఉప్పల్ పరిసరాల్లో పరిశు భ్రతను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు గౌరవ సూచకంగా ఈ టీషర్టులను అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రజల ఆరోగ్య రక్షణలో పారిశుద్ధ్య సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారు. వారి కష్టానికి గుర్తింపుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాం" అని పేర్కొన్నారు. వేసవి తీవ్రత ఉన్నప్పటికీ కార్మికులు నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తున్నారని, వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు కట్టుబడి ఉన్నారని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు కార్మికుల్లో ఉత్తేజాన్ని పెంపొందించడమే కాకుండా, ఉప్పల్ ప్రాంతంలో పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంచడంలో దోహదపడతాయని కమిషనర్ అభిప్రాయపడ్డారు.

## తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- మంత్రి జూపల్లి కృష్ణారావు



**వీపనగండ్ల, మే 4 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల కల్వరాల గ్రామంలో ఐకేపీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, పురావస్తు, సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావు, సర్పంచ్ బండారి రాముడు,కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి జూపల్లి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర ఏ విధంగా అయితే కల్పించిందో అదే విధంగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమ ప్రభుత్వమని అన్నారు. రైతులకు అన్యాయం జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఐకెపి సభ్యులకు, అధికారులకు సూచించారు.ఏ గ్రేడ్ వరి ధాన్యం క్వింటారకు 2387/- రూపాయలు బి గ్రేడ్ ధాన్యానికి 2369/- రూపాయల కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రైవేటు వ్యక్తులకు ధాన్యం అమ్మి రైతులు మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రైతులు పండించిన ధాన్యం గింజ కూడా పక్కదారి పడితే ప్రతి ఒక్కరి పైన చర్య ఉంటుంది మంత్రి హెచ్చరించారు. ఐకెపి కేంద్రాలలో రైతుల ధాన్యానికి సరిపడే విధంగా గని సంచులు ఏర్పాటు చేయాలని అన్నారు. రైతుల ధాన్యాన్ని క్రమసంఖ్య పద్ధతిలో కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు.తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులు ప్రభుత్వ సూచించిన నియమ నిబంధనలకు ప్రకారం ధాన్యాన్ని అమ్మాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐకెపి సీసీలు కాశీనాథ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చక్ర వెంకటేష్, వెంకట రాజయ్య, రమేష్ గౌడ్,ఎండి అఖిల్,శేఖర్,గ్రామ కాంగ్రెస్ నాయకులు, మహిళా సమాఖ్య సభ్యులు, బుక్ కీపర్లు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలి



ఫరూఖ్‌నగర్, మే 4 (జనం సాక్షి) : గత మూడు నెలలుగా పెండింగ్లో ఉన్న ఉపాధి హామీ కూలీల వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీను నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన ఫరూక్నగర్ మండలం బూర్గుల గ్రామంలో ఉపాధి హామీ పనిచేసిన ప్రదేశాన్ని సందర్శించి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి నెల నుంచి ఇప్పటివరకు పనిచేసిన ఉపాధి హామీ కార్మికుల వేతనాలు చెల్లించక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నాయని ఆయన విమర్శించారు.ఉపాధి హామీ కార్మికులకు వారం వరం పే స్లిప్పులను ఇవ్వాలని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని కొత్తగా తెచ్చిన వి బ్ జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని రోజువారీ కనీస వేతనం 307 నుంచి 800 రూపాయలు పెంచాలని కనీస పని దినాలు 200 రోజులు పని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అయినా ప్రభుత్వని డిమాండ్ చేశారు.అదేవిధంగా నూతనంగా రోజువారి రెండు పూటలు రెండు ఫోటోలు తీసే విధానాన్ని రద్దు చేయాలని పైన ప్రభుత్వాన్ని వెంటనే సమస్యలు పరిష్కరించాలని లేనిచో ఎంపీడీవో కార్యాలయాన్ని కార్మికులతో ముట్టడిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు ఉపాధి కూలీలు రవి నర్సింలు సత్తయ్య నరసమ్మ రవి అండాలు అంజమ్మ ఈశ్వరమ్మ నరసమ్మ జయమ్మ బాలయ్య సంతోష పార్వతమ్మ యాదమ్మ జ్యోతి సత్తెమ్మ మౌనిక లింగమయ్య రాములమ్మ అరుణ బాలకిషన్ సత్తెమ్మ లింగమ్మ లక్ష్మమ్మ శాంతమ్మ భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేరుస్తున్న ప్రజా ప్రభుత్వం

- మంత్రి జూపల్లి కృష్ణారావు



**చిన్నంబావి, మే 4 (జనం సాక్షి) :** చిన్నంబావి మండల పరిధిలోని కొప్పునూరు గ్రామంలో ఇందిరమ్మ నూతన గృహప్రవేశ ప్రారంభోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన మంత్రి జూపల్లి కృష్ణారావు కు బ్యాండ్ భజంత్రీలతో పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. మంత్రి జూపల్లి కృష్ణారావు నూతన గృహప్రవేశాలు బడికెల జయమ్మ, సాజిదా మక్బులు, ఆసియా రఫీ ల ఇందిరమ్మ ఇండ్ల దగ్గర కొబ్బరికాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ అనవసరంగా ఎక్కువ ఖర్చు చేసి ఇల్లు కట్టుకొని అప్పుల పాలు కావద్దని ఉన్నదాంట్లోనే సర్దుకుని కట్టుకోవాలని సూచించారు. లబ్ధిదారులు మాట్లాడుతూ మేము జీవితంలో ఇండ్లు కట్టుకుంటామా అనే ఊహించలేకపోయామని కాంగ్రెస్ ప్రభుత్వంలో మాకు ఇండ్లు ఇచ్చి ఆదుకొని స్వయంగా మంత్రి గృహ ప్రారంభోత్సవానికి మా ఇంటికి వచ్చి మాకు అండగా ఉన్నందుకు జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు. పేదల బతుకులు మారాలంటే మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని అని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఒక్కొక్కటిగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటూ పోవడమే మా లక్ష్యం అంటూ గ్రామంలోని ఇండ్లు లేని వారి అందరికి విడతల వారిగా ఇండ్లు వస్తాయని ఎవరు అధైర్య పడొద్దని అన్నారు. గ్రామ సర్పంచ్ వడ్డేమాన్ బిచ్చన్న, మాజీ సర్పంచ్ జంగ బీచుపల్లి యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నంబావి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, పెబ్బేటీ రామచంద్రారెడ్డి, కృష్ణప్రసాద్ యాదవ్, అగ్గన్నగారి శ్రీలత రెడ్డి, బాలు యాదవ్, తేజ రెడ్డి, బగ్గారి నరసింహ రెడ్డి, జ్యోతిగౌడ్, సుధాకర్ నాయుడు, ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు వార్డు మెంబర్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ పంపిణీలో అవకతవకలు ఉండొద్దు



**బంట్వారం, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** బంట్వారం రేషన్ పంపిణీలో అవకతవకలు ఉండొద్దని వికారా బాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సూచించారు. విద్యా ర్థులకు మెరుగైన విద్యను అందించాలన్నారు. మంచి ఆహారం మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. బంట్వారం మండలం కేంద్రంలో కలెక్ట ర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రేషన్ డీలర్ షాప్ వద్దకు వెళ్లి బియ్యం నిల్వ, సరఫరా అయినా బియ్యం, మొత్తం రేషన్ కార్డుదారుల వివరాలు వంటి రికా ర్డులు పరిశీలించారు. రేషన్ పంపిణిలో ఎలాంటి అవ కతవకలు ఉండొద్దని అధికారులకు సూచించారు. అనం తరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ఆస్పత్రిలో మందులను, రికార్డులను పరిశీలించారు. అత్య వసర పరిస్థితులలో పేషంట్లకూ మెరుగైన వైద్య సేవలకై సమీప ఆస్పత్రికి అంబులెన్సులో చేర్పించాలని సూచించా రు. ఆస్పత్రిలోని పేషంట్ కలెక్టర్ మాట్లాడుతూ.. వారి అనారోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏదైన సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కారం చూపుతానని అన్నారు. అక్కడి నుంచి పీఏసీ ఎస్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, వ్యవసాయంకు సంబం ధించిన రైతుల రుణాలకూ, రికవరీ సంబంధించి రికా ర్డుల ను పరిశీలించారు. రైతులకు యూరియా, డీఏపీ కొరతా లేకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని సూచిం చారు. అనంతరం కేజీబీవీ పాఠశాల సందర్శించి బాలికల క్లాస్ రూమ్ను సందర్శించి, విద్యార్థులతో ముచ్చ ట్టించా రు. ఉపాధ్యాయుల పాఠాలు బాగా బోధిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. సమ్మర్ హాలిడేస్లో వేసవి కాలం దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలని సూచిం చారు. అనంతరం పాఠశాల వంట గదిని సంద ర్శించి, మెనూ ప్రకారం ఆహారం అందించాలని సూచిం చారు. వంట సామాగ్రిని పరిశీలించారు. అనంతరం రైతు వేది కను సందర్శించి, రైతులకు పంట ఉత్పాదకతను మెరుగు పర్చుకునేలా, రైతులకూ సహకారం అందించాలని ఏఓకు సూచించారు. రైతు వేదికలో ఉన్న కొన్ని సమ స్యలను ఏఓ శ్రావ్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లింది. రైతు వేదిక ప్రహరీ గోడ, నాసిరకమైన తలుపులు, కిటికీలు, మూత్ర శాలలు వంటి సమస్యలను ఉన్నాయని తెలిపింది. ఆమె చెప్పిన సమస్యలపై స్పందించిన కలెక్టర్ వెంటనే పరిష్కా రం చూపాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనం తరం గ్రామంలోని ఓ ఫర్టిలేజర్ షాప్లో తనిఖీ చేసి, రికా ర్థులులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రేణుక దేవి, తహసీల్దార్ విజయ్కుమార్, ఎంపీడీఓ రాం లు, ఏఓ శ్రావ్య, ఆర్ఐ రాంగోపాల్, కేజీబీవీ స్పెషల్ ఆఫీస ర్ శైలజ, సెక్రటరీ గోపాల్, గ్రామ రెవెన్యూ ఆఫీసర్ అనిత, ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల సమస్యలపై సీఎంను కలిసిన ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, మే 4 (జనంసాక్షి) :** చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కాలే యాదయ్య తెలిపారు. సోమవారం సచివాలయంలో సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై చర్చించారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల పురోగతి అంశాలను వివరించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గానికి అవసరమైన మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని సీఎం సూచించినట్లు పేర్కొన్నారు.

# అభివృద్ధికి నోచుకోని పెద్ద దిన్నె రైల్వే స్టేషన్

- 1978లో అప్పటి రైల్వే శాఖ మంత్రిచే ప్రారంభం
- ఐదు గ్రామాలకు సౌకర్యంగా ఉన్న పట్టించుకోవడం లేదు
- గ్రామం మధ్యలో ఉండటంతో సబ్ వే ఏర్పాటుకు రైల్వే అధికారుల వినతి



**ఇటిక్యాల, మే 4 (జనం సాక్షి) :** గ్రామీణ ప్రజల సౌకర్యార్థం పెద్దదిన్నె రైల్వే స్టేషన్ ను ఏర్పాటు చేసి 48 సంవత్సరాలు అవుతున్న ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో రైల్వే అధికారులు పట్టించుకోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని పెద్దదిన్నె రైల్వే స్టేషన్ ను 1978లో అప్పటి రైల్వే శాఖ మంత్రి మధు దండావతే ప్రారంభించారు. పెద్దదిన్నెతోపాటు శివనంపల్లి, మొగల్ రావులచెరువు, పెద్దదిన్నె, గోపలదిన్నె, ఊదండాపురం, రేపల్లె గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని కర్నూలు మహబూబ్ నగర్, హైదరాబాద్ పట్టణాలకు వెళ్లేందుకు ఇక్కడ ప్యాసింజర్ రైలు మాత్రమే ఆపే ఏర్పాటు చేశారు. ప్రతినిత్యం 100 మందికిపైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధానంగా ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్యాసింజర్ రైలు వీరికి ఆధారం. ఉదయం వేళల్లో కర్నూల్- కాచిగూడ డెమో, గుంతకల్ -కాచిగూడ ప్యాసింజర్, కాచిగూడ- గుంటూరు రైళ్లు ఇక్కడ ఆగుతాయి. ప్రయాణికుల సౌకర్యార్థం తాగునీటి సౌకర్యం లేకపోగా ఫ్లాట్ ఫాం స్టేషన్ ఇరువైపులా పిచ్చి మొక్కలు, కంపచెట్లు పెరిగి రాత్రి సమయంలో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

– గ్రామ మధ్యలో రైల్వే ట్రాక్ ఉండడంతో ప్రమాదాలు

పెద్దదిన్నె గ్రామం మధ్యలో రైల్వే ట్రాక్ ఉండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చిన్న పనికి సైతం ఆయా కాలనీవాసులు ట్రాక్ దాటే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారని గ్రామస్తులు తెలుపుతున్నారు. గతంలో ఉన్న లెవెల్ క్రాసింగ్ దగ్గర సబ్ వే ఏర్పాటు చేయాలని, స్మశాన వాటిక ట్రాక్ అవతల ఉండడంతో ఎవరైనా చనిపోతే ఇబ్బందికరంగా ఉంటుందని రైల్వే అధికారులకు విన్నవించినట్లు గ్రామస్తులు తెలిపారు.

### రైల్వే స్టేషన్ అభివృద్ధికి అధికారులకు విన్నవించాం

గ్రామానికి చెందిన బద్రి నారాయణరావుకు అప్పటి రైల్వే శాఖ మంత్రి సన్నిహితుడు కావడంతో ప్రజల సౌకర్యార్థం రైల్వే స్టేషన్ ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు కనీసం తాగునీటి సౌకర్యం లేదు. దివ్యాంగుల ప్రత్యేక అవసరాలకు గది నిర్మించిన సరైన సౌకర్యాలు లేక నిరుపయోగంగా మారి ముళ్ళపొదలు, కంపచెట్లతో ఇబ్బందికరంగా ఉంది.

**జయసింహ, పెద్దదిన్నె**

### ఆధునీకరణకు నిధులు మంజూరు

రైల్వే అధికారులు పట్టణ ప్రాంతాలలో కోట్ల రుపాయలు ఆధునీకరణ పేరుతో ఖర్చు చేస్తుండగా చిన్న రైల్వే స్టేషన్ అభివృద్ధి మరిచారు. కనీస సౌకర్యాలకు ఏటా నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తే ప్రయాణికుల సంఖ్య పెరుగుతుంది. రైల్వే స్టేషన్ గ్రామం మధ్యలో ఉండటంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.

**ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ**

## రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలి



**కొల్చారం, మే 4 (జనం సాక్షి) :** గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేద రైతులకు పంటల సాగులో వచ్చుచున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించి పెట్టుబడి ఖర్చులు తగ్గించుకునేలా వ్యవసాయ అధికారులు కృషి చేయాలని సర్పంచ్ల ఫోరం మండల శాఖ అధ్యక్షులు రవితేజ రెడ్డి అన్నారు. ప్రజా పాలన 99 రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం నుండి ప్రారంభమైన రైతు ఉత్సవాల లో పైతర రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించడం వల్ల పెట్టుబడు ఖర్చులు తగ్గడంతో పాటు దిగుబడులు పెరుగుతాయి అన్నారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగు పై దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పామాయిల్ సాగు చేయడంతో పాటు పామ్ ఆయిల్ లో అంతర పంటల సాగు వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను విస్తృత స్థాయిలో అవగాహన కల్పించి పామాయిల్ సాగు పెంపొందించాలన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు భూసార పరీక్ష రిపోర్టులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తుక్కాపూర్ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు, మాజీ సర్పంచులు భాను ప్రకాష్ రెడ్డి, ఎల్లయ్య, తుక్కాపూర్ ఉపసర్పంచ్ ఆరె రవీందర్, జి పి ఓ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## మత్తడి నిర్మాణంతో భూగర్భ జలాల అభివృద్ధి



**తూప్రాన్, మే 4 (జనం సాక్షి) :** మత్తడి పునర్నిర్మానంతో భూగర్భ జిల్లాల అభివృద్ధి జరుగుతుందని పోతారం గ్రామ సర్పంచ్ పుట్టం వినోద మహేందర్ తెలిపారు. 12:50 లక్షలతో మత్తడి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా మాట్లాడారు. గ్రామ చెరువు మత్తడి పనులను మన గ్రామ సర్పంచ్ పుట్ట వినోదా మహేందర్ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. చెరువు మత్తడి మరమ్మత్తు ద్వారా మన గ్రామ రైతాంగానికి భూగర్భ జలాల అభివృద్ధికి ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు.

## ధాన్యం, మక్కల కొనుగోళ్లను వేగవంతం చేయాలి

**చేర్యాల, మే 4 (జనంసాక్షి) :** చేర్యాల వ్యవసాయ మార్కెట్ లో వరి ధాన్యం మొక్కల కొనుగోళ్లను వేగవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కోంగరి వెంకట మావో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ వద్ద రోడ్డుపై రైతులతో కలిసి అరగంట పాటు రాస్తారోకో నిర్వహించగా రాకపోకలు నిలిచిపోయాయి. సంఘటన స్థలానికి స్థానిక ఎస్సై గూడ అపూర్వ రెడ్డితో పాటు తహసిల్దార్ దిలీప్ నాయక్, మార్కెట్ కార్యదర్శి రవికుమార్ వచ్చి రైతుల సమస్యలను త్వరగా పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు వెంకట్ మావో మాట్లాడుతూ.. మార్కెట్లకు వచ్చిన 15 రోజుల వరకు ధాన్యం, మొక్కజొన్నలను అమ్ముకునే పరిస్థితి లేదని గోనె సంచుల కొరత లారీలు రాక కొనుగోళ్ళు ఆగిపోతున్నాయని వెంటనే వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. తాలు పట్టె యంత్రాలు, కనీస



సౌకర్యాలు కల్పించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు బోడిగం నర్సిరెడ్డి, నాగపురి కనకయ్య, నంగి మైసయ్య, సూర్ల తిరుపతి, సత్తయ్య, యాడారం బ్రహ్మయ్య, మోకు ఇంద్రం, పండుగ యాదగిరి, శెట్టి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇండి కూటమికి బుద్ధి చెప్పిన ప్రజలు

- ఎమ్మెల్సీ డా. అంజిరెడ్డి



**రామచంద్రపురం, మే 4 (జనం సాక్షి) :** దేశంలోని ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు కేవలం రాష్ట్రాల గెలుపు మాత్రమే కాకుండా, ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు, సంక్షేమ పథకాలపై ప్రజలు ఇచ్చిన గొప్ప తీర్పు అని ఎమ్మెల్సీ అంజిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం రామచంద్రపురంలో బీజేపీ నాయకులతో కలిసి ఆయన సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో ప్రజలు ఇండి కూటమికి తగిన బుద్ధి చెప్పారని అన్నారు. పశ్చిమ బెంగాల్లో మమతా బెనర్జీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరించిందని విమర్శించారు. 33 ఏళ్లు కమ్యూనిస్టులు, 15 ఏళ్లు తృణమూల్ కాంగ్రెస్ పాలించిన బెంగాల్లో బీజేపీ గణనీయంగా ఎదిగిందన్నారు. అస్సాంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం పార్టీ బలాన్ని చాటిందని చెప్పారు. ఉత్తరాది-- దక్షిణాది మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నం చేసిన ఇండి కూటమికి ప్రజలు తగిన సమాధానం ఇచ్చారని వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల ఫలితాలు చూస్తే తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని అంజిరెడ్డి అభిప్రాయపడ్డారు. అభివృద్ధిని పక్కన పెట్టి విమర్శలకే పరిమితమైన విపక్షాలకు ప్రజలు ఈ ఫలితాల ద్వారా గట్టి సమాధానం ఇచ్చారని, జాతీయ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలను ముందుకు పెట్టే పార్టీలను ప్రజలు ఎప్పటికీ ఆదరించరని తెలిపారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 4 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదు లను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి సమావేశ మంది రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజర య్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలను అదనపు కలెక్టర్ కు సమర్పించగా, ప్రజల ఫిర్యాదులను సమస్యలను సావధానంగా విన్న అదనపు కలెక్టర్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా సోమవారం నాటి ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 19 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు సాగు భూములలో మట్టి పరీక్షలు నిర్వహించుకోవాలి



**పెద్దశంకరంపేట, మే 4 (జనం సాక్షి) :** మండలంలో రైతు వారోత్సవాలు నేటి నుండి ఈ నెల 9వ తేది వరకు కొనసాగుతాయియని తాసిల్దార్ ప్రభుదాస్ అన్నారు. సోమవారం రైతు వారోత్సవాల్లో భాగంగా మండలంలోని మూడు క్లస్టర్లు శంకరంపేట్ శివాయిపల్లి రామోజీ పల్లిలలో రైతులకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు తప్పకుండా తమ భూములలో మట్టి నమూనాలు సేకరించి మట్టి పరీక్ష చేయించుకోవాలి రైతులకు సమతుల్య ఎరువుల యజమాన్యంపై క్లుప్తంగా వివరించడం జరిగింది అదేవిధంగా రైతులు ప్రతిఏటా ఒకే పంట కాకుండా పంట మార్పిడి విధానం పాటించడంతో భూమిలో లగు శాతం పొందడమే కాక అధిక దిగుబడులు పొందవచ్చు అని వివరించారు. మిశ్రమ పంటల ద్వారా ఒకేసారి రెండు పంటల ఆదాయం పొందవచ్చు వరి పంటలో సన్న రకాలైన మేలైన వరి వంగడాలని ఎంచుకొని సులభంగా కొనుగోలు చేసుకోవచ్చని వివరించారు రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లీ పురుగుమందుల అవశేషాలు లేకుండా పంట ఉత్పత్తులు చేసుకొని అధిక దిగుబడి పొందవచ్చని వివరించడం జరిగింది విత్తన శుద్ధి ద్వారా ఆది నుంచి పురుగులు మరియు రోగాల బారి నుంచి పంటను కాపాడుకోవచ్చని డెమోద్వారా రైతులకు అవగాహన కల్పించారు. మట్టి నమూనాలు తీయు పద్ధతిని డెమో ద్వారా క్లుప్తంగా రైతులకు వివరించడం జరిగింది రైతు నమోదు పై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దారు ప్రభుదాస్ మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ విస్తీర్ణ అధికారులు వినీత్ కుమార్ శివాయపల్లి రామోజీ క్లస్టర్ ఏఈవోలు అఖిల్ మరియు సుభాష్ వివిధ గ్రామాల సర్పంచులు రైతులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**కౌడిపల్లి, మే 4 (జనంసాక్షి) :** ఎక్కువ ఆదాయం వచ్చే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని మెదక్ కలెక్టర్ ప్రతిమ సింగ్ సూచించారు. భూసార పరీక్షల విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రైతు వారోత్సవ కార్యక్రమాలు సోమవారం మెదక్ కలెక్టర్ ప్రతిమ సింగ్ కౌడిపల్లి రైతు వేదికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ పంటలైన కూరగాయలు, పూల మొక్కలు సాగు చేసుకోవాలని సూచించారు. కౌడిపల్లి, చేగుంట, తూప్రాన్లో కొందరు రైతులు ఆ దిశగా సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. మెదక్ జిల్లా హైదరాబాద్కు దగ్గరలో ఉంది కనుక మార్కెట్ చేసుకోవడానికి సులువుగా ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న రైతు వారోత్సవాలు--2026 కార్యక్రమాన్ని జిల్లాలో మే 04 నుండి మే 09



వరకు అన్ని మండలాలు, గ్రామపంచాయతీలు, రైతు వేదికలు, క్లస్టర్ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా, ప్రజాభిమానాన్ని పొందేలా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఉత్పత్తి వ్యయాల పెరుగుదల, మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు శాస్త్రీయ పద్ధతులు అవలంబించడం అత్యవసరమని తెలిపారు. అందుకోసం రైతు వారోత్సవాల ద్వారా ప్రతి రైతుకు నేరుగా చేరుకుని, క్షేత్రస్థాయిలో సమగ్ర అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో ఒక్క రైతు కూడా మిగలకుండా కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, రైతు వేదికలను కేంద్రబిందువుగా చేసుకుని రైతులతో ముఖాముఖి సమావేశాలు, క్షేత్ర ప్రదర్శనలు, సాంకేతిక సదస్సులు, ప్రత్యక్ష శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్, జిల్లా సర్పంచ్ల ఫోరం ఉపాధ్యక్షులు చంద్రం కృష్ణ గౌడ్, తాసిల్దార్ కృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్సై అమర్, స్థానిక వ్యవసాయ అధికారులు సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు నేల సంరక్షణ, ఎరువుల వాడకంపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో, మే 4 (జనంసాక్షి) :** రైతులు నేల ఆరోగ్యంపై, సమతుల ఎరువుల వాడకంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి చేశారు. సోమవారం వనపర్తి మండల పరిధిలోని చిమనగుంటపల్లి క్లస్టర్ అంకురు గ్రామం పరిధిలోని రైతు వేదికలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు నేల సంరక్షణ, ఎరువుల వాడకం తదితరాంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని రైతులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు నేల ఆరోగ్యంపై, సమతుల ఎరువుల వాడకంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తరచుగా మట్టి పరీక్షలు చేయించుకుని నేల ఆరోగ్యాన్ని ఆధారంగా ఎరువుల వాడకం కొనసాగించడం ఎంతో కీలకమని తెలిపారు. తమ భూమి యొక్క మట్టి నమూనాల పరీక్షలు చేయించుకుని రైతులు మట్టి ఆరోగ్య కార్డును పొందాలని తెలియజేశారు. నేను ఆరోగ్యం పై



అవగాహన లేకుండా అధికంగా యూరియా వాడకం వల్ల భూమి ఆరోగ్యానికి చాలా అనర్థాలు, ముప్పు పరిణమిస్తాయని తెలిపారు. కాబట్టి భూమిపై పంటల కోసం ఎరువుల వాడకం కోసం హెల్త్ కార్డు అనేది చాలా ముఖ్యమని తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో ఐదు మంది రైతులకు మట్టి నమూనాల పరీక్షల అనంతరం భూమి ఆరోగ్య కార్డులను పంపిణీ చేయడం జరుగుతుందని, మిగతా రైతులు కూడా త్వరలోనే భూమి ఆరోగ్య కార్డులను పొందాలని తెలియజేశారు. ఈ భూమి ఆరోగ్య కార్డులను వినియోగించుకుని రైతులు నేలను కాపాడుకునే ప్రయత్నాలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కె వి కె మదనాపురం సీనియర్ శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు నేల సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని, ఎరువులను తగినంత మోతాదులోనే వాడాలని సూచించారు. భూమికి ఏం అవసరమో దానినే మనం అందించాలని, మోతాదుకు మించి ఏది ఎక్కువగా భూమికి అందించిన అది ప్రమాదకరమైన అని తెలిపారు. యూరియా వాడకాన్ని తగ్గించాలని, జిలుగా జనుమును, పచ్చి రొట్టెను వాడాలని సూచించారు. రెండు నెలలకోసారి నేల యొక్క మట్టి నమూనాలను పరీక్షించుకొని భూమి ఆరోగ్య కార్డులను పొంది దానికి తగిన విధంగా పంటల కోసం ఎరువుల వాడకండి కొనసాగించాలన్నారు. అదేవిధంగా సమతుల్య ఎరువుల వినియోగం పైన రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. నేలను, మట్టిని, సంరక్షించుకొని భావితరాలకు మంచి వాతావరణాన్ని అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు రైతులకు భూమి ఆరోగ్య కార్డులను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, మార్కెటింగ్ శాఖ డిడి ప్రసాదరావు, మార్కెటింగ్ డిఎం స్వరణ్ సింగ్, తహసిల్దార్ రమేష్ రెడ్డి, సర్పంచులు, రైతులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి



**సంగారెడ్డి టౌన్, మే 4 (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రైతు సంగం జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వం ను కోరారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ మాధురి కి వినతి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి, జొన్నలు కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభం చేయాలని ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. శివంపేట ాజూ వరి కొనుగోలు కేంద్రంను రేపు ప్రారంభం చేస్తామని డి సి ఓ కిరణ్ కుమార్ గారు హామీ ఇచ్చారు. నిర్లక్ష్యం గా ఉన్న అధికారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం రైతు సంగం జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్, రైతు సంగం నాయకులు మల్లరెడ్డి, జైపాల్ రెడ్డి, విఠల్,మురళి రైతులు పాల్గొన్నారు

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
05 మే 2026



# రోడ్డెక్కిన రైతన్నలు..

- నేషనల్ హైవేపై ధర్నా,రాస్తారోకో చేస్తూ రోడ్డుపై బైఠాయించిన రైతులు
- ట్రాఫిక్ జమ,గంట పాటు ఉద్రిక్తత,నిలిచిన వాహనాలు
- మక్కలు కంటాలు పెట్టడం లేదని,లారీలు రావడం లేదని రైతుల ఆవేదన

**గూడూరు,మే04(జనంసాక్షి):** ఎండనక వాననక అరుగాలం కష్టపడి పండించిన మక్కజొన్న పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే 30రోజులుగా కేంద్రాల చుట్టూ తిరుగుతున్న అక్కడ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని రైతులు ఆరోపిస్తున్నారు. సోమవారం గూడూరు మండలంలోని రైతులందరు మక్కలు వెంటనే కంటాలు పెట్టాలని నేషనల్ హైవే రోడ్డిపై బైఠాయించి ధర్నా,రాస్తారోకో నిర్వహించారు.గన్ని సంచులు లేక,సరైన హమాలీలు లేక,నెల రోజుల నుండి మక్కల కొనుగోలు కేంద్రం చుట్టూ తిరుగుతున్న రైతన్నల బాధలు ఏ అధికారులు,ఎమ్మెల్యే,ఎంపీ గాని పట్టించుకోవడం లేదని,రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పైరవిదారులకే గన్ని సంచులట,కంటాలయ్యాక లారీలల్లో లోడులు తీసుకెళ్లాటం వారికేనంటూ రైతులు మోరపెట్టుకుంటున్నారు.రైతులు ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న స్థానిక సీఐ వినయ్ కుమార్ తన సిబ్బందితో హుటాహుటిన అక్కడకు చేరుకొని రైతులతో మాట్లాడినారు.అనంతరం జిల్లా మార్క్ పెడ్ అధికారితో సీఐ ఫోన్లో మాట్లాడి రైతుల బాధలను వారికీ వివరిస్తూ రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, లారీలను వెంటనే పంపించాలని డిఎం ను కోరగా వెంటనే స్పందించిన అధికారి రైతుల సమస్యలు పరిష్కరించి,లారీలను వెంటనే హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు. ఈకార్యక్రమంలో మండలంలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వేతనం కొరకు నడి ఎండలో న్యాయపోరాటం

- ఎనిమిది నెలలు జీతాలు రాక రోడ్డెక్కిన కార్మిక వర్గం
- పారిశుధ్య కార్మికుల తీరని వేదన
- జీతం చెల్లించాలంటూ ఆందోళన



**కాటారం మే 4 (జనంసాక్షి) :** కాటారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల ఆవేదన ఆగ్రహంగా మారింది. గత ఎనిమిది నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో సోమవారం అంబేద్కర్ సెంటర్ వద్ద పెద్దఎత్తున ధర్నాకు దిగారు. చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. కార్మికులు మాట్లాడుతూ, నెలల తరబడి జీతాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. "రోజూ గ్రామాన్ని శుభ్రంగా ఉంచేది మేమే? కానీ మా కష్టానికి తగిన ప్రతిఫలం అందడం లేదు" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి జీవనం సాగిస్తున్నామని, పిల్లల చదువులు, ఇంటి ఖర్చులు భరించడం కష్టంగా మారిందని తెలిపారు.ధర్నా ప్రదేశంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, సంబంధిత అధికారులు ఇప్పటివరకు స్పందించకపోవడంపై కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే బకాయి జీతాలు విడుదల చేయాలని, లేదంటే ఆందోళనను మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి విస్తరించడంతో పాటు పనులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. స్థానిక ప్రజలు కూడా కార్మికుల సమస్యలకు మద్దతు తెలుపుతూ, వారి డిమాండ్లు న్యాయమైనవేనని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం, సంబంధిత శాఖలు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.పారిశుధ్యాన్ని కాపాడే చేతులకు న్యాయం ఎప్పుడుఅనే ప్రశ్న ప్రస్తుతం కాటారం ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.

### ఘోర రోడ్డు ప్రమాదం..

# నక్కలపల్లి వద్ద టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం

- ఇద్దరు యువకులు మృతి
- కేసు నమోదు చేసిన మామునూర్ పోలీసులు..





**వరంగల్ ప్రతినిధి, మే 4, (జనంసాక్షి):** వరంగల్ నగరంలోని మామునూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని నక్కలపల్లి గ్రామ శివారులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటనపై మాము నూర్ పోలీసులు వేగంగా స్పందించి సంఘటన స్థలానికి విచ్చేసి సంఘటన వివరాలను సేకరించారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కనిగిరి వెంకటరత్నం కుమారుడైన కనిగిరి విష్ణువర్ధన్ (22) మరియు శేషయ్య అనే ఇద్దరు యువకులు జగిత్యాల జిల్లా, పెగడపల్లి యందు ఉంటూ కూలీ పని చేసుకుంటున్నారు. వీరు నిన్న రాత్రి బైక్ (నెం. టి ఎస్ 02 ఇ హెచ్ 2020) పై నెక్కొండ వైపు వెళ్తుండగా, నెక్కొండ వైపు నుండి వరంగల్ వైపు అతివేగంగా వస్తున్న టిప్పర్ ( టీఎస్ 26 టిఎ 3642) డ్రైవర్ తన




వాహనాన్ని అజాగ్రత్తగా నడుపుతూ ఎదురుగా వస్తున్న బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. మామునూరు పోలీసులు తక్షణమే స్పందించి సంఘటన జరిగిన వెంటనే సమాచారం అందుకున్న మామ్నూర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. తీవ్రంగా గాయపడిన విష్ణువర్ధన్ అక్కడికక్కడే మృతి చెందగా, ప్రాణాపాయ స్థితిలో ఉన్న శేషయ్యను పోలీసులు తక్షణమే చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అయితే, అక్కడ చికిత్స పొందుతూ శేషయ్య కూడా మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించడంతో వాహన డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ద్విచక్ర వాహనం విడిభాగాలు విడిపోయే చల్లాచెదురు అయిపోయాయి. ద్విచక్ర వాహనం విడిభాగాలు విడిపోవడంతో ప్రమాద తీవ్రత తెలియజేస్తుంది.

**కేసు నమోదుచేసి పోలీసుల దర్యాప్తు..**

ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుని తండ్రి కనిగిరి వెంకటరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మామ్నూర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

- 311 గ్రాముల బంగారం, కిలో వెండి స్వాధీనం
- మంచిర్యాల డిసిపి భాస్కర్



**మంచిర్యాల ప్రతినిధి, మే 4 ,జనంసాక్షి** మంచిర్యాల జిల్లా కేంద్రంలో గత నెల భారీ చోరీ జరిగింది. పట్టణంలోని గౌతమేశ్వర కాలనీలో నివసిస్తున్న రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి ఇంట్లో ఇద్దరు నిందితులు చోరీకి పాల్పడ్డ నిందితులను పట్టుకున్నమని మంచిర్యాల డిసిపి భాస్కర్ పేర్కొన్నారు .సోమవారం నాడు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిసిపి భాస్కర్ మాట్లాడుతూ నిందితుల వివరాలను వెల్లడించారు.పెద్దపల్లి జిల్లాకు చెందిన మహారాష్ట్ర లోని చంద్రపూర్ లో నివాసముంటున్న ఆసీస్ శ్రీనివాస్, రెడ్డిమల్ల ఆకాశ్ అనే ఇద్దరు నిందితులు ఈ దొంగతనానికి పాల్పడ్డారని తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని గౌతమేశ్వర కాలనీలో నివాసం ఉంటున్న ముధం నాగయ్య అనే సింగరేణి ఉద్యోగింట్లో గత నెల భారీ చోరీ చేశారని పేర్కొన్నారు. ఆ చోరీలో 317 గ్రాముల బంగారు ఆభరణాలు కిలో వెండి 1,50,000 నగదు అపహరించి పారిపోయారని తెలిపారు . పోలీస్ సిబ్బంది చాకచక్యంగా నిందితులను పట్టుకున్నారని తెలిపారు .చోరీ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న సిబ్బందిని ఆయన అభినందించారు .నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.



### నష్టపరిహారం అందే విధంగా

# ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం

### సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి

**బోథ్, మే 04 (జనంసాక్షి)** అదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కనుగుట్ట గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం జొన్న మొక్కజొన్న పంటలు పూర్తిగా అగ్నికి ప్రమాదం చోటుచేసుకుని బుగ్గిపాలు అయింది..ఈ విషయాన్ని తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి సోమవారం డిసిసి అధ్యక్షుడు నరేష్ జాదవ్, నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్ తో కలిసి బాధిత రైతులను కలిసి తమ పొలాలను పరిశీలించారు. మహిళా రైతులను ఓదారుస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం మాట్లాడుతూ బాధిత రైతులను జరిగిన నష్టాన్ని తెలుసుకున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టి కి తీసుకెళ్లి తక్షణమే పంట నష్టపరిహారం చెల్లించే విధంగా కృషి చేస్తా అని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 3కోట్ల రోడ్డు పని 30నెలలైనా పూర్తి చేయని దుద్దిళ్ల శ్రీధర్ బాబు

- కనీస అవసరాలు తీర్చాలనే ఆలోచన చేయని మంథని ఎమ్మెల్యే
- ఓట్లస్తే నోట్ల సంచులతో వచ్చి గెలువచ్చనే అహంకారం వారిది
- మెజార్టీ ఇచ్చే కాటారం ప్రజలు రోడ్డును చూసైనా ఆలోచించాలే
- మనం ఓట్లేస్తే తమ్ముడికి నాలుగు కంపెనీలు పెట్టించిన దుద్దిళ్ల శ్రీధర్
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**కాటారం మే 5( జనంసాక్షి):** ఆనాడు ఎమ్మెల్యేగా మంథని కాటారం రోడ్డుకు డీఎంఎఫ్టీ ద్వారా రూ.300కోట్ల నిధులు తీసుకువచ్చి 90శాతంరోడ్డు నిర్మాణం చేస్తే ఈనాడు కేవలం మూడు కోట్లతో మొదలుపెట్టిన రోడ్డు పనులు 30నెలలైనా పూర్తి చేయని దుద్దిళ్ల శ్రీధర్ బాబు అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. మంథని నియోజకవర్గంలోని కాటారం మండలం దేవరాంపల్లి సమీపంలో నిర్మాణంలో ఉన్న మంథని కాటారం రహదారిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చి 30నెలలు గడుస్తున్నా నియోజకవర్గ పరిస్థితి మారలేదనడానికి నిలువెత్తు సాక్ష్యం మంథని కాటారం రోడ్డు అని ఆయన అన్నారు. కాటారం మండల ప్రజలు ఎంత గొప్పగా ఆలోచిస్తున్నరో వాళ్ల ఓటును ఎలా వినియోగించుకుంటున్నరో ఈ రోడ్డును చూసి అయినా అర్థం చేసుకుంటరని బావిస్తున్నానని ఆయన అన్నారు. మన ఓట్లతో 40ఏండ్లుగా ఏలుతున్న మూడు ఓట్లు ఉన్న కుటుంబం 30నెలలు గడిచినా ఈ రోడ్డు పనులు పూర్తి చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు, నిత్యం ఇదే రహదారిలో దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆయన తమ్ముడు వచ్చి పోతుంటారని, కానీ రోడ్డు గురించి పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలకు అవగాహన లేదు పట్టించుకోరని అన్నదమ్ముళ్లకు తెలుసునని, ఓట్లు వస్తే ఇస్త్రీ లేని బట్టలు వేసుకుని నోట్ల సంచులతో వచ్చి గెలుస్తమనే నమ్మకం వాళ్లలో ఉందన్నారు. ఓటు అనే ఆయుధాన్ని సక్రమంగా వినియోగించుకోకపోవడం వల్ల మూడు ఓట్ల ఉన్న కుటుంబం 40ఏండ్లుగా అధికారంలో ఉంటుందని, ఈ ప్రాంత ప్రజల కనీస అవసరాలు తీర్చాలనే ఆలోచన లేదన్నారు, ఓట్లు వస్తే నోట్ల సంచులతో వస్తమనే అహంకారం వారిలో ఉందని, ఎన్నికలు వచ్చినప్పుడుల్లా మెజార్టీ ఇచ్చే కాటారం ప్రజలు రోడ్డును కూడా నోచుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మూడు ఓట్లు ఉన్న కుటుంబం గెలువడానికి మెజార్టీ ఇచ్చే కాటారం మండలంలో ఒక్క కార్యక్రమమైనా గొప్పగా జరుగలేదని, నలుగురికి ఇండ్లు కట్టించలేదని, నాలుగు మంచి పనులు చేయలేదని ఆయన వివరించారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు ఐదు ఏండ్లు కలవకపోయినా మందలియ్యకపోయినా పట్టించుకోరనే ధీమా వారిలో ఉంటుందని అన్నారు. మూడేళ్లలో నియోజకవర్గానికి మూడు వేల ఇండ్లు ఇచ్చిండ్లని, అవి కూడా పూర్తి కాలేదన్నారు. ప్రజాస్వామ్యం తెలిసిన వాళ్లు కళ్లు తెరువాలని ఆయన హితవు పలికారు. ఆనాడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనకు ఓటు అనే ఆయుధం ఇచ్చాడని, అయితే ఓటు గొప్పతనం తెలియన ఓటు వేసి మరీ బానిసలుగా మారతున్నామని ఆయన వాపోయారు. పవిత్రమైన ఆయుధాన్ని సక్రమంగా వినియోగించుకోవడం లేదని సమాజానికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. నేను నా తమ్ముడు హయిగా హైదరాబాద్‌లో ఉంటం ఇక్కడ మాకు ఏం పని లేదు, ఓట్లు వస్తనే నోట్ల సంచులతో వస్తమనే అహంకారం దుద్దిళ్ల కుటుంబానిదని, కాటారం ప్రజలు ఇప్పటికైనా ఆలోచన చేసి అర్థం చేసుకోవాలన్నారు.రాష్ట్రంలో షోకాల్డ్ నాయకులు సైతం ఈ రోడ్డు చూసైనా పనితీరును అర్థం చేసుకోవాలని, ఐదు సార్లు గెలిచిన అసమర్థుడు అని ఆయన ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఎప్పటికప్పుడు అప్రమత్తం కావాలని దుద్దిళ్ల శ్రీధర్ బాబు నీతిని సమాజానికి చాటి చెప్పాల్సిన బాధ్యత ఉందని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

### కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ బ్యూరో, మే04(,జనంసాక్షి)** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సారంగాపూర్ మండలం ఆలూరు గ్రామంలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. వరి ధాన్యం కొనుగోలు తీరును ఆయన పరిశీలించారు. కొనుగోలుకు సంబంధించి అన్ని రకాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతూ, ధాన్యం అమ్మేందుకు వచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, రైతులకు త్రాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. తగినన్ని గన్ని సంచులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. నిర్ణీత తేమశాతానికి రాగానే ధాన్యం తూకం వేసి, వెంటనే వరి ధాన్యాన్ని తరలించాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆటోమేటిక్ ప్యాడి క్లీనింగ్ యంత్రం పనితీరును పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ, ప్రతి రైతు తమ ధాన్యాన్ని శుభ్రపరచి మాత్రమే తూకానికి ఇవ్వాలన్నారు. ఇలా చేస్తే రైతులు నష్టపోకుండా ఉంటారని వివరించారు. వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిఎం సివిల్ సప్లయిస్ సుధాకర్, తహసిల్దార్ విజయ కాంతారావు, ఎంపీడీవో లక్ష్మి కాంతరావు, సర్పంచ్ ఈర్ల చిన్నయ్య, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పల్లెల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బెల్ట్ షాపులు

- నిరుపేద కుటుంబాల జీవితాలు అతలాకుతలం
- చోద్యం చూస్తున్న అబ్కారీ శాఖ



**సారంగాపూర్, మే 4(జనంసాక్షి)** మండలంలో 32 గ్రామపంచాయతీ పరిధి గ్రామాల్లో బెల్ట్ షాపులు పుటగొడుగుల వెలుస్తున్నాయి. నియంత్రించడంలో అబ్కారీ శాఖ పూర్తిగా విఫలమైంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామంలో కిరాణా షాపుల పేరుతో 24 గంటలు మద్యం విక్రయాలుకొనసాగిస్తున్నారు. వైన్ షాప్ లో యజమానులకు ప్రోత్సాహం అధికారులకు అందుతున్న నెల మాములతోనే బెల్ట్ షాపుల దందా అడ్డు అదుపు లేకుండా కొనసాగుతున్నాయని ఆరోపణలు వెలువెత్తు తున్నాయి. కల్తీ మద్యం అధిక ధరల దోపిడీతో పాటు, యువత మృత్యువాత పడడం వంటి సమస్యలకు దారితీస్తున్నది. ఈ బెల్ట్ షాపులపై ప్రభుత్వం తక్షణమే ఉక్కుపాదం మోపాలని స్థానిక మండల ప్రజలు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని చించోలి బి, జామ్, సారంగాపూర్, దని, గోపాల్పేట్, ఆలూరు, బోరిగాం, బీరవెల్లి, కౌట్ల బి, స్వర్ణ, కంకేట, తాండ్ర, తదితర గ్రామాల్లో ఒక్కో గ్రామంలో 3 నుండి 4 బెల్ట్ షాప్ లు పిచ్చలవిడిగా వేలుస్తున్నాయి. 24 గంటలు మద్యం విక్రయాలు సాగిస్తున్నారు ఎంఆర్పిఎఫ్ తెరలకంటే 20-30 రూపాయలు పెంచి వసూలు చేస్తూ నిర్వాహకులు లాభాలు పొందుతున్నారు. అబ్కారీ శాఖ అధికారులు కేవలం నామమాత్రంగా దాడులు నిర్వహిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. బెల్ట్ షాపుల నుంచి నెలవారీగా మామూలు అందుతున్న కారణంగా అధికారులు పట్టించు కుంటలేరని ఆరోపణలు వస్తున్నా యి. అడ్డు అదుపు లేకుండా కల్తిమద్యం సరఫరా అవుతున్న ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉన్న అధికారులు పట్టించుకోకపోవడం పై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల్లో ఉదయం ఏడు గంటల నుండి అమ్మకాలు మొదలుపెట్టడం తో పేద కూలీలు సంపాదించిన డబ్బులు మద్యానికి ఖర్చు చేసి కుటుంబాలు రోడ్డున పడేస్తున్నారు. యువత మద్యమత్తులో అతివేగంగా వాహనాలు నడుపుతూ మృత్యువాత పడుతున్నా సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా అబ్కారీ శాఖ అధికారులు స్పందించి బెల్టు షాపులను నియంత్రించాలని మండల ప్రజల మహిళలు కోరుతున్నారు.

# ఇందిరమ్మ గృహం నిరుపేదకి వరం

**తాండూర్, మే 04(జనంసాక్షి)** బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ ఆదేశాల మేరకు తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం లో పాల్గొన్న...తాండూర్ మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, తాండూర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ సురేష్ ముడిమడుగుల, మండల్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ 6 వార్డ్ సభ్యులు విష్ణుకళ్యాణ్,ఈ కార్యక్రమన్ని ఉద్దేశించి తాండూర్ మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ ...పేదింటి ఆడబిడ్డ కి ఇందిరమ్మ ఇల్లు తో స్వంత ఇంటి కల నెరవేరింది.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం ప్రతి పేద కుటుంబం ఈ ప్రభుత్వం లో సుఖసంతోషాలతో ఉండేలా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పథకాలు అమలు చేస్తున్నారు అని అన్నారు, ఈ కార్యక్రమంలో నాయకులు ముస్కె సాగర్ ఆగిడి సంతోష్ నియాజ్ రప్ఫా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
05 మే 2026

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి, మే 4 (జనం సాక్షి) :** పాలనలో వేగం, పారదర్శకత, బాధ్యతను పెంపొందించడంతోపాటు, వివిధ పథకాల లబ్ధిని లబ్ధిదారులు పొందడంలో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రజల సమస్యల సత్వరమే పరిష్కరించే విషయమై రాష్ట్రప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. అలాంటి ప్రజావాణి ద్వారా స్వీకరించిన ఫిర్యాదులన్నింటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని, ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలిసి ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని డివిజన్ స్థాయి వరకు తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సోమవారం జిల్లాలోని నల్గొండ, దేవరకొండ, చండూరు, మిర్యాలగూడ డివిజన్లలో కూడా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను ప్రభుత్వం నిర్దేశించిన విధంగా వెంటనే పరిష్కరించాలని, ఒకవేళ ఆలస్యం అవుతే 30 రోజుల్లో తప్పనిసరిగా పరిష్కారం చూపాలని, పరిష్కరించిన ఫిర్యాదుల విషయాన్ని ఫిర్యాదుదారులకు తెలియజేయాలని, అన్ని ఫిర్యాదులను ఆన్లైన్ చేయాలని, ఆన్లైన్ ఫిర్యాదులు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని ఆదేశించారు. ఏదైనా పరిష్కారం కానీ,సాధ్యం కానీ ఫిర్యాదు ఉంటే ఫిర్యాదుదారుకు స్పష్టంగా తెలియజేయాల్సిన బాధ్యత సంబంధిత శాఖ అధికారి పై ఉందని అన్నారు .ఒకవేళ వారి పరిధిలో పరిష్కారం కానివి జిల్లా స్థాయికి పంపించాలని చెప్పారు. ప్రజలు వారి సమస్యల పరిష్కారానికి రెవెన్యూ డివిజన్ కార్యాలయాలలో కూడా ఫిర్యాదులను సమర్పించవచ్చని,వ్యయ ప్రయాసల కోర్చి జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రజావాణి ఫిర్యాదులపై తీసుకున్న చర్యల నివేదికను ఎప్పటికప్పుడు కలెక్టర్ కార్యాలయానికి పంపించాల్సిందిగా ఆయన ఆదేశాలు జారీ చేశారు.సోమవారం నాటి ఫిర్యాదులలో వ్యక్తిగత అంశాలతో పాటు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ,పింఛను తదితరు అంశాలపై ఫిర్యాదులను సమర్పించారు.కాగా ఈ సోమవారం జిల్లా ప్రజావాణి కి రెవెన్యూ శాఖకు సంబంధించి (52) ఇతర శాఖలకు సంబంధించి (58) ఫిర్యాదులు వచ్చాయి .అంతేకాక ఈ సోమవారం రెవెన్యూ డివిజనల్ అధికారుల కార్యాలయాలలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఈ క్రింది విధంగా ఫిర్యాదులు వచ్చాయి.నల్గొండ డివిజన్ కు సంబంధించి మొదటి రోజు (15) ఫిర్యాదులు రాగా, రెవిన్యూ డిపార్ట్మెంట్ కి సంబంధించి 13, పంచాయతీరాజ్ కి సంబంధించి- 2 ఫిర్యాదులు వచ్చినట్లు నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి తెలిపారు.మిర్యాలగూడ డివిజన్ కు సంబంధించి (22) ఫిర్యాదులు రాగా, రెవెన్యూ కు- 9, బీసీ సంక్షేమ శాఖ కు -1,గృహ నిర్మాణ -1,మున్సిపల్-1 సర్వే ల్యాండ్ రికార్డ్స్ -1,పోలీసు-1, ఎంపీడీవో -1 ఫిర్యాదులు వచ్చినట్లు మిర్యాలగూడ ఇన్చార్జి సబ్ కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.చండూరు రెవెన్యూ డివిజన్ కు సంబంధించి (4) ఫిర్యాదులు రాగా, వ్యవసాయ శాఖకు-1, గృహ నిర్మాణ శాఖకు-1, రెవెన్యూ శాఖకు-2 ఫిర్యాదులు వచ్చాయని చండూరు ఆర్డీవో శ్రీదేవి తెలిపారు.అత్యధికంగా దేవరకొండ డివిజన్ లో (25) ఫిర్యాదులు స్వీకరించినట్లు దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి తెలిపారు. ఇందులో రెవెన్యూ కు సంబంధించి- 17, పంచాయతీరాజ్ కు -5 ,ఎలక్ట్రిసిటీ -1,హౌసింగ్ -1,ట్రైబల్ వెల్ఫేర్ కు సంబంధించి-1 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.జిల్లా స్థాయి ప్రజావాణి కి రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జెడ్పి సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, డి ఆర్ డి ఓ శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

## కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీకి ఎమ్మెల్యే పాయం మద్దతు



**బూర్గంపహాడ్, మే 4 (జనంసాక్షి) :** కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీకి మద్దతు తెలుపుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని.. ఐటీసీ యాజమాన్యంతో మాట్లాడి కార్మికులకు న్యాయం చేస్తానని పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గత 40 రోజులుగా కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు చేస్తున్న రిలేనిరాహారదీక్షల శిబిరాన్ని ఆయన సందర్శించి కార్మికులకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జేఏసీని ఉద్దేశించి మాట్లాడుతూ వేతన ఒప్పందం జాప్యం లేకుండా చేయాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, 100శాతం మెడికల్ ఇవ్వాలని, వేతనం రూ.22వేలకు తగ్గకుండా అగ్రిమెంట్ చేయాలని డిమాండ్ చేస్తున్నా ఐటీసీ యాజమాన్యం స్పందించకపోవడం సిగ్గుచేటని, స్వయంగా ఐటీసీ యాజమాన్యాన్ని కలిసి కార్మిక సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తానని జేఏసీకి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో-కన్వీనర్లు సానికొమ్ము రామచంద్రారెడ్డి, ఎండీ.యాకూబ్పాషా, ఆకిని సర్వేశ్వరరావు, బల్లెం నాగయ్య, మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఇంగువ రమేష్, సర్పంచ్లు, ఉపసర్పంచ్లు, వార్డుసభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

## త్రివేణి విద్యార్థులను సన్మానించిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు




**ఖమ్మం, మే 4 (జనంసాక్షి) :** శ్రీ రామానుజన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ లో పలు విభాగాలలో విజేతలుగా నిలిచిన త్రివేణి విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి అభినందించారు. పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ డి సోహిత మూడో తరగతిలో రాష్ట్రస్థాయి ర్యాంకును, నందన్ ఐదో తరగతిలో జిల్లా మొదటి ర్యాంకు ను, మోక్షిత ఆరవ తరగతిలో జిల్లా రెండో ర్యాంకును అలాగే పదవ తరగతిలో దేవి వెంకట సాయి జిల్లా మూడో స్థానాన్ని గెలుచుకున్నారు అలాగే మూడో తరగతిలో కనిష్క ఏడో తరగతిలో కృష్ణ తేజ ఎనిమిదో తరగతిలో లావణ్య శ్రీ,9వ తరగతిలో అఖిల్, జిల్లా స్థాయిలో కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్నారని తెలియజేశారు. ఈ విజేతలు అందరినీ హైదరాబాద్ మాదాపూర్ లో శిల్పకళా వేదిక ప్రాంగణంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు గారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజేతులైన విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని తమ పిల్లల విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## పోచంపల్లి మున్సిపల్‌లో కాంగ్రెస్ హవా



**భూదాన్ పోచంపల్లి, మే 4 (జనం సాక్షి) :** పోచంపల్లి మున్సిపల్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రభావం స్పష్టంగా కనిపించింది. మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికల ప్రత్యేక సమావేశం చైర్‌పర్సన్ తడక వెంకటేశ్వర్లు అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సభ్యులకు ప్రమాణ స్వీకారం చేయించారు. కో-ఆప్షన్ సభ్యుల నాలుగు స్థానాలకు నలుగురు మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో మద్ది మధుసూదన్ రెడ్డి, బోడ రమాదేవి సత్యనారాయణ, సయ్యద్ ఏజాస్, మహమ్మద్ రసూల్ బీ ఖదీర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వీరితో ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్, కమిషనర్ అంజన్ రెడ్డి, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ కళ్లెం రాఘవ రెడ్డి, జిల్లా నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, కౌన్సిలర్లు శ్రీరామ్, మంజుల, లింగస్వామి, కొండమడుగు ఎల్లస్వామి, రావుల జంగయ్య, పెద్దల చక్రపాణి, బాత్క లింగస్వామి, కర్నాటి వరలక్ష్మి నరసింహ, రాపోలు కావ్య వేణు, దేవరాయ కుమార్, జింకల లావణ్య యాదగిరి, కుడికాల అఖిల బలరాం, సూరేపల్లి రాధిక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్గికి ఆహుతైన మొక్క ధాన్యాన్ని నష్టం అంచనా వేయిస్తాం

- లోడింగ్ కావలసిన లారీలు అందుబాటులో ఉంచుతాం
- నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తాం
- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు

**చింతకాని, మే 4 (జనం సాక్షి) :** చింతకాని మండల పరిధిలో పాతర్లపాడు గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంతో నష్టపోయిన మొక్కజొన్న రైతులకు అండగా నిలుస్తామని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, మాజీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌తో కలిసి ఘటన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి మొక్కజొన్న గింజను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. అగ్ని ప్రమాదంలో కాలిపోయిన పంటతో పాటు మృతి చెందిన సుమారు 30 గొర్రెలకు నష్టం అంచనా వేయించి బాధితులకు పరిహారం అందజేస్తామని తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న గిడ్డంగుల్లో ధాన్యాన్ని నిల్వ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అవసరమైన లారీలను తక్షణమే అందుబాటులో ఉంచి ధాన్యాన్ని ఎగుమతి చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ మేరకు గిడ్డంగుల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, పంట నష్టం అంచనాకు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డిని ఘటన స్థలానికి రప్పించామని తెలిపారు. తాసిల్దార్ బాబ్జి ప్రసాద్‌కు కాలిన మొక్కజొన్న బస్తాలను గ్రామాల వారీగా అంచనా వేసి నివేదిక ఇవ్వాలని సూచించారు. కౌలు రైతులు ఎదుర్కొంటున్న ఆన్‌లైన్ సమస్యలను కూడా పరిశీలించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మండలంలోని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పండించిన మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. మండలంలో సుమారు 30 వేల ఎకరాల్లో పండిన మొక్కజొన్నలో దాదాపు 10 లక్షల క్వింటాళ్లను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో నిల్వ ఉన్న ధాన్యాన్ని తరలించేందుకు అవసరమైన లాజిస్టిక్స్‌ను సిద్ధం చేస్తున్నామని



పేర్కొన్నారు. రైతులు పంట అవశేషాలను కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, అజాగ్రత్త వల్ల ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, మాజీ ఉపాధ్యక్షుడు మడిపల్లి భాస్కర్, కిసాన్ సెల్ నేత కొప్పుల గోవిందరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి, యూత్ కాంగ్రెస్ నాయకులు కంచుమర్తి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, మే 4 (జనంసాక్షి) :** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని,నిర్లక్ష్యం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల వద్ద నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.రాష్ట్ర స్థాయి గ్రీవెన్స్ లకు కూడా అధిక ప్రాధాన్యత ఇస్తూ ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిష్కరించాలని తెలిపారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకి సంబందించి 53 దరఖాస్తులు, డిఆర్డిఏకు 7, డిపిఓకు 5, డిఎంహెచ్ఓకు 4, మిగిలిన 36 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 105 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శిరీష, డిపిఓ యాదగిరి, డిఎంహెచ్ఓ పి.వెంకటరమణ, సంక్షేమ అధికారులు శంకర్, నరసింహారావు, దయానందరాణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల సమస్యలకు ప్రాధాన్యం

- ప్రజావాణిలో తొలి వినతి
- ఆర్డీవో సానుకూల స్పందన




**భువనగిరి, మే 4 (జనం సాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి రెవెన్యూ అధికారుల కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ సమస్యలు ప్రధానాంశంగా నిలిచాయి. సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్ ప్రజావాణిలో మొట్టమొదటి దరఖాస్తును సమర్పిస్తూ, సీనియర్ సిటిజన్స్ యాక్ట్-2007ను పకడ్బందీగా అమలు చేయాలని ఆర్డీవోను కోరారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ, జిల్లాలో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, పిల్లలు, కుటుంబ సభ్యుల ఆదరణ లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్డీవో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయని వారిపై పోలీసులు కేసులు నమోదు చేయాలని, ప్రతి రెండు నెలలకు ఒకసారి యాక్ట్ అమలుపై సమీక్షా సమావేశాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి తక్షణమే స్పందిస్తూ, సీనియర్ సిటిజన్స్ యాక్ట్ అమలుపై తప్పనిసరిగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఆర్డీవో ఆదేశాలను అమలు చేయని వారిపై మండల తహసీల్దార్, స్టేషన్ హౌస్ ఆఫీసర్‌లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజావాణిలో తొలి దరఖాస్తు అందజేసిన వెంకటేష్‌ను ఆర్డీవో అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఏఓ రాధా, భువనగిరి తహసీల్దార్ జగన్, బీబీనగర్ తహసీల్దార్ శ్యాం సుందర్ రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుమన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండ ఆర్డిఓ కార్యాలయంలో ప్రజావాణి

మొదటి రోజు 9 మండలాలలో కలిపి 25 ఫిర్యాదులు




**దేవరకొండ, మే 4 (జనం సాక్షి) :** రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం, ప్రజా సమస్యలను పరిష్కరించడం సామాన్య ప్రజల సమస్యలకు గొప్ప పరిష్కార అవకాశమని దేవరకొండ ఆర్డిఓ ఎస్ రమణారెడ్డి తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 9 మండలాలు ఒక మున్సిపాలిటీ నుండి 25 ఫిర్యాదులను ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఆర్టీవో ఈ దరఖాస్తులకు స్వయంగా స్వీకరించినట్లు తెలిపారు. ఈ 25 దరఖాస్తులను సంబంధిత శాఖల ఉన్నత అధికారులతో చర్చించి సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, కేవలం రెవెన్యూ సంబంధిత సమస్యలే కాకుండా అన్ని రకాల సమస్యల పరిష్కారానికి ఫిర్యాదులను తమ దృష్టికి తీసుకురావచ్చు అని తెలిపారు.

# అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, మే 4 (జనంసాక్షి) :** రానున్న 4రోజుల్లో అకాల వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ సూచనలతో జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద క్షేత్రస్థాయిలో యంత్రాంగం అందుబాటులో ఉండాలని సూచించారు.గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల వ్యవసాయ అధికారులు,తహశీల్దార్లు, ఎంపీడీఓలు వచ్చే 4రోజుల పాటు కేంద్రాలలో ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు.ప్రత్యేక అధికారులు ప్రతి రోజు రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యల ను చేపట్టాలన్నారు.లోతట్టు ప్రాంతాలు ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలలోని ధాన్యాన్ని ముందస్తుగా తరలించాలని సూచించారు.తప్పనిసరి పరిస్థితుల ప్రభావంతో వర్షంతో ధాన్యం తడిస్తే తడిచిన ధాన్యాన్ని తక్షణమే బాయిల్డ్ మిల్లుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సూర్యాపేట డివిజన్ తో పాటు కొంత మునగాల, కోదాడ ప్రాంతాలలో అకాల వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు.అకాల వర్షాల కారణంగా రైతులను, కొనుగోలు కేంద్రాల సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని,ధాన్యం తూకం అయినా వెంటనే మిల్లులకు తరలించెందుకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.మిల్లులకు వెళ్లిన లారీలు అన్ లోడింగ్ పూర్తి చేసిన వెంటనే మిల్లులకు తరలించేందుకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచాలని అన్నారు.మిల్లుకు వెళ్లిన లారీ వెంటనే లోడింగ్ పూర్తి చేసుకొని తిరిగొచ్చే బాధ్యత అధికారులదని స్పష్టం చేశారు. రోజుకు 15వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రొక్యూర్ మెంట్ చేస్తేనే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ సజావుగా సాగుతుందని అందుకు మిల్లర్లు సహకరించాలని కోరారు. ట్యాబ్ ఎంట్రీలు రైతులకు సకాలంలో ధాన్యం డబ్బులు చెలించెందుకు స్పీడప్ చేయాలన్నారు.ట్యాబ్ ఎంట్రీ వేగంగా చేయడంతోనే ఒక్కరోజులోనే రైతుల ఖాతాలో రూ.44 కోట్ల నగదు జమ చేయడం జరిగిందన్నారు. వచ్చే బుధవారం వరకు



జిల్లాలో రూ.300కోట్ల పేమెంట్స్ సంబంధించిన ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేసి ధాన్యం డబ్బులు రైతుల ఖాతాలో జమ చేయాలని ఆదేశించారు.అదనంగా లారీలను కేటాయించి ధాన్యం తరలింపు వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శిరీష, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వర్ శర్మ, జిల్లా సహకార అధికారి ప్రవీణ్ కుమార్, జిల్లా మేనేజర్ సివిల్ సప్లై శ్రీధర్ రెడ్డి,అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ఫలితాల జోష్..

## లాభాల్లో ముగిసిన సూచీలు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సూచీలపై ప్రభావం చూపాయి. పశ్చిమ బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీ విజయం దిశగా దూసుకెళుతుండడం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. అయితే, ఓ దశలో వెయ్యి పాయింట్ల మేర లాభపడిన సెన్సెక్స్.. తర్వాత మోస్తరు లాభాలకే పరిమితం అయ్యింది. సెన్సెక్స్ 77,257.27 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,913.50) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 77,910.75 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 355.90 పాయింట్ల లాభంతో 77,269.40 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 121.75 పాయింట్ల లాభంతో 24,119.30 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.08 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠానికి చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, రిలయన్స్, ఎల్‌అండ్‌టీ, ఎటర్నల్ స్టాక్స్ రాణించాయి. భారతీ ఎయిర్‌టెల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, టీసీఎస్, ఐటీసీ, ఇన్ఫోసిస్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 113 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4545 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**స్థిరీకరణ దిశగా సూచీలు**

దేశీయ సూచీలు సోమవారం స్థిరీకరణకు గురికావొచ్చన్నది విశ్లేషకుల అంచనా. పెరుగుతున్న చమురు ధరలకు తోడు, ఇరాన్ నౌకాశ్రయాలను అమెరికా నౌకా దళం మరికొన్ని నెలలు దిగ్బంధించొచ్చన్న అంచనాలు ఇందుకు నేపథ్యం. నేడు వెలువడే 5 రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు కూడా ప్రభావం చూపుతాయి. అంతర్జాతీయంగా సానుకూల పరిణామాలు కనిపిస్తే, సూచీలు లాభాల్లో ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. కార్పొరేట్ సంస్థల మార్చి త్రైమాసిక ఫలితాలు, విదేశీ పెట్టుబడిదార్ల ధోరణి కూడా దిశానిర్దేశం చేయొచ్చు. హర్మూజ్ జలసంధిలో నౌకా రవాణాపై స్పష్టత వచ్చేవరకు మార్కెట్లలో అనిశ్చితి కొనసాగొచ్చని ఓ బ్రోకరేజీ అంటోంది. నిఫ్టీ-50 సూచీకి 24,400 పాయింట్ల వద్ద నిరోధం, 23,600-23,500 వద్ద మద్దతు కనిపిస్తోందంటున్నారు. ఒక వేళ 24,000 స్థాయికి కిందకొస్తే బేరిష్ ధోరణిగా పరిగణించాలని చెబుతున్నారు. ఎఫ్‌పీఐలు ఏప్రిల్‌లో రూ.60,847 కోట్ల విక్రయాలు జరిపారు. తయారీ పీఎంఐ (4న), సేవల పీఎంఐ (6న) గణాంకాలను పరిశీలించాలి. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే.. నిఫ్టీ వాహన సూచీ 25,300-26,800 శ్రేణి వెలుపలకు వస్తేనే ఎటువైపు వెళ్లొచ్చన్నది తెలుస్తుంది. మహీంద్రా




అండ్ మహీంద్రా, హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో ఫలితాలు ఈ వారమే వెలువడనున్నాయి. ఎఫ్‌ఎమ్‌సీజీ సూచీలో ఇప్పటిదాకా కనిపించిన సానుకూల ధోరణికి కాస్త విరామం ఏర్పడొచ్చు. 51,800 స్థాయికి పైకి వస్తే మరింత పెరగొచ్చు. కమొడిటీ ధరలు 8-10% పెరగ్గా, ఉత్పత్తుల ధరలను 2-5% మేరే పెంచినట్లు హెచ్‌యూఎల్ పేర్కొంది.

ఆస్తుల నాణ్యత, రుణ వృద్ధి తగ్గే అవకాశం ఉన్నందున బ్యాంక్ నిఫ్టీపై ఒత్తిడి కొనసాగొచ్చు. 54,000-57,500 స్థాయిలో స్థిరీకరణకు గురికావొచ్చు. 54,500 దిగువన సెంటిమెంటు ప్రతికూలంగా మారొచ్చు. టెలికాం షేర్లపై విశ్లేషకులు సానుకూలంగానే ఉన్నారు. వొడాఫోన్ ఐడియా స్థూల ఆదాయ బకాయిలను కేంద్రం తగ్గించిన ప్రభావం సోమవారం ట్రేడింగ్‌లో ఉండొచ్చు. కంపెనీ రూ.25,000 కోట్ల నిధుల సమీకరణకు, ఈ నిర్ణయం మద్దతు అందిస్తుందని భావిస్తున్నారు. యంత్రపరికరాల కంపెనీల షేర్లకు ఒత్తిడి ఎదురుకావొచ్చు. ముడి చమురు ధరల పెరుగుదల వల్ల, జూన్ త్రైమాసికంలో మార్జిన్లపై ప్రభావం పడొచ్చు. ఎంపిక చేసిన స్క్రిప్‌లలో కదలికలుంటాయి. మంగళవారం ఎల్ అండ్ టీ ఫలితాలున్నాయి. ఫిబ్రవరి నుంచీ నష్టపోతూ వస్తున్న ఐటీ షేర్లు కొంత రికవరీ కావచ్చు. ఇప్పటిదాకా ఫలితాలు ప్రకటించిన కంపెనీల యాజమాన్యాలు 'ఏఐ ఆధారిత ఆదాయం తగ్గొచ్చని' అభిప్రాయపడ్డాయి. ఈ వారం టాటా టెక్నాలజీస్, కోఫోర్జ్, కేపీఐటీ టెక్నాలజీస్, హెగ్జావేర్ టెక్నాలజీస్ ఫలితాలున్నాయి.




ఔషధ కంపెనీల షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. అమెరికా కంపెనీ ఆర్గానన్‌ను సన్‌ఫార్మా కొనుగోలు చేస్తున్న వార్తల మధ్య, ఈ తరహాలో ఇతర కంపెనీల ప్రణాళికలేమైనా ఉన్నాయేమోనని మదుపర్లు పరిశీలిస్తారు. ఫలితాల నేపథ్యంలో ఆయా షేర్లలో కదలికలు ఉండొచ్చు. లుపిన్ 7న ఫలితాలు ప్రకటించనుంది. అధిక ముడి చమురు ధరల మధ్య చమురు-గ్యాస్ షేర్లు స్థిరీకరణకు గురికావొచ్చు. అమెరికా-ఇరాన్ యుద్ధ పరిణామాలను గమనించాలి. ఓఎన్‌జీసీ, ఓఐఎల్, ఆర్‌ఐఎల్ షేర్లు ఈ వారం రాణించే అవకాశం ఉంది. ఇటీవలి నష్టాల అనంతరం సిమెంటు కంపెనీల షేర్లు కాస్త పెరిగే అవకాశం ఉంది. మార్చి త్రైమాసికంలో ప్రధాన కంపెనీలు అంచనాలను మించి ఫలితాలు ప్రకటించడం ఇందుకు నేపథ్యం. ఈ వారంలో అంబుజా సిమెంట్స్, శ్రీ సిమెంట్ ఫలితాలు కీలకం కానున్నాయి. ఎక్కువ కొనుగోళ్లు జరిగిన నేపథ్యంలో లోహ కంపెనీల షేర్లు స్థిరీకరణకు గురికావొచ్చు. రాబోయే రోజుల్లో ఉక్కుకు గిరాకీ తగ్గొచ్చు.

## ఐటీ వ్యయాలు పెంచుదాం..

## ప్రభుత్వ రంగ బ్యాంకుల సన్నాహాలు

**ఆంథ్రోపిక్ మిథోస్‌తో సైబర్ ముప్పు నేపథ్యం**

ప్రభుత్వ రంగ బ్యాంకులు తమ ఐటీ వ్యవస్థలను పటిష్ఠం చేయడానికి, ఖాతాదారుల డేటాను కాపాడేందుకు ఐటీ వ్యయాల పెంపునకు సిద్ధమవుతున్నాయి. ఆంథ్రోపిక్ సంస్థకు చెందిన క్లాడ్ మిథోస్ ఏఐ టూల్ వల్ల ఆర్థిక డేటా భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్న ఆందోళనలే ఇందుకు నేపథ్యం. ఐటీ వ్యవస్థల సైబర్ సెక్యూరిటీ బలహీనతలను గుర్తించి, బయటపెట్టడంలో మిథోస్ అధునాతన సామర్థ్యాలు బలంగా ఉన్నందున.. బ్యాంకింగ్ వ్యవస్థలకు ముప్పు ఏర్పడుతుందనే ఆందోళనలు పెరుగుతున్నాయి. సాఫ్ట్‌వేర్ లోపాలు బయటపడిన తర్వాత, వాటిని ఆయుధంగా మార్చుకునే సమయం గతంలో 19 రోజులుగా ఉండగా, ప్రస్తుతం అది 72 గంటల కంటే తక్కువకు పడిపోయింది. ఈ నేపథ్యంలోనే బ్యాంకులు అప్రమత్తమయ్యాయి. సైబర్ దాడులను నిరోధించేందుకు ఐటీ వ్యవస్థలను మరింత పటిష్ఠం చేయడానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఐటీపై ఖర్చు పెంచనున్నట్లు పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ ఎండీ, సీఈఓ స్వరూప్ కుమార్ సాహా తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం కంటే ఈ సారి ఐటీ వ్యయాలు ఎక్కువగా ఉంటాయని, అందులో ప్రధాన భాగం సైబర్ భద్రతకే కేటాయిస్తామని యూకో బ్యాంక్ ఎండీ, సీఈఓ అశ్వనీ కుమార్ స్పష్టం చేశారు.

ప్రభుత్వ చర్యలు ఇలా: మిథోస్ వల్ల కలిగే ముప్పు అంచనా వేయడానికి, నివారణ చర్యలను సూచించడానికి ఎస్‌బీఐ ఛైర్మన్ సి.శ్రీనివాసులు శెట్టి నేతృత్వంలో ఒక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఐటీ వ్యవస్థలను సురక్షితం చేసుకోవడానికి అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. ఏప్రిల్ 7న క్లాడ్ మిథోస్ పైలట్ సేవల ప్రారంభం.. హ్యాకింగ్ సామర్థ్యాలపై ఆందోళనను రేకెత్తించింది. ఈ మోడల్ సైబర్ భద్రత, హ్యాకింగ్‌ల్లో మనుషుల కంటే నైపుణ్యాన్ని చూపించిందని ఆంథ్రోపిక్ పేర్కొంది. ప్రతి ప్రధాన ఆపరేటింగ్ సిస్టమ్, వెబ్ బ్రౌజర్‌ల్లో భద్రతా లోపాలను గుర్తించిందని తెలిపింది.

## మారుతీకి దేశీయ విపణిలో 42% వాటా

**ఏప్రిల్‌లో 1,91,122 కార్ల విక్రయాలు**

కార్ల తయారీలో దేశీయ అగ్రగామి సంస్థ మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ), గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో మన విపణిలో 42% వాటా సాధించింది. 2024-25 కార్ల విపణిలో సంస్థ వాటా 39 శాతమే. నూతన ఆర్థిక సంవత్సరం (2026-27) ప్రారంభ నెల (ఏప్రిల్)లో రికార్డు స్థాయిలో దేశీయంగా 1,91,122 కార్లను సంస్థ టోకుగా విక్రయించి.. మార్కెట్ వాటాను మరో 3% పెంచుకుంది. ఎంఎస్ఐ మార్కెటింగ్, సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి పార్థో బెనర్జీ మాట్లాడుతూ, కంపెనీ మార్కెట్ వాటా పెరుగుదలకు కార్లు ప్రధాన కారణమైనప్పటికీ, స్పోర్ట్స్ వినియోగ వాహనాలు (ఎస్‌యూవీ) కూడా గణనీయ తోడ్పాటు అందించాయని తెలిపారు.

## తమిళనాట ఫలితాల ప్రభావం..

## సన్‌టీవీ షేర్లు 10% పతనం

తమిళనాడు ఎన్నికల ఫలితాల్లో సినీ నటుడు విజయ్ టీవీకే పార్టీ అనూహ్యంగా దూసుకురావడం, అధికార డీఎంకే ఘోర వైఫల్యం నేపథ్యంలో సన్‌టీవీ నెట్‌వర్క్ షేర్లు పతనమయ్యాయి. ఓ దశలో సన్‌టీవీ షేరు విలువ బీఎస్ఈలో 9.5 శాతం మేర పతనమై రూ.547.55 వద్ద కనిష్ఠాన్ని తాకింది. మార్కెట్ ముగిసే సమయానికి 5.38 శాతం నష్టంతో రూ.573 వద్ద ముగిసింది. తమిళనాడులో గత కొన్ని దశాబ్దాలుగా అధికార పీఠం డీఎంకే, అన్నాడీఎంకే మధ్య చేతులు మారుతూ వస్తోంది. కానీ, ఈసారి ఎన్నికల్లో మాత్రం విజయ్ పార్టీ అనూహ్యంగా తెర పైకి వచ్చింది. 100కు పైగా స్థానాల్లో ఆ పార్టీ దూసుకెళు తోంది. అన్నాడీఎంకే రెండో స్థానంలో ఉండగా.. డీఎంకే ఏకంగా మూడో స్థానానికి పరిమితమైంది. దీంతో సన్‌టీవీ షేర్లు క్షీణించాయి. సన్‌టీవీ యజమాని అయిన కళానిధి మారన్ స్టాలిన్‌కు దగ్గరి బంధువు కావడం గమనార్హం. మరోవైపు దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల ఆరంభ లాభాలు ఆవిరయ్యాయి. ఉదయం భారీ లాభాల్లో ప్రారంభమై ఓ దశలో దాదాపు వెయ్యి పాయింట్లు లాభపడిన సెన్సెక్స్.. దాదాపు 700 పాయింట్లు కోల్పోయింది. మధ్యాహ్నం 12.50 గంటలకు 319 పాయింట్ల లాభంతో 77,232 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 96 పాయింట్ల లాభంతో 24,094 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, హిందుస్థాన్ యునిలివర్, ఎల్‌అండ్‌టీ, రిలయన్స్, బజాజ్ ఫైనాన్స్ స్టాక్స్ లాభాల్లో కొసాగుతుండగా.. కోటక్ మహీంద్రా బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ట్రెంట్, టీసీఎస్, ఐటీసీ స్టాక్స్ నష్టాల్లో కొనసాగుతున్నాయి.

### గుడ్ల ధరలు

హైదరాబాద్ ₹ 5.25 | వరంగల్ ₹ 5.27

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

₹ 1,37,150 (22 క్యారెట్లు) | ₹ 1,49,620 (24 క్యారెట్లు)

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,70,000






# గల్ఫ్ యుద్ధ సెగలు లాటిన్ అమెరికాలో..!

ఎక్కడో దెబ్బ తగిలితే మరెక్కడో నొప్పి రావడం అంటే ఇదే. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం లాటిన్ అమెరికా దేశాలను కుంగదీస్తోంది. ఇంధన ధరల మంట ఈ దేశాల్లో లక్షలమంది జీవితాల్ని ప్రమాదంలోకి నెట్టేస్తోంది. ప్రజా రవాణా చతికిలబడుతోంది. ఆహార ధరలు చుక్కలనంటుతున్నాయి. పశ్చిమాసియా యుద్ధం ఇప్పటికిప్పుడు ఆగిపోయినా.. లాటిన్ అమెరికా ఆర్థిక వ్యవస్థలు కోలుకోవడానికి చాలాకాలం పడుతుందని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు.

అర్జెంటీనా:ద్రవ్యోల్బణం కట్టడికి ఆపసోపాలు పడుతున్న అర్జెంటీనాకు పశ్చిమాసియా యుద్ధం గోరుచుట్టపై రోకటిపోటులా తయారైంది. జీవనవ్యయం విపరీతంతా పెరుగుతోందని జేవియర్ మిలే ప్రభుత్వం చెబుతోంది. యుద్ధం మొదలైనప్పటి నుంచి అర్జెంటీనాలో ఇంధన ధరలు 20% కంటే ఎక్కువగా పెరిగాయి. దీంతో ప్రభుత్వం ప్రజా రవాణాకు కోతపెడుతోంది. బస్సుల సంఖ్యను తగ్గిస్తోంది. ఫలితంగా నగర కేంద్రాల్లో, రద్దీ సమయాల్లో పొడవైన క్యూలైన్లు, అసహనానికి గురైన ప్రయాణికులు కనిపిస్తున్నారు. యుద్ధం కారణంగా మార్చిలో ఇంధన ధరలు 9%, దేశీయ విమాన ఛార్జీలు 24%, నగరాల మధ్య రవాణా ఛార్జీలు 22% పెరిగాయి. నిత్యావసర ధరల పెరుగుదల 10% నమోదైంది. రానున్న నెలల్లో ధరల మోత మరింతగా ఉండొచ్చని బ్యూనస్‌ఎయిర్స్ మాజీ ఆడిటర్ జనరల్ హ్యూగో వాస్క్వెస్ అంటున్నారు.

కోస్టారికా:దశాబ్దాలుగా ఇంధన దిగుమతులపైనే ఆధారపడిన కోస్టారికాకు ఈ యుద్ధం పెనుశాపమైంది. ఇంధన ధరలు తడిసిమోపెడవుతున్నాయి. రవాణా, ఆహార ఖర్చులు కుటుంబ బడ్జెట్లను తల్లకిందులు చేస్తున్నాయని లాటిన్ అమెరికా, కరీబియన్ ఆర్థిక నిఘా యూనిట్(ఈఐయూ) విశ్లేషకురాలు సిసీలియా గొడోయ్ చెబుతున్నారు. యుద్ధం వల్ల కోస్టారికా ప్లాస్టిక్, ఆహార శుద్ధి, ప్యాకేజింగ్ పరిశ్రమలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. కోస్టారికాలో ప్లాస్టిక్ పరిశ్రమ వేలమందికి ఉపాధిని కల్పిస్తోంది. ముడిసరకు ధరల పెరుగుదలతో ఈ రంగం ఇప్పుడు డీలాపడింది.

ఈక్వెడార్:స్వయానా ఇంధన ఉత్పత్తిదారు అయిన ఈక్వెడార్‌లో చమురు ధరలు తరచూ ప్రజా నిరసనలకు కారణమవుతుంటాయి. ధరల సెగ వారిని చాలాసార్లు తాకుతూ ఉంటుంది. ఇంధన ధరల్లో కొంత భారాన్ని ప్రభుత్వం భరిస్తున్నా.. ప్రముఖ చమురు బ్రాండ్ల ధరలు లీటర్‌కు దాదాపు 3 డాలర్ల మేర పెరిగాయి. ఇక నిత్యావసరాల ధరలూ వారికి చుక్కలు చూపిస్తున్నాయి. డీజిల్ ధరల పెరుగుదలకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయకపోతే రవాణా రంగం కుదేలవుతుందని ఈక్వెడార్ రవాణా సమాఖ్య హెచ్చరిస్తోంది.

హైతీ:ఏళ్లుగా హైతీ ఆహార అభద్రతను ఎదుర్కొంటోంది. దేశ జనాభాలో దాదాపు సగం మంది ప్రాథమిక ఆహార అవసరాలను కూడా తీర్చుకోలేకున్నారని ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆరోగ్య కార్యక్రమం చెబుతోంది. సాయుధ గ్రూపుల హింసతో తరచూ ఆహార అత్యవసర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. సుమారు 58 లక్షల మంది హైతీ ప్రజలు తీవ్రమైన ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నారు. గోటిచుట్టపై రోకటిపోటులా ఇప్పుడు ఇంధన సమస్య వారిని మరింత క్షోభపెడుతోంది. మెక్సికో:యుద్ధం వల్ల ఇంధన ధరలు పెరిగినా ద్రవ్యోల్బణం అదుపులోనే ఉందని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ చెబుతున్న మాటలు అవాస్తవాలని తాజా గణాంకాలు రుజువుచేస్తున్నాయి. గత ఏడాది 3.7 శాతం ఉన్న ద్రవ్యోల్బణం ఇప్పుడు దాదాపు 5 శాతానికి చేరింది. దీనివల్ల మెక్సికన్ల సంప్రదాయ ఆహారమైన టోర్టిల్లాల వంటివీ మండిపోతున్నాయి. మెక్సికో దేశ అవసరాల్లో దాదాపు 75% వంటగ్యాస్‌ను, 50 శాతం పెట్రోలును అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటుంది. ధరల మంట తగ్గించడానికి ఇంధన ధరలపై ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నా.. ఉపశమనం ఉండట్లేదు. సబ్సిడీల భారం ఇతర రంగాలపై పడుతోందని మెక్సికో జాతీయ స్వయంప్రతిపత్తి విశ్వవిద్యాలయం ఆర్థిక పరిశోధనా సంస్థ ప్రొఫెసర్ మోరిట్జ్ క్రూజ్ అంటున్నారు.







# ముడి చమురు ఉత్పత్తి పెంపు!

**హర్మూజ్ అంతరాయాలున్నా ఒపెక్+ అంగీకారం**

లండన్: ఒపెక్+ దేశాలు ముడి చమురు ఉత్పత్తి పెంపునకు ప్రణాళికలు రూపొందించినట్లు సంబంధిత వర్గాలు ఆదివారం తెలిపాయి. అయితే అమెరికా-ఇరాన్ యుద్ధ పరిణామాల్లో, గల్ఫ్ చమురు సరఫరాలకు అంతరాయం కలుగుతున్నంత కాలం.. ఈ పెంపు కాగితాలకే పరిమితమవుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 7 ఒపెక్+ దేశాలు జూన్‌లో చమురు ఉత్పత్తి లక్ష్యాన్ని రోజుకు సుమారు 1,88,000 బ్యారెళ్ల మేర పెంచడానికి సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. ఉత్పత్తి పెంపునకు ఒపెక్+ దేశాలు అంగీకరించడం ఇది వరుసగా మూడో నెల. యుద్ధం ఆగాక, చమురు సరఫరా పెంచడానికి ఈ దేశాలు సిద్ధంగా ఉన్నాయని ఈ చర్య సూచిస్తోంది. గత వారం కూటమి నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వైదొలగినప్పటికీ.. ఉత్పత్తి లక్ష్యాలను పెంచే ప్రణాళికలతో ఒపెక్+ ముందుకు సాగుతోంది. సౌదీ అరేబియా, ఇరాక్, కువైట్, అల్జీరియా, కజక్‌స్థాన్, రష్యా, ఒమన్ దేశాలు ఆదివారం సమావేశమయ్యాయి. యూఏఈ వైదొలగడంతో, ఇరాన్‌తో పాటు ఒపెక్+లో ప్రస్తుతం 21 సభ్య దేశాలున్నాయి. ఇటీవల కొన్నేళ్లుగా చూస్తే 7 దేశాలు, యూఏఈ మాత్రమే నెలవారీ ఉత్పత్తి నిర్ణయాల్లో పాలుపంచుకుంటున్నాయి. ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఇరాన్ యుద్ధం, దాని ఫలితంగా హర్మూజ్ జల సంధి మూసివేత కారణంగా ఒపెక్+ సభ్య దేశాలైన సౌదీ అరేబియా, ఇరాక్, కువైట్‌లతో పాటు యూఏఈ నుంచి చమురు ఎగుమతులు కుంటుపడ్డాయి. ఈ కూటమిలో ఉత్పత్తిని పెంచగలిగిన దేశాలు ఇవే.

**హర్మూజ్ జల సంధి తెరిస్తేనే..**

హర్మూజ్ జల సంధిలో నౌకా రవాణా ప్రారంభమయ్యే వరకు, చమురు ఉత్పత్తి పెంపు ప్రభావం చాలా వరకు నామమాత్రంగానే ఉంటుందని, ఆ తర్వాత కూడా సాధారణ స్థితికి రావడానికి కొన్ని వారాలు పడుతుందని అంచనా. చమురు సరఫరాల్లో అంతరాయం కారణంగా 1-2 నెలల్లో విమాన ఇంధన కొరత ఎదురవ్వొచ్చని, ప్రపంచ ద్రవ్యోల్బణం అధికమవుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గత వారం చమురు బ్యారెల్ ధర, నాలుగేళ్ల గరిష్ఠమైన 125 డాలర్లకు చేరిన సంగతి విదితమే. అన్ని ఒపెక్+ సభ్య దేశాల ముడి చమురు ఉత్పత్తి.. మార్చిలో సగటున రోజుకు 35.06 మిలియన్ బ్యారెళ్లుగా ఉంది. ఫిబ్రవరితో పోలిస్తే ఇది రోజుకు 7.7 మి.బ్యారెళ్లు తక్కువ అని ఒపెక్ గత నెలలో తెలిపింది. ఎగుమతులపై ఆంక్షల కారణంగా ఇరాక్, సౌదీ అరేబియా అత్యధికంగా చమురు ఉత్పత్తిలో కోత విధించాయి.



## బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ప్రోత్సాహానికి రూ.37,500 కోట్ల పథకం

దిల్లీ: బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల కోసం రూ.37,500 కోట్ల ప్రోత్సాహక పథకానికి కేంద్ర మంత్రివర్గం త్వరలో ఆమోదం తెలిపే అవకాశం ఉంది. స్వచ్ఛ ఇంధన ఉత్పత్తిని పెంచడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం కోసం ఈ పథకాన్ని తీసుకురానున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ పథకం కోసం బొగ్గు మంత్రిత్వ శాఖ రూ.37,500 కోట్ల ఆర్థిక వ్యయంతో ఇప్పటికే కేబినెట్ నోట్‌ను సిద్ధం చేసింది. దేశవ్యాప్తంగా ఉపరితల బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను వేగవంతం చేయడం ద్వారా ఎల్‌ఎన్‌జీ, యూరియా, అమ్మోనియం నైట్రేట్, మిథనాల్ వంటి కీలక కమొడిటీల దిగుమతులను తగ్గించి.. స్వయం సమృద్ధిని సాధించడమే ఈ పథకం లక్ష్యం. 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు గ్యాసిఫికేషన్ సామర్థ్యాన్ని సాధించాలనే జాతీయ లక్ష్యానికి ఇది తోడ్పడుతుంది. ఈ పథకంలో ఒక ప్రాజెక్టుకు లభించే గరిష్ఠ ఆర్థిక సహాయాన్ని రూ.3,000 కోట్లుగా నిర్ణయించారు. గత పథకంలో ఒక ప్రాజెక్టు కింద ప్రైవేట్ రంగానికి గరిష్ఠంగా రూ.1,000 కోట్లు, ప్రభుత్వ రంగ సంస్థలకు రూ.1,350 కోట్ల ప్రోత్సాహకమే లభించేది. పశ్చిమాసియాలో ఇటీవల తలెత్తిన ఉద్రిక్తతలు, ఇంధన సరఫరాలో అంతరాయాలు కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశీయ బొగ్గును ఇంధనాలు, రసాయనాలుగా మార్చడం ద్వారా ఇంధన భద్రత పటిష్ఠం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం మన దేశంలో 401 బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి.

# ధాన్యం సేకరణలో వేగం పెంచాలి

### లారీల కొరత లేకుండా చూడాలి : కామారెడ్డి కరీంనగర్ ప్రధాన రహదారిపై రైతుల ధర్నా



**గంభీరావుపేట, మే 4 (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట పెద్దమ్మ స్టేజి ప్రధాన రహదారిపై మల్లుపల్లి. నాగంపేట. దమ్మన్నపేట. లక్ష్మీపూర్ గ్రామాల రైతులు ధాన్యం కొనుగోలు అలసత్యం వద్దని కొనుగోలు వేగం పెంచాలని ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. రైతులకు మద్దతుగా నాగంపేట సర్పంచి రాజిరెడ్డి. మల్లు పల్లి సర్పంచ్ సత్యం ధర్నాలు కూర్చొని కొనుగోలు వేగం పెంచాలని అధికారులను డిమాండ్ చేశారు విషయం తెలుసుకున్న ఎస్సై అనిల్ కుమార్ తహసిల్దార్ మారుతి రెడ్డి. వెళ్లి రైతులకు నచ్చజెప్పిన వినకుండా ధర్నా చేశారు ధాన్యం కొనుగోలులో లారీలు అందుబాటులో ఉంచి రైస్ మిల్లర్లతో త్వర త్వరగా దించే ఏర్పాటు చేయాలని కొనుగోలు కేంద్రాలు తీసుకువచ్చిన ధాన్యం ఎక్కడికక్కడనే రాశు లు ఉన్నాయని అధికారులు స్పందించి వెంటనే ధాన్యాన్ని సేకరించాలని లారీల కొరత లేకుండా చూసి మిల్లర్ నుండి ఇబ్బందులు లేకుండా చూడాలని దించుకోవాలని డిమాండ్ చేశారు తాసిల్దార్ మారుతి రెడ్డి రైతులకు నచ్చజెప్పగా కొనుగోలు వేగంగా ధాన్యం సేకరిస్తామని తెలుపగానే రైతులు ధర్నాలు విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



# ప్రజావాణి అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలి

### రాజన్న సిరిసిల్ల కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 04 (జనంసాక్షి) :** ప్రజావాణి అర్జీలపై అధికారులు దృష్టి సారించి, పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 220 దరఖాస్తుల రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నేటి నుండి డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ కార్యాలయాల్లో ప్రతీ సోమవారం ఆర్డీఓ లు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ప్రతీ సోమవారం నిర్వహించే డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఇట్టి ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్‌ఎఫ్ చింత..!

- సంవత్సరాలు గడిచినా చేతికందని సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు
- ప్రతి నెలా 2 వేల దరఖాస్తులు ఆన్లైన్ అవుతున్నా 2 వందలు కూడా మంజూరు కాని దైన్యం
- వీటికోసం ఒక్కోచోట పెద్ద ఎత్తున రాజకీయ పైరవీలు
- మరోవైపు బిల్లులు ఇచ్చేందుకు లబ్ధిదారులను దోచుకుంటున్న ఆసుపత్రులు
- వ్యయప్రయాసలకోర్చి బిల్లులు పెడుతున్నా ఏళ్ల తరబడి నిరీక్షణే






**ఖమ్మం బ్యూరో (జనంసాక్షి)**
"చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్" ఇది బడుగు బలహీన వర్గాల పెన్నిధిగా పిలిచే ప్రతిష్టాత్మక పథకం.. ప్రమాదాలు జరిగి ఆసుపత్రిపాలైనా, ఆరోగ్యం దెబ్బతిని శస్త్ర చికిత్స చేయించుకున్నా అక్కున చేర్చుకునే పథకం.. అప్పులు చేసి బిల్లులు చెల్లించి హాస్పిటల్ గడప దాటాక "నేనున్నా" అంటూ ఉపశమనం కలిగించే బృహత్తర కార్యక్రమం.. మరి ఇలాంటి సీఎంఆర్ఎఫ్ ఇప్పుడు అభాగ్యులను గాలికి వదిలేస్తుంది.. ఫలితంగా హాస్పిటల్ బిల్లుల కోసం బయట తెచ్చిన అప్పులు మీద పడి మరో రోగాన్ని తెచ్చుకునేలా చేస్తోంది.. ఆసుపత్రి ఖర్చులో సగం డబ్బులు చేతికి అందిన ఆ కుటుంబానికి బోలెడంత ఉపశమనం లభిస్తుంది.. అయితే అసలు మంజూరు ఇవ్వకుండా ఏళ్ల తరబడి లబ్ధిదారులను ఎదురుచూపులకు గురిచేస్తుంది ఈ చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్ పథకం.. బిల్లులు జమ చేసి మూడు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ చెక్కు చేతికి అందలేదంటే ఇక ఈ పథకం ఎలా పనిచేస్తుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామానికి చెందిన శ్రీనివాసరావుకు శస్త్ర చికిత్స జరిగి రెండు సంవత్సరాలు పూర్తయింది.. ఆసుపత్రి నుంచి ఇల్లు చేరగానే ఆయన తరపు బంధువులు బిల్లులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ కు పంపారు. మొత్తం రూ.6 లక్షల విలువ చేసే సర్జరీకి సంబంధించిన బిల్లులను ఆన్లైన్ చేసి ఇప్పటికి రెండు సంవత్సరాలు గడిచిపోయింది. అయినప్పటికీ నేటి వరకు సీఎంఆర్ఎఫ్ చెక్కు చేతికి అందకపోవడం విడ్డూరం.

చింతకాని మండలం మత్కేపల్లి గ్రామానికి చెందిన ఉప్పలయ్య అనారోగ్యం పాలై ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందాడు. హాస్పిటల్ బిల్లులు రూ. 3 లక్షలను చెల్లించేందుకు బయట అప్పులు చేసి తిప్పలు పడ్డాడు. ఎలాగూ సీఎంఆర్ఎఫ్ కింద డబ్బులు రాగానే తిరిగి అప్పులు తీర్చేద్దామని భావించాడు. అయితే సీఎం రిలీఫ్ ఫండ్ కోసం హాస్పిటల్ బిల్లులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ద్వారా ప్రభుత్వానికి పంపి ఇప్పటికి మూడు సంవత్సరాలు గడిచిపోయింది. అయినా ఇంతవరకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అతీగతీలేదు.

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ పథకం క్రమంగా అభాసుపాలవు తోంది.. కులం, మతం, వర్గం, వర్ణం తేడా లేకుండా నిరుపేద వర్గాలకు చెందిన ప్రజలకు ఉపశమనాన్ని కల్పించే ఉద్దేశంతో ప్రారంభమైన ఈ పథకం నీరుగారిపోతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో సీఎంఆర్ఎఫ్ పథకం అక్రమాలపై ఉక్కు పాదం మోపింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా అక్రమాలకు పాల్పడిందని ఆరోపిస్తూ ఈ పథకాన్ని ప్రక్షాళన చేసేందుకు శ్రీకారం చుట్టింది. అయితే ప్రక్షాళన చేయకపోగా ఈ ప్రతిష్టాత్మక పథకాన్ని మరింత దిగజార్చేలా ఈ సర్కారు నిర్ణయాలు తీసుకుందన్న విమర్శలున్నాయి. సీఎంఆర్ఎఫ్ కింద లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న 25 రోజులకే ఆధారఖాస్తు ఆన్లైన్లో నమోదవ్వాలి. అలా నమోదైన దరఖాస్తు అతి కొద్ది రోజుల్లోనే మంజూరై చెక్కు రూపంలో లబ్ధిదారి చేతికి అందాలి. అయితే ఈ ప్రక్రియలో లోపాల కారణంగా సంవత్సరాలు గడిచిపోయినా లబ్ధిదారులకు రిలీఫ్ ఫండ్ ఉపశమనం కలగడం లేదు. ప్రతినెలా జిల్లా నుంచి సరాసరి 2 వేల దరఖాస్తులు సీఎంఆర్ఎఫ్ కోసం ఆన్లైన్ అవుతున్నాయి. అయితే కనీసం 2 వందల మందికి కూడా రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు కావడం లేదన్నది అక్షర సత్యం. ఒక్కోచోట రిలీఫ్ ఫండ్ కోసం పెద్ద ఎత్తున రాజకీయ పైరవీలు సైతం జరుగుతున్నాయనటంలో అతిశయోక్తి లేనేలేదు. వాస్తవానికి లబ్ధిదారులు ఆసుపత్రి నుంచి తెచ్చుకున్న బిల్లులను స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ద్వారా ప్రభుత్వానికి పంపాల్సి ఉంటుంది. ఎమ్మెల్యే కార్యాలయంలో ఇందుకోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగ ప్రతినిధులు బిల్లులను తీసుకొని హైదరాబాద్ లోని సీఎంఆర్ఎఫ్ ప్రత్యేక విభాగానికి పంపుతారు. ఇలా పంపిన బిల్లులు 25 రోజుల్లోనే ఆన్లైన్ అవుతాయి. ఆ వెంటనే చెక్కు రిలీజ్ అవుతుంది. అనంతరం ఈ చెక్కులు సంబంధిత ఎమ్మెల్యే కార్యాలయాలకు చేరుకుంటాయి. ఆ తర్వాత ఎమ్మెల్యేలు ఆ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. ఈ ప్రక్రియలో ఇప్పుడు పెద్ద ఎత్తున జాప్యం జరుగుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన సీఎంఆర్ఎఫ్ పథకం క్రమంగా నీరుగారి పోతుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతు భరోసా వంటి పథకాల జాబితాలోకి సీఎంఆర్ఎఫ్ కూడా చేరిపోతుందనే విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

**మరోవైపు ఆసుపత్రుల దోపిడి..**

సీఎంఆర్ఎఫ్ బిల్లులు అనగానే ప్రైవేటు ఆసుపత్రుల పంట పండుతోంది. చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్ కోసం బిల్లులు కావాలని అడిగిన వెంటనే ఆసుపత్రులు చేతులు చాపడం పరిపాటిగా మారిపోయింది. ఈ బిల్లులు ఇచ్చేందుకు ఆస్పత్రులు పేషంట్లను పీల్చి పిప్పి చేస్తున్నాయి. అనారోగ్యంపాలై అప్పులు చేసి ఆసుపత్రికి వస్తున్న లబ్ధిదారుల ముక్కు పిండి మరి డబ్బులు వసూలు చేసి బిల్లులు చేతిలో పెడుతున్న వైనం కలచివేస్తుంది. లక్షల సొమ్ములు అప్పులు చేసి వైద్యం చేయించుకున్న బాధితుడు బిల్లుల కోసం కూడా డబ్బులు వెచ్చించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. రూ. 2 వేలు ఇవ్వనిదే ఆసుపత్రులు బిల్లులను ఇవ్వడం లేదన్న ఆరోపణలున్నాయి. అసలే హాస్పిటల్ నుంచి బతుకు జీవుడా అంటూ బయటికి వస్తున్న బాధితులకు మూలిగే నక్కపై తాటికాయ పడేస్తున్న చందంగా ఆసుపత్రుల తీరు మారింది.

# భద్రతా చర్యలు మరింత బలోపేతం చేయాలి

### నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య

### బ్యాంకు మేనేజర్లు, బంగారు దుకాణాలు, ఏటీఎం సెంటర్లు, ఫైనాన్షియర్లతో సమన్వయ సమావేశం

**నిజామాబాద్ జిల్లా క్రైం మే 04 (జనంసాక్షి)**

కరీంనగర్ జిల్లాలో బంగారం షాపులో జరిగిన దొంగతనం నేపథ్యంలో నిజామాబాద్‌లో భద్రతా అంశాలపై కీలకంగా దృష్టి సారిస్తూ నిజామాబాదు పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య ఆధ్వర్యంలో బ్యాంకు మేనేజర్లు, బంగారు దుకాణాల యాజమాన్యం, ఏటీఎం సెంటర్లు, ఫైనాన్షియర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. నిజామాబాద్ జిల్లాలో 44వ జాతీయ రహదారి, నిజామాబాద్ బార్డర్లో మహారాష్ట్ర సరిహద్దు ఉన్నందున ప్రతి ఒక్కరు అలర్ట్‌గా ఉండాలని తెలియజేశారు. నేరస్తులు జిల్లాలోకి ప్రవేశించి ఇలా వచ్చి అలా వెళ్లే ఆస్కారం ఉన్నందున అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో నగరంలో పెరుగుతున్న ఆర్థిక లావాదేవీలు, బంగారం కొనుగోలు అమ్మకాల నేపథ్యంలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని కమిషనర్ వివరించారు. ముఖ్యంగా బ్యాంకులు మరియు జువెలరీ షాపుల్లో సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయడం, అలారం వ్యవస్థలు ఏర్పాటు చేయడం, సెక్యూరిటీ గార్డులను నియమించడం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. రాత్రి వేళల్లో పహారా బలపరచడం, నగదు, బంగారం రవాణా సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బ్యాంకు మేనేజర్లు, దుకాణ యజమానులు కూడా పోలీస్ శాఖతో సమన్వయంగా పనిచేసి భద్రతను మెరుగుపరచడానికి తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశం ద్వారా నగరంలో చోరీలు, దోపిడీలు వంటి నేరాలను నివారించడంలో కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.




సమన్వయ సమావేశం నిర్వహించి వారి వారి బ్యాంకుల్లో, ఎటిఎంల్లో, బంగారు షాప్‌లలో భద్రతా ఏర్పాట్లు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకుని తగు సూచనలు ఇచ్చారు. భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి రాజీ పడకూడదన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ఏసీపీ ఏ.ప్రకాష్, నిజామాబాద్ టౌన్ సీఐ శ్రీనివాసరాజ్, వన్ టౌన్ ఎస్‌హెచ్‌ఓ రఘుపతి, నిజామాబాదు రూరల్ సీఐ సతీష్ కుమార్, ఎస్‌హెచ్‌వోలు, ఎస్సైలు సిసిఆర్బి సీఐ అంజయ్య, లీడ్ బ్యాంకు మేనేజర్ సునీల్ కుమార్, నిజామాబాద్ గోల్డ్, సిల్వర్ మార్చండి అసోసియేషన్ ప్రెసిడెంట్ పి. లక్ష్మి కాంత్, గోల్డ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎండి యూసుఫ్, ఏటీఎం సెంటర్ల అధికారులు ఫైనాన్స్ అధికారులు పాల్గొన్నారు.

### విధులకు గైర్హాజరు

# కమాన్‌పూర్ రికార్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

**మంథని (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె. చిరంజీవిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. విధులకు నిర్లక్ష్యంగా గైర్హాజరుకావడం, అధికారుల ఫోన్ కాల్స్‌కు స్పందించకపోవడం, వివరణ కోరుతూ జారీ చేసిన మెమోలను స్వీకరించకపోవడం వంటి అంశాలు తీవ్రంగా పరిగణించబడ్డాయి. ఈ విషయంపై కమాన్‌పూర్ తహసీల్దార్ సమర్పించిన నివేదిక ఆధారంగా, సంబంధిత ఉద్యోగిపై శాఖాపరమైన చర్యలు అవసరమని గుర్తించిన కలెక్టర్, ఎ.పి. సివిల్ సర్వీసెస్ (సీసీఏ) నిబంధనల ప్రకారం సస్పెన్షన్ విధించినట్లు తెలిపారు. జారీ చేసిన ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని, శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని పేర్కొన్నారు. సస్పెన్షన్ కాలంలో సంబంధిత ఉద్యోగి ముందస్తు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను వీడరాదని కూడా ఆదేశాల్లో స్పష్టం చేశారు. ప్రభుత్వ సేవల్లో నియమ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన వారికి కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

# ధాన్యం కొనుగోళ్లలో దోపిడీ

**దొడ్డు వడ్ల రైతు కష్టాలు ముదురుతున్నాయ్!**
**జాప్యం ఒకవైపు... తరుగు మరోవైపు**
**రైతు నష్టాలకు బాధ్యత ఎవరిది?**

సిరికొండ, మే 4 (జనం సాక్షి): సిరికొండ మండలంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా దొడ్డు రకం వడ్ల కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం రైతులను ఆర్థికంగా ఇబ్బందుల్లోకి నెడుతోంది. పంటను మార్కెట్‌కు తీసుకువచ్చిన రైతు రోజులు గడిచినా కొనుగోలు జరగకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఇక కొనుగోలు సమయంలో 'తరుగు' పేరిట కోతలు విధించడం రైతులకు మరింత భారంగా మారింది. రైస్ మిల్లుల వద్ద బస్తాకు 2 నుంచి 3 కిలోల వరకు, కొన్ని చోట్ల అంతకంటే ఎక్కువగా తరుగు తీస్తూ రైతులను నిలువుదోపిడీకి గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ తరుగు ఏ నిబంధనల ప్రకారం కట్ చేస్తున్నారు? దానికి బాధ్యత ఎవరిది? అన్న ప్రశ్నలకు సమాధానాలు లేకపోవడం పరిస్థితిని మరింత వివాదాస్పదంగా మారుస్తోంది. కొన్నిచోట్ల మిల్లర్ల ఇష్టారాజ్యంగా ఈ కోతలు జరుగుతున్నాయనే ఆరోపణలు బలపడుతున్నాయి. దొడ్డు వడ్ల విషయంలో రైతు పూర్తిగా ఇరుక్కుపోయిన పరిస్థితి కనిపిస్తోంది. ముందుగా కొనుగోళ్లలో ఆలస్యం చేసి, తరువాత తరుగు కోతలతో నష్టపరచడం వల్ల పంటకు సరైన విలువ దక్కడం లేదని రైతులు మండిపడుతున్నారు. "ఇది నిర్లక్ష్యమా? లేక వ్యవస్థలో వైఫల్యమా?" అన్న ప్రశ్నలు రైతాంగంలో బలంగా వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత వ్యవస్థ నుంచి స్పష్టమైన స్పందన లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలనే డిమాండ్ పెరుగుతోంది. ఒకవైపు ఎరువుల కొరత, మరోవైపు ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని పండించిన పంటను అమ్ముకునే సమయంలో ఇలాంటి పరిస్థితులు ఎదురవడం రైతును తీవ్రంగా కుదేలుచేస్తోంది. మార్కెట్‌కు పంట తీసుకొచ్చిన అన్నదాతకు చివరికి మిగిలేది నష్టాలే అన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని దొడ్డు రకం వడ్ల కొనుగోళ్లలో జాప్యాన్ని వెంటనే తొలగించాలి

తరుగు పేరిట జరుగుతున్న కోతలపై కఠిన నిబంధనలు అమలు చేయాలి కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలి అని రైతులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. రైతు సమస్యలు పరిష్కారం కాకపోతే ఆగ్రహం మరింత పెరుగుతుందని హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

### రైల్వే శాఖలో 2శాతం పోస్టుల తగ్గింపు

# యువత భవిష్యత్తుపై తీవ్ర దాడి

### ఖాళీలు భర్తీ చేయకుండా ఉద్యోగాల నియంత్రణ

### కేంద్ర విధానాలపై ఏఐవైఎఫ్ నిరసనకు పిలుపు.. మే 8న రైల్ నిలయం ముట్టడి




**హైదరాబాద్ (జనంసాక్షి) :** భారత రైల్వే బోర్డు 24 ఏప్రిల్ 2026న విడుదల చేసిన మానవశక్తి హేతుబద్ధీకరణ "మీుఅజూశీషవతీ =ఘఱశీఱుశ్రీఱయ్‌ఱశీఅ 2026--27" నిర్ణయం దేశ యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదకర చర్యగా అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ తీవ్రంగా ఖండిస్తోందని, ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ లోని సత్య నారాయణ రెడ్డి భవన్ లో ఏర్పాటు సమావేశంలో కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ భవిష్యత్ కార్యక్రమ గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర. మాట్లాడుతూ ఈ ప్రణాళిక ప్రకారం రైల్వేల్లో మొత్తం 2% పోస్టులు (సుమారు 29,608 పోస్టులు)పునఃపంపిణీ "తీవసఱర్‌తీఱఎట్‌ఱశీఅ" మరియు లొంగిపోవడం "ఒబతీతీవఅఎవతీ" పేరుతో తగ్గించేందుకు లక్ష్యంగా పెట్టుకోవడం సిగ్గు చేటు అన్నారు. ఇప్పటికే ఉన్న భారీ ఖాళీల నేపథ్యంలో అత్యంత ఆందోళనకర విషయంగా పరిగనిస్తున్నామన్నారు .ఇప్పటికే రైల్వే బోర్డ్ లో అధికారిక లెక్కల ప్రకారం 14,80,455 పోస్టులు ఉంటే, మానవశక్తి హేతుబద్ధీకరణ పేరుతో 2% (29,608 పోస్టులు) తగ్గింపు జరిగిందని, ప్రస్తుతం రైల్వేలో పనిచేస్తున్న సిబ్బంది సుమారు 11 లక్షలు మాత్రమేనని, మొత్తం ఖాళీలు 3-4 లక్షల పోస్టులు ఉన్నాయన్నారు. ఇప్పటికే లక్షల సంఖ్యలో ఖాళీలు ఉన్నప్పటికీ, వాటిని భర్తీ చేయకుండా పోస్టులను తగ్గించడం చూస్తే ఇది స్పష్టంగా ఉద్యోగ అవకాశాల సంకుచితం చేయడమేనని వారు ఆరోపించారు. ప్రభుత్వ విధానం పై ప్రధాన ఆందోళనలు "మానవశక్తి హేతుబద్ధీకరణ" పేరుతో కొత్త నియామకాలను నియంత్రించే ప్రయత్నం భవిష్యత్తులో ఉద్యోగాల సంఖ్య తగ్గే ప్రమాదం రైల్వేలో కీలక విభాగాల్లో ఇప్పటికే సిబ్బంది కొరత తీవ్రంగా ఉందన్నారు. ఇది కేవలం ఉద్యోగాల సమస్య కాదని ఇది ప్రజల భద్రతకు సంబంధించిన ప్రశ్న అని వారు అన్నారు. మే 5 నుండి 7 వరకు ప్రధాన మంత్రి ఉ రైల్వే మంత్రికి పోస్ట్ కార్డు, ఈ మెయిల్స్ ఉద్యమం, మే 8న హైదరాబాద్ లోని రైల్ నిలయం ముట్టడి నిరసన ధర్నా నిర్వహిస్తున్నట్లు వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, నాయకులు అరుణ్, మనోజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పాలమూరు నుంచే కవిత తొలి అడుగు

- కృష్ణా జలాల్లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై గళమెత్తనున్న టీఆర్ఎస్ అధినేత్రి
- 8న చౌదర్ గూడ వద్ద పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సాధన సభ
- పోస్టర్ ఆవిష్కరించిన తెలంగాణ రక్షణ సేన నాయకులు

**రంగారెడ్డి ప్రతినిధి/షాద్‌నగర్ (జనంసాక్షి) :** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీని స్థాపించిన తర్వాత ఆ పార్టీ అధినేత్రి, ఉద్యమ నాయకురాలు కల్వకుంట్ల కవిత పాలమూరు గడ్డ మీది నుంచే రాజకీయంగా మొదటి అడుగు వేయనున్నారు. పార్టీ స్థాపించిన తర్వాత జోగులాంబ అమ్మవారి ఆశీస్సులు తీసుకుని ముందుకు సాగుతానని ప్రకటించిన కల్వకుంట్ల కవిత అన్నట్టుగానే ఈనెల 8న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి కృష్ణా జలాల సాధనకు శంఖారావం పూరించనున్నారు. 8న ఉదయం జోగులాంబ అమ్మవారిని దర్శనం చేసుకోనున్న కవిత అదే రోజు సాయంత్రం పాలమూరు -- రంగారెడ్డి ప్రాజెక్టులో ప్రతిపాదించిన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సమీపంలోని చౌదరిగూడెం వద్ద బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.

టీఆర్ఎస్ పార్టీ స్థాపించిన తర్వాత తన మొదటి ప్రాధాన్యతగా కృష్ణా జలాల సాధనకు శ్రీకారం చుట్టారు. ఈనెల 8న చౌదరిగూడెం వద్ద "పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభ" నిర్వహించనున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించుకుని 12 ఏళ్లు గడిచిన తర్వాత కూడా కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ వెనుకబడి ఉండటానికి పాలకుల లోపభూయిష్ట విధానాలే




కారణమని పలు వేదికలపై నుంచి కవిత స్పష్టం చేశారు. కృష్ణా, గోదావరి నీళ్లను సమర్థవంతంగా వినియోగించుకుంటూ మన బీళ్లకు మళ్లించుకునేందుకు తమ వద్ద స్పష్టమైన విధానాలు ఉన్నాయని కూడా ప్రకటించారు. ఈ క్రమంలోనే కృష్ణా నీళ్ల సాధన కోసం ఉద్యమ కార్యాచరణ ప్రకటించే దిశగా అడుగులు వేస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదట శంకుస్థాపన చేసిన పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు 11 ఏళ్లు గడిచిన తర్వాత కూడా 50 పనులు పూర్తి చేయకపోవడంపై "జనంబాట" కార్యక్రమంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచి ప్రాజెక్టుకు సత్వర అనుమతులు సాధించడంతో పాటు పనులు వేగంగా పూర్తి చేయించడానికి ఉద్యమ ప్రణాళిక ప్రకటించే దిశగా కవిత అడుగులు వేస్తున్నారు. తెలంగాణకు హక్కుగా దక్కే ప్రతి చుక్క నీటిని మన బీడు భూములకు మళ్లించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

**పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభ పోస్టర్ ఆవిష్కరణ**

పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టులో రంగారెడ్డి జిల్లాకు నీళ్లు ఇచ్చే కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సహా మూడు ప్యాకేజీల పనులను 11 ఏళ్ల తర్వాత కూడా ప్రారంభించకపోవడంపై ఉద్యమానికి కవిత శ్రీకారం చుట్టారు. ఈనెల 8న కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సమీపంలోని చౌదరి గూడెం వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేన సీనియర్ నాయకులు పాలమూరు -- రంగారెడ్డి ప్రాజెక్టు సాధన పోస్టర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు నవీన్ ఆచారి, గొంగళ్ల రంజిత్ కుమార్, సయ్యద్ ఇస్మాయిల్, నరేశ్ ప్రజాపతి, ఎదురుగట్ల సంపత్ గౌడ్, సీమ రమేశ్, బుచ్చిబాబు, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.



# రోబోటిక్ మోకాలు కీలు మార్పిడి చికిత్స సక్సెస్

## ప్రొఫెసర్ డాక్టర్ బంగారి స్వామిని అభినందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్ బ్యూరో, మే 04 (జనంసాక్షి) :** హైదరాబాద్ మినహా తెలంగాణ రాష్ట్రం లో మోకాలు కీలు మార్పిడి కి రోబోటిక్ చికిత్సా విధానాన్ని మన జిల్లా కేంద్రమైన కరీంనగర్ కు తీసుకురావడంతో రెనే హాస్పిటల్ చైర్మన్ ప్రొఫెసర్ డా.బంగారి స్వామి, మేనేజింగ్ డైరెక్టర్ డా.బంగారి రజని ప్రియదర్శిని లను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఆదివారం రోజు దోపిడి దొంగల కాల్పుల్లో గాయపడ్డ వ్యక్తిని పరామర్శించడానికి రెనే హాస్పిటల్ కి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ రావడం జరిగింది. దీనిలో భాగంగా ఈ మధ్య కాలంలో నూతనంగా ఏర్పాటు చేసిన రోబోటిక్ వైద్య విభాగాన్ని కేంద్రం మంత్రి సంజయ్ కుమార్ సందర్శించి పని చేసే విధానాన్ని గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ... ఎక్కువ ఖర్చుతో కూడుకున్నప్పటికీ ఇంత మంచి వైద్య పరికరాలను తీసుకురావడం అనేది సాహసోపేతమైన నిర్ణయమని దీనిని ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ చైర్మన్ సునీల్ రావు, కార్పొరేటర్లు ప్రవీణ్ రావు, సోమిడి వేణు, బీజేపీ నాయకులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు కాపాడాలంటూ వినతులు

## హైడ్రా ప్రజావాణికి 56 ఫిర్యాదులు



**హైదరాబాద్, మే 04 (జనంసాక్షి) :** ప్రభుత్వ భూములు కాపాడాలంటూ హైడ్రా ప్రజావాణికి విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూమికి సంబంధించి గజం స్థలం కబ్జా అవుతున్నా నగర ప్రజలు ఊరుకోడంలేదు. గతంలో మనకెందుకులే అనుకునేవాళ్లమని, ఇప్పుడు హైడ్రాకు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటారనే నమ్మకంతో తామంతా వచ్చి ఫిర్యాదు చేస్తున్నామని పలువురు సోమవారం హైడ్రా ప్రజావాణిలో తెలిపారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో హైడ్రా చూపుతున్న చొరవను చూసి తాము ఫిర్యాదు చేస్తున్నామన్నారు. కబ్జాదారులు ఎంతటివారైనా వదిలిపెట్టకుండా ఆక్రమణలు తొలగించడాన్ని అభినందిస్తూనే మా ప్రాంతాల్లో కూడా చెరువులు, ప్రభుత్వ భూములు, పార్కులు, నాలాల ఆక్రమణలకు గురౌతున్నాయని, వాటిని కాపాడాలని పలువురు హైడ్రాను విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం గోపన్నపల్లి విలేజ్‌లోని 100 అడుగుల రహదారికి ఆనుకుని రెండు రోడ్డులు కలిసే చోట ఉన్న ప్రభుత్వ భూమిలో రేకుల ప్రహరీ వేసి లోపల నిర్మాణాలు చేపడుతున్నారని అక్కడి స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ పరిధిలోని ఐడీపీఎల్ కాలనీ నుంచి జగద్గిరిగుట్టకు వెళ్లే మార్గంలో నాలాలపై నిర్మాణాలు చేపడుతున్నారని.. వర్షాకాలం వరద ఇబ్బందులు తలెత్తే అవకాశం లేకుండా వెంటనే ఆపాలని ప్రజావాణిలో కోరారు. కీసర మండలంలోని నాగారం విలేజ్‌లో సర్వే నంబరు 291/3లఓ మొత్తం 2.30 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఉప్పల్ మండలంలోని మల్లాపూర్ గ్రామం సర్వే నంబరు 84లో దాదాపు 2 వేల గజాల స్థలం ప్రభుత్వానిది కాగా.. ఇందులో నిర్మాణాలకు సిద్ధమౌతున్నారని వెంటనే కాపాడాలని కోరారు. కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారం జగద్గిరిగుట్ట ప్రాంతంలో ఆలయాల పేరిట వ్యాపార సముదాయాలు నిర్మించి అద్దెలు ఇచ్చి రూ. లక్షలు



కాజేస్తున్నారని స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కీసర మండలం నాగారం విలేజ్‌లోని సర్వే నంబరు 83లో 18 ఎకరాల మేర ఉన్న పాత లేఔట్‌ను చెరిపేసి 80 గజాల చొప్పున నోటరీమీద స్థలాలు అమ్ముకుంటున్నారని.. పాత లే ఔట్ ప్రకారం పార్కులు, రహదారులు కాపాడాలని ప్లాట్ల యజమానులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం బడంగిపేట గ్రామంలో మల్లప్పగారి కుంట దాదాపు 14 ఎకరాలుంటుందని.. మొత్తం చెరువు స్వరూపాన్ని మార్చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారని ఫిర్యాదులో స్థానికులు పేర్కొన్నారు. పెద్దఅంబర్‌పేటలోని కుంట్లూరు విలేజ్లో ప్రజయ్ గుల్‌మహర్ కాలనీ గేటెడ్ కమ్యూనిటీ కాకపోయినా రహదారులకు అడ్డంగా ప్రహరీలు నిర్మించి పక్కనే ఉన్న కాలనీలకు దారి లేకుండా చేస్తున్నారని అక్కడి స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 56 ఫిర్యాదులందాయి. వీటిని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు పరిశీలించారు. వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు.

### కర్ణాటక టూ కేరళ వరకు..

# మంత్రి శ్రీధర్ బాబు మార్క్ పాలిటిక్స్

## మూడు రాష్ట్రాల గెలుపులో కీలక పాత్ర



**మంథని (జనంసాక్షి) :** కర్ణాటక టు కేరళ వరకు మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కీలక పాత్ర పోషించారు. మంత్రి శ్రీధర్ బాబు మార్క్ పాలిటిక్స్ తో కర్ణాటక, తెలంగాణ, కేరళ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో.. మంత్రి శ్రీధర్ బాబు కాంగ్రెస్ పార్టీకి ట్రబుల్ షూటర్ గా పేరుగాంచారు. మేనిఫెస్టో కమిటీ చైర్మన్ గా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో శ్రీధర్ బాబు కీలక పాత్ర పోషించగా.. అంతకుముందు జరిగిన కర్ణాటక ఎన్నికల్లో హైదరాబాద్ కర్ణాటక ప్రాంతానికి ఇన్చార్జిగా వ్యవహరించి మెజారిటీ అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుని కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో తన వంతు పాత్ర పోషించారు. కాగా ప్రస్తుతం కేరళ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో త్రిసూర్ జిల్లా ఇన్చార్జిగా మంత్రి శ్రీధర్ బాబు వ్యవహరించిన చోట అత్యధిక స్థానాలు గెలుచుకొని కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యుడిఎఫ్ అధికారంలోకి రావడం జరిగింది. మూడు రాష్ట్రాల్లో మంత్రి శ్రీధర్ బాబు మార్క్ పాలిటిక్స్ ఫలించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, తమ నాయకుడి రాజకీయ చాణిక్యం పట్ల మంథని నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్నీ బస్తాలు అందుబాటులో ఉంచాలి

## నారాయణపేట జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో మే 4(జనం సాక్షి):** వరి కొనుగోలు కేంద్రాల లో అవసమైన్నని గన్నీ బస్తాలను అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. కేంద్రాలలో వరి ధాన్యం తడిస్తే సంబంధిత అధికారిదే పూర్తి బాధ్యత అని ఆమె తేల్చి చెప్పారు. సోమవారం కలెక్టర్ మరికల్ మండలం తీలేర్ వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రానికి ఇంత వరకు ఎంత మంది. రైతులు ఎన్ని బస్తాల ధాన్యం తీసుకువచ్చారని, ఎన్ని క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారని సీ.ఈవో ను అడిగి తెలుసుకున్నారు. కొంత మంది రైతులు తమకు గన్ని బస్తాలు ఇవ్వలేదని, కేంద్రంలో గన్ని బస్తాలు ఎక్కువ ఉంచాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని ఆమె సూచించారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కేంద్రంలో ధాన్యం తడిసి పోకుండా టార్పాలిన్లు ఉంచుకోవాలన్నారు. తమకు ఇంతవరకు అధికారులు టార్పాలిన్లు ఇవ్వలేదని, తామే ఇంటి నుంచి తీసుకువచ్చి సాయంత్రం ధ్యానం పై కప్పి వేస్తున్నామని కొందరు రైతులు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. కేంద్రానికి సరిపడా టార్పాలిన్లను తెప్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

### జ్యువెల్లరీ దోపిడీ కేసు..

# బాధితులను పరామర్శించిన బండి సంజయ్



**కరీంనగర్ బ్యూరో, మే 04 (జనంసాక్షి) :** కరీంనగర్‌లో ఇటీవల జరిగిన పిఎంజి జ్యువెలరీ షాప్ దోపిడీ ఘటనపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పందించారు. ఈ ఘటనలో దుండగుల కాల్పుల్లో తీవ్రంగా గాయపడి, కరీంనగర్ లోని రెనే హాస్పిటల్, వెంకటాద్రి ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన సోమవారం రోజు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి పై వైద్యులతో మాట్లాడి, అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కీలక అంశాలను వెల్లడించారు. కాల్పుల్లో గాయపడిన సేల్స్ మేనేజర్‌కు తలలో తూటా దిగిందని, వైద్యులు సమయానికి శస్త్రచికిత్స చేసి దానిని తొలగించడంతో ప్రాణాపాయం తప్పిందని తెలిపారు. మరొక బాధితుడు మధుకర్‌కు భుజం గుండా బుల్లెట్ వెళ్ళిందని, అది గుండెకు తగలకుండా తృటిలో తప్పిందని పేర్కొన్నారు. బాధితులకు అత్యవసర సమయంలో మెరుగైన చికిత్స అందించి వారి ప్రాణాలను కాపాడిన రెనే, వెంకటాద్రి ఆసుపత్రుల వైద్యులకు, సిబ్బందికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. కరీంనగర్ వంటి నగరంలో పట్టపగలు జ్యువెలరీ షాపుపై దాడి చేసి, కాల్పులు జరిపి బంగారం దోచుకెళ్లడం అత్యంత దారుణమని, ఇది అనుకోని సంఘటన అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తో కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

## 'రోజుకు ఒక పూట చిరు ధాన్యాల భోజనం' జాతీయ మిషన్ ప్రారంభం

## ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున మద్దతు



**హైదరాబాద్, మే 4 (జనంసాక్షి) :** ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించే లక్ష్యంతో మిల్లెట్ మార్వెల్స్ ఆధ్వర్యంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ (ఐఐఎంఆర్), న్యూట్రీహబ్ సహకారంతో 'రోజుకు ఒక పూట చిరు ధాన్యాల భోజనం' జాతీయ మిషన్‌ను రాజేంద్రనగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ లో తెలంగాణకు చెందిన ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ప్రారంభించారు. దీని ద్వారా చిరు ధాన్యాల వినియోగంపై ప్రజలలో అవగాహన పెంచడం, ఆరోగ్యకరమైన జీవనశైలికి దారితీసే ఉద్యమంగా రూపుదిద్దడం లక్ష్యం. ఈ మిషన్‌కు ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున మద్దతు తెలిపారు. ఆయన ఒక వీడియో సందేశం ద్వారా రోజు వారీ ఆహారంలో చిరు ధాన్యాలను చేర్చాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన భారత నిర్మాణానికి దోహదపడే ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టిన మిల్లెట్ మార్వెల్స్‌ను అభినందించారు. ప్రతి వ్యక్తి ప్రతి ఇంట్లో మిల్లెట్ల వినియోగాన్ని పెంచాలని ఈ వినూత్న కార్యక్రమం పిలుపునిస్తోంది. ఇది భారతదేశ పోషకాహార రంగాన్ని మార్చే దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా చెప్పవచ్చు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దృష్టికి అనుగుణంగా దేశవ్యాప్తంగా ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించడానికి రూపొందించబడింది. ఈ సందర్భంగా ప్రతిరోజూ ఒక మిల్లెట్ ఆధారిత భోజనాన్ని తమ ఆహారంలో చేర్చుకోవాలని, మిల్లెట్ల ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని, మరో ముగ్గురిని ఈ ఉద్యమంలో భాగస్వాములను చేయాలని ప్రతిజ్ఞ చేశారు. చైన్ పద్ధతిలో జరిగే ప్రచారం ద్వారా ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా వేగంగా విస్తరించి, తరువాత అంతర్జాతీయ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్ కు చెందిన లోక్‌సభ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు కూడా మద్దతు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశ భవిష్యత్తు చిరుధాన్యాలలోనే ఉందన్నారు. చిరుధాన్యాలను ఒకప్పుడు 'పేదల ఆహారం'గా భావించేవారన్నారు. పాలిష్ చేసిన బియ్యం, గోధుమలను సంపన్నతకు సూచికగా ఉండేదన్నారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారుతోందన్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ ఉన్న వారు మళ్లీ చిరుధాన్యాల వైపు మళ్లుతున్నారన్నారు. పేదలు మాత్రం శుద్ధి చేసిన ధాన్యాల వైపు మళ్లుతున్నారని తెలిపారు. వరి సాగుకు అధికంగా నీరు అవసరమని, అందుకు నీటిపారుదల ప్రాజెక్టులపై పెట్టుబడులు పెడుతున్నామని తెలిపారు. అయితే, చిరుధాన్యాల పంటలకు దాదాపు 80 శాతం తక్కువ నీరు అవసరమవుతుందని పేర్కొన్నారు. అవి అధిక పోషక విలువలను అందిస్తాయని తెలిపారు. అందువల్ల అవి పర్యావరణానికి అనుకూలంగా ఉండటంతో పాటు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయని చెప్పారు.

'రోజుకు ఒక పూట చిరుధాన్యాల భోజనం' అనే మిల్లెట్ మార్వెల్స్ కార్యక్రమాన్ని ఆయన ప్రశంసించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో చిరుధాన్యాల వినియోగాన్ని పెంచేందుకు కృషి చేస్తానన్నారు. పాశ్చాత్య దేశాల్లో ప్రజలు చిరుధాన్యాల వైపు వెళ్తుండగా మనం వాళ్లు వదిలిపెడుతున్న ప్రాసెస్డ్ ఫుడ్స్ వైపు వెళ్తుండటం విచారకరమన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను తదుపరి తరాలకు అందించడం మనందరి బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా మిల్లెట్ మార్వెల్స్ వ్యవస్థాపకుడు, సీఈఓ డాక్టర్ భరత్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం చిరుధాన్యాలను సుస్థిరమైన, పోషక విలువలతో కూడిన జీవన విధానంగా స్వీకరించే ప్రజల ఉద్యమానికి ఆరంభం అన్నారు. ఈ మిషన్ ద్వారా మిల్లెట్ మార్వెల్స్ దేశవ్యాప్తంగా ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. ఆధునిక ఆహారంలో సంప్రదాయ ధాన్యాల ప్రాముఖ్యతను బలపరచడం ద్వారా దీర్ఘకాలిక ప్రజారోగ్యం, సుస్థిరతకు తోడ్పడాలనే ఉద్దేశం ఉందన్నారు.

# పారితోషకాలు చెల్లించేంతవరకు నిరసనలు కొనసాగిస్తాం



**గద్వాల టౌన్ మే4 (జనం సాక్షి):** తెలంగాణలో ఆశా కార్యకర్తలు తమకు రావాల్సిన పారితోషకాలు సకాలంలో చెల్లించే వరకు నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం జిల్లా కార్యదర్శి సునీత మాట్లాడుతూ పారితోషకాల చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు.సోమవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఆశా కార్యకర్తలు నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు.మార్చి,ఏప్రిల్ నెలలకు సంబంధించిన పారితోషకాలు ఇప్పటికీ విడుదల కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.ప్రభుత్వం అందించే పారితోషకం తక్కువగా ఉండటంతోనే కుటుంబ అవసరాలు తీర్చుకోవడం కష్టమవుతుండగా అదే పారితోషకాలు నెలల తరబడి ఆలస్యమవడం పరిస్థితిని మరింత దిగజార్చుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.రోజువారీ ఖర్చుల కోసం అప్పులు చేసుకుని జీవించాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు.అత్యవసర సేవలలో భాగంగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటున్న ఆశా కార్యకర్తల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని వారు అన్నారు.గతంలో ప్రభుత్వం రూ.18 వేల స్థిర వేతనం అదనపు పనిభారం తగ్గింపు అర్హులైన వారికి ఏఎన్ఎంగా పదోన్నతులు కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు.అయితే ఆ హామీల అమలు పట్ల ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు.రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెండింగ్లో ఉన్న పారితోషకాలను వెంటనే విడుదల చేయాలని ఇకపై నెలనెలా సక్రమంగా చెల్లించాలని డిమాండ్ చేశారు.తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు నిరసనలు కొనసాగిస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు లక్ష్మీ,పద్మ, అలివేలమ్మ, మహేశ్వరి, పావని, సునీత,లలిత,బిందు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రులు, జడ్జీల పేర్లతో ఐపీఎల్ టికెట్ల దందా

## ప్రముఖుల సంతకాలు ఫోర్జరీ

## ఉప్పల్‌లో కేటుగాళ్ల ముఠా అరెస్ట్



**ఉప్పల్ (జనంసాక్షి) :** ఐపీఎల్ క్రేజ్‌ను ఆసరాగా చేసుకుని అక్రమంగా డబ్బు సంపాదించాలని చూసిన ఒక ముఠా గుట్టును ఉప్పల్ పోలీసులు రట్టు చేశారు. ఏకంగా దేశంలోని అత్యున్నత పదవుల్లో ఉన్న వ్యక్తుల పేర్లను వాడుకొని, అధికారులనే బురిడీ కొట్టించిన తీరు పోలీసులను విస్తుగొలుపుతోంది. వివాల్లోకి వెళ్తే మే 3న ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వద్ద ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులకు, పార్కింగ్ వద్ద టికెట్లను బ్లాక్‌లో విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఉప్పల్ ఎస్.ఐ. ఏ. మాధవరెడ్డి బృందం తనిఖీలు చేపట్టగా, అనుమానాస్పదంగా ఉన్న ఒక మహీంద్రా థార్ వాహనాన్ని (ఊ్రా-40దీదీ-6768) గుర్తించారు. అందులోని వ్యక్తులను విచారించగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ముఠా కేవలం బ్లాక్‌లో టికెట్లు అమ్మడమే కాకుండా, గూగుల్ నుండి జడ్జీలు, మంత్రులు, గవర్నర్ల అధికారిక లెటర్ హెడ్‌లను డౌన్‌లోడ్ చేసేవారు. వాటిపై ప్రముఖుల సంతకాలను ఫోర్జరీ చేసి.. హైదరాబాద్, తమిళనాడు, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్లకు సమర్పించేవారు. వీవీఐపీల కోటాలో ఖరీదైన 'కాంప్లిమెంటరీ' టికెట్లను పొంది, ఆ తర్వాత వాటిని క్రికెట్ అభిమానులకు ఒక్కొక్కటి వేల రూపాయలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

**ముగ్గురి అరెస్ట్ - ముగ్గురు పరారీ**

ఈ కేసులో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా పల్కూరు గ్రామానికి చెందిన గట్టమనేని అశోక్, కంకనాల దినేష్, సింగమనేని వేణుమాధవ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల్లో ఒకరు రియల్ ఎస్టేట్ వ్యాపారి కాగా, మిగిలిన ఇద్దరు ప్రైవేట్ ఉద్యోగులు. కాగా, ఈ ముఠాలో సభ్యులైన చెన్నైకి చెందిన ఆశిష్, సెంథిల్, తాన్సిల్ ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.వీరి వద్ద నుంచి రూ. 1,10,000 విలువైన ఐపీఎల్ టికెట్లు (5 టికెట్లు), మహీంద్రా థార్ వాహనం, 5 మొబైల్ ఫోన్లు, 5 ఫోర్జరీ చేసిన లెటర్ హెడ్‌లను పోలీసుల స్వాధీనం చేసుకున్నారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి పర్యవేక్షణలో, ఉప్పల్ జోన్ డిసిపి సురేష్ కుమార్ , ఎస్.ఓ.టి బృందం చాకచక్యంగా వ్యవహరించి ఈ ముఠాను పట్టుకున్నారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు వెల్లడించారు.

# రెవెన్యూ,అటవీ భూముల సరిహద్దు సమస్యలను పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, మే 4 (జనం సాక్షి):** రెవెన్యూ,అటవీ భూముల సరిహద్దు సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ నగేష్,అటవీ,సివిల్ సప్లై,హౌసింగ్, రెవెన్యూ,మిషన్ భగీరథ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. రెవెన్యూ,అటవీ భూముల సరిహద్దు సమస్యలను పరిష్కరించాలని, ధాన్యంకొనుగోలు లో లోడింగ్ అన్ లోడింగ్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని, వేసవిలో త్రాగు నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని తెలుసుకున్నారు. త్వరగా నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేపట్టాలని ఆదేశించారు. సాదా బైనామాలు పరిశీలించాలని, జనగణన ప్రక్రియలో ప్రజలను భాగస్వామ్యం , స్వీయ గణనలో అధికారులు భాగస్వామ్యం కావాలన్నారు. సంక్షేమ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ సేవలు విస్తరించాలని సభ్యత్వం పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారి జోజీ, ఆర్డీవోలు తాసిల్దార్లు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
05 మే 2026

# గేమ్ ఛేంజర్ కాదు.. తెలంగాణ లూటర్

- తెలంగాణ సొమ్మును దోచుకుని కేరళలో ఖర్చు చేశారు
- 3 రాష్ట్రాల్లో బీజేపీ గెలుపు మోదీ, అమిత్ షా, నితిన్ నబిన్ త్రిమూర్తుల విజయం
- కేటీఆర్‌కు 48 గంటలు టైమిస్తున్నా ఆ వ్యవహారాన్ని బయటపెట్టాలి
- కరీంనగర్‌లో రేవంత్, కేటీఆర్‌లపై విరుచుకుపడ్డ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**కరీంనగర్ బ్యూరో, మే 04 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గేమ్ ఛేంజర్ కాదని, తెలంగాణ లూటర్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ధ్వజమెత్తారు. తెలంగాణ సొమ్మును దోచుకుని కేరళ ఎన్నికల్లో ఖర్చు చేశారని మండిపడ్డారు. రేవంత్ గేమ్ ఛేంజర్ అయితే తమిళనాడు, పుదుచ్చేరి, అసోం రాష్ట్రాల్లోనూ ప్రచారం చేశారు కదా? అక్కడెందుకు గెలవలేదు? అని ప్రశ్నించారు. రేవంత్ గేమ్ ఛేంజర్ అయితే రాహుల్ గాంధీ పప్పు సుద్దేనా? అని ఎద్దేవా చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ 3 రాష్ట్రాల్లో గెలవడంపట్ల సంతోషం వ్యక్తం చేసిన బండి సంజయ్ ఇది త్రిమూర్తుల (మోదీ, అమిత్ షా, నితిన్ నబిన్) విజయమని అభివర్ణించారు. కాందిశీకుల భూముల వ్యవహారంలో రేవంత్ రెడ్డి, బండి సంజయ్ కుమ్మక్కయ్యారని, త్వరలో ఆధారాలను బయటపెడతానంటూ మాజీమంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపైనా తీవ్రంగా స్పందించారు. కేటీఆర్ కు 48 గంటలు టైమిస్తున్నా, నువ్వు మనిషివైతే ఆధారాలను బయటపెట్టు, లేకుంటే నువ్వు చీమకంటే హీనమైన వాడివని ఊరూవాడా ప్రచారం చేస్తా. నిన్ను కరీంనగర్ లో అడుగుపెట్టనీయబోనని సవాల్ విసిరారు. కేటీఆర్ కు దమ్ముంటే బండి సంజయ్, కేటీఆర్ ఆస్తులపై విచారణ జరిపించేందుకు సిద్ధం కావాలని అన్నారు. సోమవారం రోజు కరీంనగర్ లోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై స్పందించారు. 5 రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ కూటమి అస్సాం, బెంగాల్, పుదుచ్చేరి రాష్ట్రాల్లో విజయం సాధించడం సంతోషం. బీజేపీ సైద్ధాంతిక విజయమిది. అభివృద్ధి, జాతీయవాదానికి ఓటేసి గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు. మోదీపట్ల ప్రజల నమ్మకం మరింత పెరిగిందనడానికి ఫలితాలే నిదర్శనం. డబుల్ ఇంజిన్ సర్కార్ తోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్మి ఓట్లేశారు. మోదీ, అమిత్ షా, నితిన్ త్రిమూర్తులు. ఇది త్రిమూర్తుల విజయం. 3 రాష్ట్రాల విజయం బీజేపీ కార్యకర్తలందరికీ స్ఫూర్తిదాయకం. కాంగ్రెస్ ముక్త్ భారత్ లక్ష్యానికి ఈ ఫలితాలు దోహదం. అస్సాంలో ఆత్మగౌరవం గెలిచింది. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి మోదీ ప్రభుత్వం చేస్తున్న కృషికి నిలువెత్తు నిదర్శనం. హిమంత బిశ్వశర్మపై కాంగ్రెస్ విష ప్రచారం చేసినా కాంగ్రెస్ అడ్రస్ లేకుండా పోయింది. పుదుచ్చేరిలో ఎన్డీఏ కూటమికి గతంకంటే ఎక్కువ సీట్లతో అధికారం చేపట్టబోతోంది.

ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఒక్క రాష్ట్రం గెలిచినంత మాత్రాన సీఎం రేవంత్ రెడ్డి గేమ్ ఛేంజర్ అవుతారా?. తమిళనాడు, పుదుచ్చేరి, అస్సాంలో కూడా ప్రచారం చేశారు కదా? అక్కడ ఓడిపోయింది కదా?. ఏ సినిమా అయినా హిట్ అయితే ఐటమ్ సాంగ్ చేసినోళ్లు నావల్లే అనుకున్నట్లుంది. కేరళలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గే సహా 40 మంది స్టార్ క్యాంపెయిన్ చేశారు. రాహుల్ గాంధీ పప్పు సుద్దేనా? రేవంత్ రెడ్డి గేమ్ ఛేంజర్ కాదు తెలంగాణ లూటర్. తెలంగాణ సొమ్మును దోచుకుపోయి కేరళలో ఖర్చు చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో ఇప్పటి వరకు 99 ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. కాంగ్రెస్ పార్టీని ప్రజలు గుర్తించడం లేదు. రేవంత్ గేమ్ ఛేంజర్ అయితే కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఏమైంది? తెలంగాణలో 6 గ్యారంటీల అమలుకు దిక్కులేదు కానీ ఇక్కడ ప్రజల సొమ్ము తీసుకుపోయి కేరళలో ఖర్చు చేస్తున్నారు. కేసీఆర్ గతంలో ఇట్లనే చేశారు. కేసీఆర్ కు పట్టిన గతే రేవంత్ కు పడుతుంది. కేటీఆర్ ఫాల్తు రాజకీయాలు మానుకో. పక్కా ఆధారాలుంటే బయటపెట్టు. నాపై ఆధారాలను చూపకపోతే నిన్ను కరీంనగర్ లో అడుగుపెట్టనీయం. రేవంత్, కేటీఆర్ ముమ్మాటికీ దోస్తులే. అందుకే డ్రగ్స్, కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్లు, ఈఫార్ములా సహా అన్నీ స్కాంలను అటకెక్కించారు. మీ ఇద్దరి చీకటి దోస్తీ వ్యవహారాలను త్వరలో నేనే బయటపెడతా అని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.

# ఆన్‌లైన్ వేధింపుల అడ్డుకట్టకు ‘డిజిటల్ హుందాతనం’ అవసరం

## డిజి, ఉమెన్ సేఫ్టీవింగ్ చారు సిన్హా



**హైదరాబాద్, మే 04 (జనంసాక్షి) :** డిజిటల్ మాధ్యమాల్లో మహిళలు, చిన్నారుల భద్రతే లక్ష్యంగా తెలంగాణ మహిళా భద్రతా విభాగం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ‘స్టాండ్ విత్ హర్’ ప్రచారంలో భాగంగా సోమవారం లక్డీకాపూల్‌లోని డిజి కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో “డిజిటల్ హుందాతనం – గౌరవం “ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భద్రతా విభాగం డిజి చారు సిన్హా మాట్లాడుతూ.. అంతర్జాల వినియోగంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ముఖ్యంగా ఎదుటివారి ఏకాంతాన్ని, అంగీకారాన్ని గౌరవించడమే డిజిటల్ హుందాతనమని పేర్కొన్నారు. డిజిటల్ వేదికలపై మనం చేసే పోస్టులు లేదా సమాచార మార్పిడి ఇతరుల మనోభావాలను ఎలా దెబ్బతీస్తాయో అర్థం చేసుకోవడమే డిజిటల్ సానుభూతి అని ఆమె వివరించారు. సైబర్ స్టాకింగ్, ట్రోలింగ్, బల్లీయింగ్, డాక్సింగ్ వంటి వేధింపుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను దుర్వినియోగం చేయకుండా సానుకూల వాతావరణాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఆన్‌లైన్ వేధింపులపై మౌనంగా ఉండటం నేరస్తులను మరింత ప్రోత్సహించినట్లేనని, బాధితులకు మద్దతుగా నిలిచి వేధింపులను అడ్డుకోవడంలో సమిష్టి బాధ్యత అవసరమని ఆమె స్పష్టం చేశారు. వేధింపులకు గురైతే వెనుకాడకుండా సైబర్ క్రైమ్ పోర్టల్స్ లేదా పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్లకు ఫిర్యాదు చేయాలని, బాధితులకు అండగా ఉండేందుకు చట్టపరమైన నిబంధనలు అందుబాటులో ఉన్నాయని డిజి భరోసా ఇచ్చారు. సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో, సైబర్ భద్రత మరియు చట్టపరమైన అంశాలపై విద్యార్థులు అడిగిన సందేహాలకు అధికారులు సమాధానమిచ్చారు. యువతలో డిజిటల్ భద్రత పట్ల అవగాహన పెంచేందుకు తమ విభాగం నిరంతరం కృషి చేస్తుందని ఆమె పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలపై పర్యవేక్షణ అవసరం

## గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**గద్వాల నడిగడ్డ, మే 04 (జనం సాక్షి) :** వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా విజిలెన్స్ అండ్ ఇన్ఫోర్స్మెంట్ అధికారులు తరచూ కేంద్రాలపై పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. అకాల వర్షాల కారణంగా తడిసిన వరి ధాన్యం కొనుగోలు, ఇతర అంశాలపై సోమవారం హైదరాబాద్ నుంచి మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీసీ అనంతరం మాట్లాడారు. విజిలెన్స్ అధికారులు తమ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి ఎప్పటికప్పుడు నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. రైతులతో ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే వివరాలు ఓపీఎంఎస్ (ఆన్లైన్ ప్రొక్యూర్మెంట్ మేనేజ్మెంట్ సిస్టం)లో ఎంట్రీ చేసి సకాలంలో వారికి డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి అక్రమాలకు పాల్పడిన తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి స్వామి కుమార్, మేనేజర్ విమల, డిఆర్డిఎ ఎపిడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ, మే4 (జనంసాక్షి) :** బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. సోమవారం ఉదయం 6.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,50,920గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,38,340గా ఉంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,51,220గా, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,38,490గా ఉంది. రోవైపు వెండి ధరలు కూడా స్వల్పంగా తగ్గాయి. కిలోకు వంద రూపాయల మేర తగ్గుదల నమోదు చేశాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,69,900గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,64,900గా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.2,69,900గా, బెంగళూరులో రూ.2,64,900గా ఉంది.

# తిరుపతి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

## ఆగివున్న లారీని ఢీకొన్న అంబులెన్స్

## రోగి సహా నలుగురు దుర్మరణం

**శ్రీకాళహస్తి, మే 04 (జనంసాక్షి) :** తిరుపతి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని అంబులెన్స్ ఢీకొన్న ఘటనలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. శ్రీకాళహస్తి సమీపంలోని ఊరందూరు హైవేపై ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో మరో ఇద్దరికి గాయాలు కాగా.. వారిని సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కోల్‌కతా నుంచి ఓ రోగిని చికిత్స నిమిత్తం బెంగళూరు అంబులెన్స్‌లో తరలిస్తుండగా.. ఓరందూరు వద్ద హైవే పక్కన నిలిపి ఉన్న లారీని వెనకనుంచి ఢీ కొట్టింది. అంబులెన్స్‌లో డ్రైవర్‌తో సహా ఆరుగురు ఉన్నట్లు తెలుస్తోంది. సోమవారం తెల్లవారుజామున ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నాయుడుపేట – రేణిగుంట జాతీయ రహదారిపై శ్రీకాళహస్తి మండలం ఊరందూరు వద్ద ఆగి ఉన్న లారీని అంబులెన్స్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో అంబులెన్స్‌లో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోల్‌కతా నుంచి ఒక రోగిని మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరులోని ఓ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. జాతీయ రహదారిపై అప్పటికే నిలిపి ఉంచిన లారీని అంబులెన్స్ వెనుక నుంచి వచ్చి బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి అంబులెన్స్ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్‌లో ఉన్న రోగితో పాటు ఆయనకు సహాయకులుగా ఉన్న మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారని ప్రాథమిక సమాచారం. వీరి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. డ్రైవర్ నిద్రమత్తు వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. అంబులెన్స్ డ్రైవర్ తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు స్పందించి డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న శ్రీకాళహస్తి పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రమాదానికి గురైన వాహనాలను తొలగించారు.

# టీవీకే గెలుస్తుందని ముందే చెప్పాం

## మా ఎగ్జిట్ పోల్స్ ఖచ్చింతంగా పనిచేసాయి

## మా అంచనాలను చాలామంది తప్పు పట్టారు

## యాక్సిస్ మై ఇండియా చీఫ్ ప్రదీప్ గుప్తా

**న్యూఢిల్లీ, మే 04 (జనంసాక్షి) :** తమిళనాట తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన విజయ్ సారథ్యంలోని టీవీకే పార్టీ ప్రస్తుతం 100కు పైగా స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. అధికారాన్ని నిలబెట్టుకుంటుందని అనుకున్న డీఎమ్‌కే మాత్రం వెనుకంజలో ఉంది. ఈ నేపథ్యంలో యాక్సిస్ మై ఇండియా చీఫ్ ప్రదీప్ గుప్తా సోమవారం జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేశారు. టీవీకే పార్టీ 98కి పైగా స్థానాల్లో గెలుస్తుందని తాము ఎగ్జిట్ పోల్స్‌లో అంచనా వేస్తే అంతా నవ్వారని అన్నారు. కానీ చివరకు తమ అంచనాలే నిజమవుతున్నాయని చెప్పారు. అయితే, ఈ విజయం తమది కాదని, డేటా సైన్స్‌ది అని ఆయన వ్యాఖ్యానించారు. ’టీవీకే విజయంపై మా అంచనాను దేశవ్యాప్తంగా ఎవ్వరూ నమ్మలేదు. అలా జరగదని అంటూ మా అంచనాను కొట్టిపారేశారు. రాజకీయ విశ్లేషకులు, పరిశీలకులు, ఇతర పోలింగ్ ఏజెన్సీలు అంతా మమ్మల్ని చూసి నవ్వారు’ అని అన్నారు. డీఎమ్‌కే ప్రభావాన్ని యాక్సిస్ మై ఇండియా ఎక్కువగా అంచనా వేసిందా? అన్న ప్రశ్నకు గుప్తా స్పందిస్తూ డీఎమ్‌కేకు 35 శాతం ఓట్లు రావచ్చని తాము భావించినట్టు చెప్పారు. ప్రస్తుతం 32 శాతంగా ఉందని అన్నారు. ఇక తమ అంచనాకు అనుగుణంగా టీవీకే ఇప్పటివరకూ 35 శాతం ఓట్లు సాధించిందని చెప్పారు. అన్నాడీఎమ్‌కేకు 23 శాతం ఓట్లు వస్తాయని తాము అంచనా వస్తే ప్రస్తుతం వారి వాటా 27 శాతంగా ఉందని అన్నారు. రెండో స్థానంలో స్టాలిన్, మూడో స్థానంలో పళనిస్వామి ఉంటారని తాము నమ్ముతున్నామని అన్నారు. ఫలితాలు వెలువడ్డాక పూర్తి స్పష్టత వస్తుందని చెప్పారు. యువతరం విజయ్‌కు మద్దతు పలకడంతో టీవీకే విజయబావుటా ఎగురవేసిందని చెప్పారు. 18 ఏళ్ల నుంచి 39 ఏళ్ల మధ్య ఉన్న వారు విజయ్‌కు పట్టం కడతారని తాము అంచనా వేశామని అన్నారు. ఈ వయసుల్లోని వారి వాటా తమిళనాడులో 42 శాతంగా ఉందని అన్నారు. 40 ఏళ్లు పైబడిన వారు కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలోనే విజయ్‌కు జైకొట్టారని అన్నారు. అత్యధిక శాతం మహిళల ఓట్లు దక్కించుకున్న పార్టీగా డీఎమ్‌కే తరువాత టీవీకే నిలుస్తుందని కూడా చెప్పారు. అయితే, తమిళనాట మేజిక్ ఫిగర్ అయిన 118 స్థానాలను టీవీకే గెలుచుకోలేని పక్షంలో పార్టీ అధినేత విజయ్ ఏం చేస్తారన్న దానిపై ప్రస్తుతం సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# బెంగాల్ గెలుపుతో విపక్షాల్లో వణుకు

## తెలంగాణలోనూ బిజెపి గెలుపు తథ్యం

## అత్యతంత ప్రతిష్టాత్మకంగా 10న ప్రధాని సభ

## ఎంపి ధర్మపురి అర్వింద్ వెల్లడి

**హనుమకొండ,మే4 (జనంసాక్షి) :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ సాధించిన ఘన విజయం తర్వాత విపక్షాల్లో వణుకు మొదలైందని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. హనుమకొండలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2028 అసెంబ్లీ ఎన్నికలకు పునాది వేసేందుకే ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 10న హైదరాబాద్ వస్తున్నారని చెప్పారు. లక్ష మందితో ఈ భారీ సభ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరగనుందన్నారు. తెలంగాణలో కూడా ఎస్ఐఆర్ అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ.. ’వచ్చే రెండు రోజులు కేసీఆర్‌కు టీవీని దూరంగా ఉంచండి, లేదంటే ఆయనకు గుండెపోటు వచ్చే అవకాశం ఉందని ఎద్దేవా చేశారు. కొందరికి పార్టీలు పెట్టడం, డబ్బులు వసూలు చేయడం బిజినెస్‌గా మారిందని, కేసీఆర్‌తో ఎలాంటి పొత్తులూ ఉండన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రెండేళ్లు నాన్చి సీబీఐకి అప్పగించారు. సీబీఐ తన పని తాను చేసుకుపోతుంది. తెలంగాణలో ఆస్తులు అమ్ముకుంటే తప్ప ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు వచ్చే పరిస్థితి లేదు. ఇక రాష్ట్రంలో అభివృద్ధి పనుల గురించి ఏం మాట్లాడతాం. సన్నబియ్యం ఇస్తున్నామని సీఎం రేవంత్ అంటున్నారు.. వాస్తవానికి ఆ బియ్యం ఇస్తుంది నరేంద్ర మోదీనే. కేసీఆర్ పెట్టిన పంగనామాలను రేవంత్ రెడ్డి కంటిన్యూ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని అన్నారు.

# తెలంగాణలోనూ ఇక బిజెపి ఖాయం


## ఇండియా కూటమికి ఈ ఫలితాలు చెంపపెట్టి

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు

**హైదరాబాద్, మే 4 (జనంసాక్షి) :** తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ప్రజలు ఇండియా కూటమికి బుద్ధి చెప్పారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. ఈ ఫలితాలను చూస్తే తెలంగాణలోనూ భాజపా అధికారంలోకి వస్తుందనేది స్పష్టమవుతోందని వ్యాఖ్యానించారు. గత 33 ఏళ్లు కమ్యూనిస్టులు, 15 ఏళ్లు తృణమూల్ పాలించిన బెంగాల్ కోటలో భాజపా విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. అస్సాంలో మూడోసారి భాజపా కూటమి అధికారంలోకి వస్తోందన్నారు. కుటుంబ రహిత, అవినీతి రహిత పాలన అందించాం కాబట్టే.. అస్సాంలో మళ్లీ తమ పార్టీ విజయం సాధించిందని తెలిపారు. ఉత్తరాది, దక్షిణాది వైషమ్యాలు సృష్టించిన ఇండియా కూటమికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. తమిళనాడులో అధికార డీఎంకే పార్టీ తుడిచి పెట్టుకుపోతుందన్నారు. కూకట్‌పల్లి నుంచి మైనార్టీలు భాజపాలో చేరారని.. ముస్లిం మహిళలు మోదీని పెద్దన్నగా భావిస్తున్నారన్నారు. మే 10న పరేడ్ మైదానంలో జరిగే బహిరంగ సభకు పెద్దఎత్తున జనం తరలిరావాలని పిలుపునిచ్చారు.

# బెంగాల్‌లో బీజేపీ దంగల్

## దశాబ్దంన్నర పాలనకు చెల్లుచీటి • వ్యూహాత్మక ప్రణాళికతో కాషాయదళం విజయం



**కోల్‌కతా, మే 04 (జనంసాక్షి) :** బెంగాల్ దంగల్‌లో బిజెపి గెలిచింది. అనుకున్నట్లుగానే మమతను మట్టి కరిపించింది. టీఎంసీ కంచుకోటను భాజపా బద్దలు కొట్టింది. 15 ఏళ్లుగా ఎదురులేకుండా బెంగాల్‌ను పాలించిన మమతా బెనర్జీకి గట్టి షాకిచ్చింది. గత రెండు దఫాల్లో సాధ్యంకాని విజయం ఈసారి కమలనాథుల వశమైంది. పశ్చిమబెంగాల్ లో అనుసరించిన పదునైన వ్యూహం ఈసారి పార్టీకి కచ్చితమైన ఫలితాన్ని తీసుకొచ్చింది. భాజపా అగ్రనేత అమిత్‌షా అన్నీ తానై ఈ ఎన్నికల్లో పార్టీని నడిపించారు. మొత్తం 293 స్థానాల్లో 205 స్థానాల్లో బిజెపి ఘన విజయం సాధించింది. మమతా బెనర్జీ పార్టీ 85 స్థానాలకు పరిమితం అయ్యింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా అంచనాలను తలకిందులు చేస్తూ మమతా బెనర్జీ సత్తా చాటారు. నాడు భాజపా 10,000 కంటే తక్కువ ఓట్ల తేడాతో 40 స్థానాలు, 5,000 కంటే తక్కువ ఓట్లతో 20 స్థానాలు కోల్పోయి 77 స్థానాలకే పరిమితమైంది. దీంతో దీదీని ఓడించడం అంత సులువు కాదని గ్రహించిన భాజపా వ్యూహాన్ని మార్చుకొంది. సునీల్ భన్సల్ పార్టీ ఇన్‌ఛార్జిగా.. వ్యవస్థీకృత మార్పులు తీసుకొచ్చారు. అమిత్‌షాకు భన్సల్ నమ్మకస్తుడని పేరు. టికెట్ల పంపిణీ విషయంలో సెలబ్రిటీలు, ఫిరాయింపుదార్లకు ప్రాధాన్యం ఇవ్వకుండా క్షేత్రస్థాయిలో పట్టున్న పార్టీ నాయకులకు భాజపా పెద్దపీట వేసింది. ప్రతి బూత్‌స్థాయిలో 300 ఓట్లను సమీకరించగల వారికే టికెట్లు కేటాయించింది. స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన చోట్ల పుంజుకోవడానికి బూత్ స్థాయి మేనేజ్‌మెంట్‌కు తెరతీసింది. పోలింగ్ కేంద్రాల్లో బలమైనవి, దృష్టిపెట్టాల్సినవి, బలహీనమైనవి అంటూ మూడు వర్గీకరణలు చేసింది. ఇక్కడే ’పన్నా ప్రముఖ్’ వ్యవస్థ పనిచేసింది. ప్రతి కార్యకర్త 10–15 కుటుంబాలతో సత్సంబంధాలు నెరిపి 30–60 మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనేలా చేశారు. దీంతోపాటు భాజపా ’శక్తికేంద్రాలు’గా వర్గీకరించుకొన్న క్లస్టర్ల నుంచి అధిక పోలింగ్ ఉండేలా నిర్దేశిరచారు. ఇక అమిత్‌షానే స్వయంగా 152కు పైగా నియోజకవర్గాల్లోని 44,000 పోలింగ్ కేంద్రాల పరిధిలో జరిగిన సమావేశాలను పర్యవేక్షించారంటే భాజపా ఏ స్థాయిలో దృష్టిపెట్టిందో అర్థం చేసుకోవచ్చు. పన్నా ప్రముఖ్ నెట్‌వర్క్‌ను సునీల్ భన్సల్ చూసుకోగా.. బూత్ స్థాయి సమన్వయ బాధ్యతలను భూపేంద్ర యాదవ్ స్వీకరించారు. ఫలితంగా బెంగాల్‌లో రికార్డ్ స్థాయిలో దాదాపు 92శాతం పోలింగ్ నమోదైంది. ఇది భాజపాకు కచ్చితంగా కలిసొచ్చింది. బూత్ స్థాయి సమావేశాల్లో కార్యకర్తలు మమత సర్కారు వైఫల్యం, శాంతి భద్రతల పరిస్థితి, బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు, ఆర్జీకర్ ఆస్పత్రిలో వైద్యురాలిపై హత్యాచారం వంటివి ప్రస్తావించారు. ఇక ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలి తల్లికి కూడా పానిహటి నుంచి భాజపా టికెట్ కేటాయించి.. ఆ అంశాన్ని ప్రచారంలోకి తీసుకొచ్చింది. దీంతో మమతా విజయావకాశాలను దెబ్బకొట్టినట్లయ్యింది. పశ్చిమ బెంగాల్‌లో 70శాతం ఉన్న హిందూ ఓటర్ల ఏకీకరణళి లక్ష్యంగా భాజపా పనిచేసింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను దృష్టిలోపెట్టుకొని వ్యూహాలను అమలు చేసింది. 2021 ఎన్నికల వేళ నేరుగా మమతా బెనర్జీని లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేసి భాజపా దెబ్బతింది. ఈసారి మాత్రం ఆ తప్పు చేయలేదు. స్థానిక ఎమ్మెల్యేల పనితీరు, అవినీతిని లక్ష్యంగా చేసుకొని భాజపా శ్రేణులు ప్రచారం చేశాయి. 220 నియోజకవర్గాల్లోని టీఎంసీ ఎమ్మెల్యేలపై ’ఛార్జిషీట్లు’ విడుదల చేసి ప్రజల్లోకి తీసుకెళ్లారు. 10,000 కిలోమీటర్ల మేరకు భాజపా పరివర్తన్ యాత్రను చేపట్టింది. ఫలితంగా 77 మంది అభ్యర్థులను టీఎంసీ మార్చుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈసారి ఎన్నికల్లో మమతా బెనర్జీకి మొదటి నుంచి అనుకూలించలేదు. ఎన్నికల తేదీలు ప్రకటించిన వెంటనే టీఎంసీ అనుకూల అధికారుల బదిలీలు, ఐప్యాక్‌పై ఈడీ దాడులు దీదీని ఉక్కిరిబిక్కిరి చేశాయి. దీనికితోడు ప్రతి 140 మంది ఓటర్లకు ఒక సిబ్బంది చొప్పున మొత్తం 2.4 లక్షల మంది కేంద్ర సాయుధ బలగాలను మోహరించారు. ఈ నిర్ణయంతో పశ్చిమబెంగాల్‌లో అధికార పార్టీల కార్యకర్తలకు సహజంగా ఉండే దూకుడుకు క్లెళం వేసినట్లైంది. దీనికితోడు సర్ విషయంలో న్యాయస్థానాల వద్ద మమత సర్కారు చేసిన తీవ్ర వ్యాఖ్యలు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీశాయి. పశ్చిమబెంగాల్‌లో మహిళా ఓటర్లను ఆకట్టుకొన్న పార్టీకే విజయం లభిస్తుంది. ఇప్పటికే టీఎంసీ నుంచి వారికి లక్ష్మీభాండార వంటి పలు పథకాలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో మహిళా సాధికారతే తమ మ్యానిఫెస్టో లక్ష్యమంటూ భాజపా అగ్రనేత అమిత్‌షా ప్రకటించారు. అంతేకాదు, ప్రతి మహిళకు నెలకు రూ.3,000 ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం మమత సర్కారు ఇస్తున్న దానికిది రెట్టింపు. గర్భిణులకు రూ.21,000, మహిళలకు ఉచిత బస్సు, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్త్రీలకు 33శాతం రిజర్వేషన్, యువతకు నెలకు రూ.3,000 భృతి, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి ఏక మొత్తంగా రూ.15,000 మద్దతు ప్రకటించింది. వరిని క్వింటాల్ రూ.3,100కు కొనుగోలు వాగ్దానం, పీఎం కిసాన్ సమ్మాన్ నిధిలో రాష్ట్ర వాటా పెంచి రైతులకు ఏటా రూ.9,000 చెల్లించేట్లు ఇచ్చిన హామీలు ఆకర్షించాయి. ఉత్తర బెంగాల్‌పై పట్టు బిగించి.. సహజంగానే ఉత్తరబెంగాల్‌లో భాజపాకు పట్టుంది. ఇక్కడ తేయాకు తోటల సంక్షోభంతో ఇబ్బందులు పడుతున్న రాజబోంగ్షీల సమస్యలపై పార్టీ ఈసారి దృష్టిపెట్టింది. వీరి సంఖ్య 10 లక్షలకు పైగానే ఉంటుంది. ఇక్కడ 2 శాతం ఓట్లు పెరిగినా.. ఈ ప్రాంతంలో తమ సీట్లను 40కు పైగా పెంచుకొనే అవకాశాన్ని గ్రహించి వాడుకొంది. స్వయంగా అమిత్‌షా ఈ ప్రాంతంలో ప్రచారానికి వచ్చారు. శాంతిభద్రత, సరిహద్దుల రక్షణ విషయంలో భాజపా తనదైన శైలిలో ప్రచారం చేసింది. పార్టీ అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లోనే 100? కంచె నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించింది. పశువుల అక్రమ రవాణా, అక్రమ చొరబాట్లను అణచివేస్తామన్న హామీలు ఓటర్లపై పనిచేశాయి. పశ్చిమబెంగాల్‌లో ’బయటవారు’ అన్న ముద్ర పోగొట్టుకోవడానికి భాజపా ప్రచారంలో కూడా జాగ్రత్తలు తీసుకొంది. సువేందు అధికారి, సుకాంత్ మజుందార్, దిలీప్ ఘోష్ వంటివారిని ముందుంచి ప్రచారం చేయించింది. కీలక ప్రాంతాల్లో మాత్రం కేంద్ర నేతలే ప్రచారం చేశారు. కేంద్ర మంత్రి అమిత్ షా రాష్ట్రంలో ఏకంగా 66 ర్యాలీలు చేపట్టారు. ప్రధాని మోదీ 18 కార్యక్రమాల్లో, జేపీ నడ్డా 10 ర్యాలీల్లో ప్రచారాన్ని నడిపించారు. ఇలా వ్యూహాత్మకంగా మమతను దెబ్బకొట్టారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370